# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | యేసు-నిజమైన ఉప్పు | - | 1 |
| 2. | యేసు - ఉప్పుకు సారము నిచ్చుట | - | 9 |
| 3. | ఉప్పుకు సారమునిచ్చుట - 1 : విరిగి నలిగిన హృదయము | - | 19 |
| 4. | ఉప్పుకు సారము నిచ్చుట - 2 : పరీక్షలు | - | 32 |
| 5. | ఉప్పుకు సారము నిచ్చుట - 3 : సాత్వీకము | - | 42 |
| 6. | ఉప్పును శుభ్రపరచుట - 1 : నీతి | - | 53 |
| 7. | ఉప్పును శుభ్రపరచుట - 2 : కరుణ, పవిత్రత, శాంతి | - | 64 |
| 8. | ఉప్పును శుభ్రపరచుట - 3 : శ్రమలు | - | 78 |

# యేసు - నిజమైన ఉప్పు

"మీరు లోకమునకు ఉప్పయి యున్నారు" (మత్తయి 5:13)

ప్రభువు యొక్క కొండమీద ప్రసంగములో ఒక చిన్న వాక్యమైనట్టి దీనికి ఒక ప్రశస్తమైన సందేశమున్నది. మత్తయి 5 నుండి 7 వరకు గల అధ్యాయములందున్న ఈ కొండమీది ప్రసంగము, లోకమంతటికి పరిచయమైనది సువార్తను నమ్మనివారు సహితము ఇందులోని ఆయా అంశములను ఎత్తి చూపుదురు. మానవ కోటికి బహు ఉన్నతమైన నీతి కొంత ఈ ప్రసంగమందుండుట నిస్సందేహమైన విషయము. ఈ మూడు అధ్యాయములలోని యావత్తు ప్రసంగమును ప్రభువు సంక్షేపముగా ఈ నాలుగైదు మాటలలో ఇమిడ్చి యుండుటను నీవు చూడగలవు.

## ఉప్పు అనగానేమి?

**1 రుచి** : ఉప్పు అనగా అర్థమేమిటో ముందుగా తెలిసి కొందుము, ఉప్పు మంచి రుచినిచ్చును. ఏ దేశమందైనను మనుష్యులు ఉప్పులేని వంటలు ఇష్టపడరు. ఎంత శ్రేష్ఠమైన వంటలైనను, ఉప్పు వేయనిచో ఎవరికిని నచ్చవు. ఈ దినము లందు హై బ్లడ్ ప్రెషర్ (high blood pressure) అనేకులను బాధించుచున్నది. ఉప్పులేని పదార్థములే వారు భుజింపవలసి యున్నదని వైద్యులు చెప్పుచున్నారు. అబ్బా! ఇది ఆ రోగు ఎంత కష్టము? ఉప్పులేని కూరలతో కుండడంత అన్నం తినిననుగాని, భుజించినట్లే తోచదు. రవ్వంత ఉప్పు చేర్చినచో పదార్థములు ఎంతో రుచిగానుండును. లోకమునకు ఆరోగ్యంను కలుగ చేయుచు, రుచించునట్టి ఒక జనాంగమును తన కొరకు ఏర్పరచుకొనుట ప్రభువుయొక్క సంకల్పమైయున్నది.

**2. నమ్మకత్వము :** ఉప్పు నమ్మకత్వమునకు సూచనగా నున్నది. మనలో ఒక సామెత చెప్పుదురు. ఏమనగా, ఒకరి ఉప్పుతిని వారికి కృతజ్ఞతాహీనులు కాకూడదు. ఒక కథ ఇట్లున్నది, ఒక దొంగ ఒక ఇంటిలో ప్రవేశించెనట. అందులో మనుష్యులు ఎవరు నుండలేదు. సునాయసముగా పెట్టెలన్నిటిని తెరచి, దిట్టముగా దోపిడి చేసి, ఒక పెద్దమూట కట్టి తల మీద మోసికొని, వెళ్ళిపోవ బయలు దేరుచుండగా, ఒక గూటిలో ఏదో కనబడెను. చూడగా చక్కెరవలె కనబడినందున, కొంత తీసి నోటిలో వేసికొనెను. అది చక్కెరకాదు. ఉప్పు "ఈ ఇంటి ఉప్పుతిని ఇక్కడ దనము నేను దొంగిలించ వచ్చునా?" యని, తనలో తాను చెప్పుకొని, ఆ మూటను అక్కడే విడిచి వెళ్ళిపోయెనట. భక్తి, నమ్మకత్వంలను ఉప్పు సూచించుచున్నది.

**3 చెడక, నిలువ యుంచుటకు** : పధార్థములను నిలువ చేసి యుండటకు కూడా ఉప్పు వాబడబుచున్నది. వెన్నను అట్లే యుంచిన యెడల చెడిపోవును. కొంత ఉప్పు కలిపిన యెడల చాలా కాలముండును, నెయ్యిలో కొత రాతి ఉప్పు కలిపినచో కొన్ని మాసములు చెడకుండును. లేనిచో కొన్ని దినములకే దుర్వాసన వేయును. ఉప్పులేనిదే ఊరగాయలు పెట్టరు. చేపల అన్ని రకములైన మాంసములు ఉప్పులోనే నిలువ చేయుదురు. వస్తువులు చెడక దీర్ఘ కాల ముంచునట్టి గుణము దేనికైత కలదో, దానిని ఉప్పు సూచించు చున్నది.

**4 మైత్రి :** శాశ్వతమైన మైత్రికి కూడా ఉప్పు సూచనగానున్నది. 2 దిన 13:5 చూడుము. 'భంగము కాజాలని నిబంధన' యని ఇక్కడున్నది. పుట అంచులో, దాని భావము 'శాశ్వతమైన మైత్రియొక్క నిబంధన' అని తెలుపబడియున్నది. పాత నిబంధన యందు ప్రతి నైవేద్యమునకు ఉప్పు చేర్చబడుచుండెను. (లేవి 2:13:మార్కు 9:49,50). ఇట్లు, ఉప్పు

దేనిని తెలుపుచున్నదనగా, నిత్య జీవమును మరియు మైత్రిలోను, ప్రేమయందును నమ్మకంగా నుండుటను. దేవుని స్నేహము పొందు నిమిత్తమే ఈ నైవేద్యములు అర్పించబడు చుండెను. ఇవన్నియు ఆలోచింపగా 'మీరు లోకమునకు ఉప్పయివున్నారు'. అని తన శిష్యులతో ప్రభువు ఏల చెప్పెనో అర్థమగుచున్నది. ఆయన చెప్పి చేసిన సమస్తములో ఒక సంకల్పము కలిగియుండెను. సమస్త లోకమునకు ఆనందమును, ఆరోగ్యము నిచ్చు నట్టి ఉప్పును తన శిష్యులద్వారా ఇచ్చుటయే ఆయన సంకల్పము.

# నిజమైన ఉప్పు క్రీస్తే

క్రీస్తులేని లోకము, ఉప్పులేని ఆహారమువంటిదే. అను దినము నీకు సమృద్ధిగా ఆహారము వడ్డింపబడెను. ఏ పూటకు ఆపూటే, రక రకముల పదార్థములుండెను. అయితే దినము తరువాత దినము, ఉదయము, మధ్యాహ్నము, రాత్రి ఉప్పులేని పదార్థముతో ఇట్టి ఆహారము రెండు రోజులు భుజించునంతలోనే నీ ప్రాణము విసిగిపోవును. "ఉప్పులేని భోజనము ఒక భోజనమేనా?" అని అందువు లోకమందు క్రీస్తులేని బ్రతుకు ఒక బ్రతుకేనా?

**1. ఉప్పయి యుండుటకు కొందరిని ఆయన ఏర్పరచు కొనుచున్నాడు.**

ప్రభువైన యేసుక్రీస్తు ఈ భూమికి రాక పూర్వము, లోకమంతయు నొక అరణ్యమే. ఎక్కడైనను సంతోషము లేకుండెను. ఎల్లెడల కష్టములు దుఃఖబాధలే, ప్రభువైన యేసుక్రీస్తు తన పరిచర్య ప్రారంభించెను. ఇంతకు ముందే యోర్దాను నదిలో బాప్తిస్మము పొంది, అరణ్యమందు శోధింపబడియుండెను. అటు వెనుక, ఆయన సూటిగా గలిలయవెళ్లెను. 'నా వెంబడిరండి, నేను మిమ్మును మనుష్యులను పట్టు జాలరులుగా

చేతును.' అని కొందరిని పిలచెను. వారు వెంటనే ఆయనను వెంబడించిరి. (మత్తయి 4:18.22). చూచితిరా, ప్రభువు ఒ పెద్ద సమూహమును వెంటబెట్టుకొని తన పరిచర్య ప్రారంభించలేదు అక్కడ ఒక సమూహము దొరుకలేదా? సమూహముండెను. యొర్దాను చెంత యోహాను బోధించుచు బాప్తిస్మమిచ్చుచుండగా, సమూహములు కూడి వినుచుండిరి. అట్టి స్థలమునకే నజరేతు నుండి ప్రభుయేసు వచ్చి, యోహాను చేత బాప్తిస్మముపొందెను. అచ్చటనే ఉండిపోయి, ఆ సమూహములకు ఆయన బోధచేయునని .ఎవరైవనను తలంచియుండవచ్చును గాని, ఆయన వెంటనే అరణ్యమునకు వెళ్ళి అక్కడ శోధింపబడినపిమ్మట, గలిలయకు వెళ్ళెను. నూరు మైళ్ళకు పైగానే ఈ ప్రయాణం చేసెను. ఏల? ఏలననగా, తన శిష్యులుగా ఏర్పరచ తలంచిన కొద్దిమంది పురుషులు కపెర్నహోము నందుండిరి. గలిలయ, సముద్ర తీరమున ప్రసిద్ధికెక్కిన గ్రామమిది. సీమోను ఆంద్రేయ, యాకోబు, యోహాను, ఇక్కడ నివసించుచుండిరి. ఏ నలుగురు అయిదుగురు, పురుషులకొరకో ఇంత దూరము ప్రయాణము చేసి రావలెనా? అవును, ఈ కొద్దిమందిని సమస్తలోకానికి ఉప్పుగా చేయవలెననియే ప్రభువు వచ్చెను.

**2. అక్కరలోనున్న వారిని తనయొద్దకు రాబట్టు కొనును :** ఈ కొద్ది మంది శిష్యులను ఏర్పరచుకొనిన పిదప ప్రభువు ఆ ప్రాంతములోని సమాజ మందిరంలకు వెళ్ళుచు బోధించుచునుండెను. అప్పుడు సమూహములు ఆయన వెంబడి వచ్చుచుండిరి. రమ్మని వారిని ఆయన ఎప్పుడు పిలువలేదు. వారేవచ్చిరి. ఆయనలో ప్రత్యక్షమగుచుండిన శక్తి, అధికారము వారు చూచుటచేత ఆయనచుట్టు మూగిపోవుచుండిరి. స్వస్థత కొరకు, దయ్యములనుండి విడుదలకొరకును, బీదవారు, భాగ్యవంతులు అన్ని స్థితిగతులలోని వారు వచ్చుచుండిరి. గలిలయ,

దెకపొలి యెరుషలేము యూదయ, ఇంకను యోర్దాను అవతలనుండియు వచ్చుచుండిరి.

గలిలయ నివాసులకు సమస్తము సమృద్ధిగా నుండెను. అది ఫలవంతమైన భూమి; సమృద్ధి ప్రదేశముగా ఆ కాలమందు ఎంచబడుచుండెను. అక్కడ నీరు మేలైనది ధాన్యఫలాదులు, చేపలు విరివిగా కలిగియుండిన దేశము. భూసంబంధముగా గలిలయ నివాసులకు కొదువయుండలేదు. ఇంతటి శ్రేష్టమైన సీమయందున్న జనులలో అనేకులు నానావిధములైన రోగపీడుతులై యుండిరి.

దెకపొలి అనగా అర్ధము "దశనగర వర్గము" ఇది యోర్దాను నదికి ఎనుబది మైళ్ళ దూరమున నుండెను. ఈ పది పట్టణములు ఒక పెద్ద లోయలో నుండెను. ఇచ్చట బహుగంభీరమైన కట్టడములుండెను సౌందర్య, సుఖభోగములకు నిలయమైన ఆ ప్రాంతమందు జరుగు వృత్తులు, అక్కడి ప్రజలకు సౌఖ్యానందములు సమకూర్చునట్టివి. ఇన్ని భాగ్యములు కలిగి యుండినను, ఆ ప్రదేశస్థులు కూడ సంతోషహీనులై ప్రభువైన యేసుక్రీస్తు చెంతకు వచ్చుచుండిరి.

యెరుషలేము ఇశ్రాయేలీయుల మతమునకు కేంద్రస్థానము. ఇచ్చటనే దేవాలయము ఉండెను. దేవాలయమందు పరిచర్య చేయునట్టి ప్రధానయాజకుడు, లేవీయులు, యెరుషలేమందే యుండిరి. ప్రజలకు దేవుని వాక్యము బోధించుటకు ప్రవక్తలు ఇచ్చటనుండిరి. యెరూషలేము నివాసులు తమ దేవాలయమును బట్టియు, తమ ప్రవక్తలు, పితరులను బట్టియు డంబముగా మాట్లాడగలరుగాని, ఆత్మీయముగా అంధులై యుండిరి.

ప్రభువు తనయొద్దకు అన్ని దిశలనుండి ప్రజలను ఆకర్షించు కొనుచుండెను. ప్రభువుకీర్తి వ్యాపించుచుండగా దెకపోలినుండి యోర్దానువరకు, అన్ని దిశలనుండి జనులు వచ్చి, ఆయన చుట్టు మూగిపోవుచుండి. వారిస్థితి ఎట్టిది? ఉప్పులేని ఆహారం వంటిది. మనస్సులోని, జీవితమందుగాని నిజమైన సంతోషమనునది లేనివారు. దేనికిని పనికిరానివారు.

3. "**మిమ్మును ఉప్పుగా చేతును**" : 5వ అధ్యాయం నందు ప్రభువు జన సమూహములను చూచి, తన వర్తమానమును ఇవ్వనారంభించెనని చదువుచున్నాము. వారు వచ్చుట, స్వస్థత పొందు నిమిత్తమేగాని, స్వస్థతవలన ఆనందము కలుగదని వారితో చెప్పెను. ఆయన వారిని స్వస్థపరచెను. ఆయినను వారు సంతోషహీనులుగానే యుండిరి. అందుచేతనే "మీకు అవసరమైనది ఉప్పు" అని వారితో అనెను. ఉత్తర ఇండియాలో ఒకప్పుడు ఒక వైద్యుడుండెను, ఇతడు ఏ రోగమునైనను ఉప్పుతోనే కుదుర్చుటవల్ల, డాక్టర్ లవణము, అని ఆయనకు పేరుపెట్టిరి. నా స్వంత అనుభవముతో గొంతుక రాచుకొని పోయినప్పుడు, అది ఉప్పువలన కుదురుచున్నది. గొంతుకలో తొందర కలిగినప్పుడెల్ల ఉప్పును ఉపయోగించుచుందును. "మీకు సంతోషము కావలయుననిన ఉప్పుమీద ఆధారపడవలెను" అని ఆ సమూహముతో ప్రభువు చెప్పుచున్నాడు. "ముందుగా మీకు ఉప్పును ఇత్తును. అటువెనుక మిమ్మునే ఉప్పుగా చేతును. మీరు లోకమునకు ఉప్పైయుందురు" అనుచున్నాడు. కొంత ఉప్పు చేర్చునప్పటికి కూరలు ఎంత రుచిగానుండునో మనకంతా తెలిసిన విషయమే. "మీరు నాయొక్క ఉప్పును కలిగినవారై యుండిన ఎడల మీరు కొద్దిపాటి నిజమైన వారైనను మీద్వారా సమస్త లోకమునకు శాంతి ఆనంద సంతోషములు

కలిగింతును." అని ప్రభువు తెలుపుచున్నాడు. ఇందుకే, ఆరంభమందు కొద్దిమందినే ఆయన ఏర్పరచుకొనెను. సమూహములనంతా, తన వెంబడి రమ్మని ఆయన ఎన్నడును పిలువలేదు. ఏర్పరచుకొనిన కొద్ది మందితోనే, "నన్ను వెంబడించుడి మిమ్మును, మనుష్యులను పట్టుజాలరులనుగా చేతుననెను." అనగా లోకమునకు మీరు ఉప్పయియుండునట్లు చేతునని దాని అర్థము.

# ఉప్పును శుద్ధీకరించు వాడగు క్రీస్తు

ఉప్పును ఉపయోగించుటకు ముందు శుభ్రపరచవలెను. పాలస్తీనాయందు మృత సముద్రము నీటినుండి ఉప్పు తయారు చేయుచుండిరి. వంటలో ఉపయోగించుటకు దానిని ముందుగా శుభ్రము చేయుచుండిరి. అది ఒకమారే శుద్ధి ఆగుటలేదు. ఒక్కొక్కదశయందు ఒక్కొక్కపని జరుగవలసి యున్నది. మత్తయి 5:3-12లో పది దశలు కనబడుచున్నవి. ప్రభువును వెంబడించుటకు, ఈ పదిదశలగుండా వెళ్ళితేనేకాని, ఎవరును నిజమైన ఉప్పుకానేరరు. సమస్త లోకమునకు ఆశీర్వాదము తెచ్చునట్టి మంచి ఉప్పుగా నుండుట ఎంత సంతోషకరమైనది!

# సారము లేని ఉప్పు

నేడు ఎచ్చట చూచినను, దుఃఖము, బాధలు, సంతోషహీనతయే కనబడుచున్నవి. ప్రజల జీవితములు నిస్సారమైన ఉప్పే. ఉప్పును శుభ్రము చేసినప్పుడు రెండు భాగములగు చున్నది. సారము కలిగినది ఒకటి, నిస్సారమైనది మరొకటి. ఈ రెండవది పారవేయబడును. ఒక్కొక్కప్పుడు నిర్మించబడుచున్న ఒక కట్టడముయొక్క అడుగు భాగమున, పల్లమును సమము చేయుటకై, ఉప్పునుండి వేరుపరచిన

చెత్తతో దానిని నింపుదురు రుచిలేని ఈ ఉప్పు మరెందుకును పనికిరాదు. మనుష్యులకు గాని, పక్షి, వృక్షాదులకుగాని, దానివలన ఉపయోగంలేదు. సారమును కోల్పోయిన ఉప్పువలెనే మనముండిన ఎడల మన స్థితికూడా ఇట్టిదే.

## మంచి ఉప్పయి యున్నావా?

నీ స్థితిని కొంత తలపోయుము సారముగలిగిన ఉప్పయి యున్నావా? సారమును కోల్పోయిన ఉప్పయి యున్నావా? మంచి ఉప్పు కాగలుగుట ఎట్లని ఇకముందకు చూతము. అనేకుల జీవితంలకు క్రొత్తసారం, క్రొత్తసంతోషం తెచ్చువారమైన, మంచి ఉప్పయి మనముండవలెనని, ప్రభువు కోరుచున్నాడు. ప్రభువుయొక్క జాలరులయిపోయిన, ఆ కొద్ది మంది శిష్యులు కలిగి యుండిన సంతోషం ఆ సమూహములు యెరుగురు.

మంచి ఉప్పుగా మనము తయారగుటకు ప్రభువు సహాయము చేయునుగాక.

✤ ✤ ✤ ✤ ✤

# 2

# యేసు ఉప్పుకు సారమునిచ్చుట

"మీరు లోకమునకు ఉప్పయియున్నారు. ఉప్పు నిస్సారమైతే, అది దేనివలన సారము పొందును? అది బయట పారవేయబడి మనుష్యులచేత త్రొక్కబడుటకేగాని మరి దేనికిని పనికిరాదు" మత్తయి 5:13. "ఉప్పుమంచిదేగాని ఉప్పు నిస్సారమైతే దేనివలన దానికి సారము కలుగును? అది భూమికైనను ఎరువుకైనను పనికిరాదు గనుక దానిని బయట పారవేయుదురు" లూకా 14:34-35.

మత్తయి 5:13. అనగా, పైనున్న మొదటి వాక్యమును గూర్చి ఇదివరకే మీరు గమనించి యున్నారు. "మీరు లోకమునకు ఉప్పయియున్నారు." ఆ వాక్యములోని రెండవ భాగమును ఇప్పుడు ఆలోచింతము. లూకా 14:34లోని ఈ అంశముకూడ గమనించెదము. "ఉప్పు మంచిదేగాని ఉప్పు నిస్సారమైతే దేని వవలన [illegible] సారము కలుగును?" ప్రభువు మాట్లాడుచున్నది సారము పోయిన [illegible]యము. ఇది మరువకండి.

## నిస్సారమైన ఉప్పు

(ఎ) రక్షింపబడని వారు.

తన దగ్గరకు వచ్చుచుండిన సమూహములను చూ[illegible], పాపియొక్క బ్రతుకును నిస్సారమైన ఉప్పుకు ప్రభువు పోల్చుచున్నా[illegible] చెప్పియుంటిమి. గలిలయ, దెకపొలి, యెరూషలేము, యూద[illegible] ఇంకను యొర్దాను అవతలినుండి సమూహములు ఆయన

వెంటబడుచుండిరని మత్తయి 4:25లో చూచితిమి. ఈ సమూహములను చూచియే మత్తయి 5:13లోని మాటలను ఆయన పలికెను. రెండు రకములైనవారు ఆయన దృష్టికి కనబడుచున్నారు. చిన్న గుంపు ఒకటి, దీనిని ఉప్పు అనవచ్చును. అయిదువేలు, లేక ఆ సంఖ్యకు పైగానే, ఒక పెద్దగుంపు; దీనిని నిస్సారమైన ఉప్పు అనవచ్చును. మంచి ఉప్పు అనదగినవారు, ఆయనను ఎల్లప్పుడు వెంబడించుచున్న శిష్యులు. వీరిని చేతి వ్రేళ్ళమీద లెక్కించవచ్చును. మిగతా వారంతా అద్భుతములు చూడవలెననియు, రొట్టెలు చేపలు తినుటకును వచ్చువారు. వీరినే నిస్సారమైన ఉప్పుకు ప్రభువు పోల్చుచున్నాడు.

పైన ఇవ్వబడిన లూకా 14:34 నందు, చాలా ముఖ్యమైన సంగతి ఒకటి ప్రభువు చెప్పుచున్నాడు. చీమలు, కీటకములు, పురుగులు పెంటకుప్పనుండి ఆహారము సంపాదించును నిస్సారమైన ఉప్పు పెంటకుప్పలో వేయబడుటకైనను తగదని ప్రభువు అనుచున్నాడు. అది ఎంత పనికిరానిదనగా, చీమలను కీటకములను, పురుగులను, నీవు ఆ నిస్సారమైన ఉప్పులో పడవేసినను, అవి అక్కడ ఉండవు, వర్ధిల్లవు. నిస్సారమైన ఉప్పును ఎక్కడైనా పారవేయవలసినదే. రక్షణలేని వారి స్థితి కూడా ఇట్టిదే.

ప్రభువు నీ పాపములను క్షమించివేసి నీ రోతను కడిగివేసి నీకొక క్రొత్తదైన స్వభావమును ఇచ్చియున్నాడని, సత్యంతోను, సంతోషముతోను, స్పష్టముగా నీవు చెప్పజాలకుంటే, నీవు సారముపోయిన ఉప్పువంటివాడవే. నీవెంతటి వాడవైనను పనికి మాలినవాడవే. నీవు జీవించియుండుట భూమికి బరువే. ఎక్కడ వెళ్లినను, ఎక్కడ నివసించినను, నీ వలన కలుగునవి దుఃఖ కష్టములే.

సత్యము చెప్పుము; నీ జీవితము ఎట్టిది? నీ వలన ఎవరికైనను ఏమేలైనను కలుగుచున్నదా? నీ జీవితము వలన నీ స్నేహితులకు పొరుగువారికి ఆత్మీయ లాభమేమైనా దొరుకుచున్నదా? నీ మాటలు, కార్యములు, సాక్ష్యము, ప్రార్థనలద్వారా నీ సహోదర సహోదరీలు బంధుమిత్రాదులు పొందిన ఆత్మీయ మేలు ఎట్టిది? తిరిగి జన్మించిన మాట సత్యముకాని యెడల, ఇతరులకు నీవు పనికి వచ్చుచున్నావని నీవు యథార్థముగా పలుకలేవు.

## (బి) అవిశ్వాసులైన ఇశ్రాయేలీయులు.

పాలస్తీనా ప్రజలనే దీనికి తగిన ఉదాహరణముగా తీయవచ్చును. దేవునికి అవిధేయులైనందున చెదరగొట్టబడి, లోకమంతట అన్ని దేశములలో నివసించుచుండిరి. అనేక పరిస్థితులు బలవంతపరచగా, వారు తిరిగి స్వదేశములో నివసించుటకు వచ్చుచుండుట చూచుచున్నాము. ఏయే దేశములందు ఉండిపోయిరో, ఆయా దేశములనుండి ధనము జ్ఞానము తెచ్చుకొని, తాము ఆక్రమించుకొనిన భాగము ఒక ఎడారిగా నుండగా దానిని ఒక పాతిక సంవత్సరములలో ఫలవంతమైన భూమిగా మార్చివేసిరి. 25 ఏండ్ల క్రిందట, నీవు పాలస్తీనాను చూచియుండిన యెడల, పట్టి ఎడారినే చూచియుందువు. ఇప్పుడు ఎక్కడ చూచినను, ఎంతో వర్థిల్లుచుండెను. పట్టణములతో నిండిన బహురమ్యమైన దేశమది. ఇప్పటికింకను క్రొత్త క్రొత్త పాఠశాలలు, సర్వ కళాశాలలు స్థాపించుట సాగించుచునే యున్నారు. క్రీస్తు లోకమునకు రాకపూర్వము, చాలా కాలమునకు ముందుగా, అరణ్యము పుష్పించునని ప్రవక్తలు చెప్పియుండుటను వారు లేఖనముల నుండి ఎత్తి చూపగలుగుచున్నారు. ఈ యూదులు లేఖనములను బహు భద్రముచేసి యుంచియున్నారు. యూదులలో నుండి క్రైస్తవులైన విశ్వాసులతో కొన్ని దినములు నేను

పాలస్తీనాలో గడిపితిని; వారి స్వదేశస్థుల విషయము వారు ఎంతగానో చింతించుచుండుటను నాకు తెలిపిరి. ఎన్నో భాగ్యములు కలిగి యుండినను, వారింకను అంధకారమందు ఉన్నారు. సారము కోల్పోయిన ఉప్పు వీరేనని అనవచ్చును. వారు పూర్తిగా ఆత్మీయ అంధకారములో నున్నారు. ప్రభు యేసుక్రీస్తు యొక్క సువార్తయనిన వారికి అధిక ద్వేషము. బహిరంగ సువార్త ప్రకటన ఎవరు చేయకూడదు. వారి దేశమందు చెడుగు ప్రవేశించిన ఎడల వారికి చింతలేదు. ఐరోపా నుండియు, ఇతర దేశముల నుండియు వారప్పటికే అక్కడి చెడుగు వాటిని తమతో తెచ్చుకొని వున్నారు. అయితే, సువార్తనట్టుకు వారికిష్టము లేదు. ఇందుకే, వారు నిస్సారమైన ఉప్పువలె నున్నారు.

### (సి) రొట్టెలు, చేపలు భుజించుటకే ఆయనను వెదకుట.

ఆయన వెంబడి తిరుగుచుండిన పరిసయ్యులు, సద్దూకయ్యుల విషయము ప్రభువు చెప్పినది ఏమనగా, వారట్లు ఆయనను వెంబడించుట, రొట్టెలు భుజించినందువల్లనేయని వారు కోపము తెచ్చుకొనివెళ్లిపోయిరి' యోహాను 6:1-5, 26,27,66. ఏ పాటుపడక, వంటచేయు శ్రమయైనను లేక, అద్భుతకరంగా అహారము పొందుట ఎంతో చక్కగా నున్నదికదా, అని వారు భావించి వుండిరి. 26,27లో ప్రభువు ఇట్లనుచున్నాడు: "మీరు రొట్టెలుభుజించి తృప్తిపొందుట వలననే నన్ను వెదకుచున్నారు క్షయమైన ఆహారము ఎట్టిదైనను మీరు తినుటవలన తృప్తి ఎన్నటికిని పొందలేరు. జీవాహారము నేనే. మీరు నన్ను భుజించవలెను. నన్ను తినుట ఎట్లో నేర్పెదను. అప్పుడు మీరు శాశ్వతముగా జీవించగలరు." ఈ మాటలు, వారు వినినప్పుడు కోపముతెచ్చుకొని, ఆయనను విడిచి వెళ్లిపోయిరి. ప్రవచనములు వారికి పరిచయమే అయినను ఆత్మీయముగా కేవలము గ్రుడ్డివారై వుండిరి. అందుచేతనే వెళ్లిపోయిరి. ప్రభువుకు అంత

సమీపముగా వచ్చియుండిరి గాని, ఏమియు పొందకపోయిరి. దేవుని రాజ్యమును పొందగలిగి వుండియు, వట్టిచేతులతో వెళ్లి పోయిరి. అందుచేతనే సారముపోయిన ఉప్పుతో ప్రభువు వారిని పోల్చుచున్నాడు.

## ఆదరణ, ఆశీర్వాదకరమైన ఉప్పుగా నుండుము

ఆదరించు నట్టియు, ప్రోత్సాహపరచునట్టియు, మంచి ఉప్పుయి వుండుము: దేవుని ఎదుట నీ స్థితి ఎట్లున్నదో తలపోయుము. మంచి ఉప్పుతో పోల్చబడ తగుదువా? లేక నిస్సారమైన ఉప్పువంటివాడవా? మంచి నేర్పరియైన వంటవారికి సరిగా ఎంత ఉప్పు వేయవలెనో తెలియును. కొందరు ఎంత కాలమునకైనను ఈ విషయము తెలసికొనజాలక, ఒకప్పుడు తక్కువగా ఒకప్పుడు అతి విస్తారముగా ఉప్పు వేయుచుందురు. తగు మట్టుకు, సరిపోవునంత ఉప్పు వేసిన యెడల ఆహారము ఎంతో బాగుగాను, రుచికరముగాను వుండును. ఉప్పు ఆహారమునకు రుచి కలిగించునట్లే, నీ జీవితముకూడ నుండవలెను. నీవు ఎక్కడుండినను ఎక్కడకు వెళ్లినను, నీవు యెవరిమధ్య నుందువో వారికి సంతోషము కలిగించునట్టి ఉప్పుగా నీ జీవితము వుండవలెను నీ మాటలు, నీ సాన్నిధ్యము, ఇతరులకు ఆదరణగా నుండవలెను. దేవుని ఎదుట, నీ స్థితి ఎట్లున్నదో నీవే తెలిసికొనవలెనని గోరుచున్నాను. యథార్థవంతుడవై వుండుము. నీ జీవితము వలన ఆత్మీయ ఆశీర్వాదము పొందిన శత్రువులు మిత్రులు చుట్టములు పరాయివారు ఎందరో చెప్పుము? బోధకులమైన మాకు ఉప్పు ఇష్టము. మా గొంతుకలు రాచుకొనిపోయి బొంగురు స్వరములు వచ్చినపుడు మేము ఉప్పును ఉపయోగింతుము. అటి పరిస్థితులయందు ఉప్పుకంటే మేలైనది మరేదియూ లేదు. ఉప్పు విషయము మేమెంతో వందనస్తులము.

ఒకింత ఉప్పువలన ఎంతో హాయి కలుగుచున్నది. ని జీవితము కూడ ఇట్లే నుండవలెను.

స్వాభావికముగా మనము మిరపకాయలవంటి వారము. ఇతరులకు ఆదరణ, హాయి కలిగించే బదులుగా, వారి మనస్సులను నొప్పించి వారికి బాధకలిగించుచున్నాము. నిన్ను దర్శించు వచ్చిన కొందరి విషయము, నీ హృదయమందు నీవిట్లు అనుకొనుచుందువు. "ఇంకా ఎందుకున్నారు? వెళ్ళిపోకూడదా?" పైకి మాత్రము "కొంచెము టీ గాని కాఫీగాని పుచ్చుకోండి" లోలోన మట్టుకు, "అబ్బా, ఎప్పుడు వెళ్లిపోతారో!' యని ఆనుకొనుచుందువు. అట్లే ఎన్నోమారులు మనము అనుకొందుము. వారు, కదలి వెళ్లిపోయినప్పుడు నీ కెంత కులాస! ఇతరులు కొందరున్నారు. వారు నిన్ను దర్శించునప్పుడు నీకొక ఆశీర్వాదము కలుగుచున్నది. వీరు నీ యొద్దనుండి వెళ్లినప్పుడు, నీ కెంతో వ్యసనముగా నుండును; ఒక రవ్వంత ఉప్పువలె నీకు సంతోషము, ఆదరణ, ప్రోత్సాహము కలిగించి నీ కెంతోహాయిని కలుగజేసిరి.

### ప్రభువే మన ఉప్పు - ఆయనే మనకు సారము నిచ్చును.

ప్రభువు మనకు ఉప్పయి, మనలో సారము కలిగించు చున్నాడు. మనయొక్క ఉప్పు ప్రభువైన యేసే. మన జీవంలో ఆయన జీవము ప్రవేశించినప్పుడే ఉప్పువలె జీవించగలము. నాకొక చింత కలదు అదేమనగా ప్రభువు యెదుట నీ స్థితి ఎట్లున్నదో, నీకు నీవే చూచుకొనుట. నీ పేరు వెనుక అనేక బిరుదులు, నీ పాండిత్యమును తెలుపు డిగ్రీలు తగిలించుకొని వుందువు. ప్రజలు నిన్ను ఘనపరచుదురు. అయినను, నీతో దేవుడు ఇట్లనునేమో. "నీవు, శ్రీ ఉప్పుగారు, అయితే నీ సారమంతా పోయెను". అయినను, ప్రభువుచేత నీవు మార్చబడినచో నీవు

వెళ్ళుచోట్లలోనెల్ల ఒక క్రొత్తపేరు నీకు పెట్టుదురు. మంచి ఉప్పువలె నీకు స్వాగతమిచ్చి, నిన్ను అంగీకరింతురు.

ఈ దినంలలో స్త్రీ పురుషులు తమ నాజూకుతనము, విద్య, మేడలు లోకశ్లాఘ్యమును బట్టి అతిశయించువారు. అయినను వీరు అడుగు పెట్టిన స్థలములలో నెల్ల సమాధానము, నెమ్మది, పవిత్రత నశించి, దుఃఖబాధలు, కనబడుచున్నవి. వారి బ్రతుకులు ఎంత అధమ స్థితికి దిగివున్నవో చెప్పగలము. వారు జీవించురీతి అపవిత్రము, అవమానకరమైనది. ఈ పుస్తకము చదువువారిలో, ఇట్టి వారెవరైన నుండినచో, మీరు ఇప్పుడే మార్పబడుదురు గాక యని ప్రార్థించుచున్నాను. రేపటివరకు ఆగవద్దు. ఈ దినమే నీవు మారిపోవలెను. నీ స్వభావము. నీ హృదయము, నీ జీవితము సరిక్రొత్తవి కావలెను. ఇదే నీ విషయము దేవుడు కోరునట్టిది.

.ఇతరులకు సేవచేయుటలో కొందరికి సంతోష సరదాలు కలుగుచున్నవి. ఎందుకనగా, వారు మేలైన ఉప్పుగానున్నారు. ఉప్పుతో నీవిట్లు సంభాషించితివియని భావించుము. "ఉప్పుగారు, వందనములు. మీ వలన నా భోజనం బహురుచిగా నున్నది." ఉప్పుగారి ప్రత్యుత్తరము ఏమైయుండునో? ఇందులో నాకు చెందే ఘనత ఏమీలేదు. పదార్థములలో రుచి/కలిగి. యుండడానికే నేను సృజింపబడితిని. ఆ కార్యము చేయుట నావిధి, నా భాగ్యం నా సంతోషము." వృద్ధుడవయినను, యౌవనస్థుడవైనను, క్రీస్తునాథుని జీవము నీయందుండినయెడల, ఇతరులకు సహాయము చేయు అవకాశములు వెదకుదువు. అవసరమున్నవారికి సదుపాయములు కనిపెట్టుచు, నీవలన వారికి కొంత ఆదరణ, సంతోషము, సౌకర్యములు కలుగునట్లు చేయగలవ ఇతరులకు ఉపకారము చేయగా, నీయొక్క సంతోషము నీలో నిండు

చున్నది. దేవుడు నిన్ను మంచి ఉప్పుగా చేసెనా? లేదా? దేవుని హస్తమందు మేలైన ఉప్పుగా తయారైవున్నావని యథార్థంగా చెప్పగలవా?

**ప్రభువు రుచినివ్వగా నిత్యత్వంనకు ఇతరులతో సంబంధం కలిగియుందుము :**

లూకా 14:25-27 తీసి చూడుము. తల్లి దండ్రులను, భార్య, బిడ్డలను, సహోదర, సహోదరీలను, తుదకు తన ప్రాణమునే ఎవడైనను ద్వేషింపనేల యని విభ్రాంతిచెందు చున్నాము. అయితే లూకా 8:19-21లో మన ప్రభువే దాని అర్థము తెలుపుచున్నాడు. ప్రారంభమందు, ఆయన బంధువులకు చేయుచున్న కార్యములు నచ్చకుండెను. "అతనికి మతిపోయినది. ఏమిచేస్తున్నాడో కూడ ఎరుగకున్నాడా" అనుచుండిరి. అయితే జన సమూహములు ఆయన వెంబడి తిరుగుచుండగా, ఆయన తమ వాడని అందరికి తెలియవలెనని, ఆయనను కలిసి కొనుటకు వెళ్లిరి. ఒకనిని ఈ వర్తమానముతో ఆయన దగ్గరకు పంపిరి. మీ తల్లి, మీ తమ్ములు, నిన్ను చూడవచ్చిరని పోయి అతనితో చెప్పుము." కాని వారు నిజముగా ఆయనను చూడవచ్చియుండరు. ఆ జనము, "ఈమె ఆయన తల్లి అట! వీళ్లు ఆయన తమ్ముళ్ళట!" అనుచు, ఆయనతోపాటు తమ్మును కూడ ఆ సమూహములు గౌరవించవలెనని కోరిరి. ముందేమో "ఇతనికి పిచ్చెక్కినది" అన్నారు. ఇప్పుడైతే, "అతడు మాయన్నే" అనిరి. ఇప్పుడు ప్రభువు ఆ సమాచారము తెచ్చినవారితో ఇట్లనెను. నా తల్లి ఎవరు? నా తమ్ముళ్ళెవరు? దేవుని చిత్తమును నెరవేర్చువారెవరో, వారే నా తల్లియు, నా సహోదర, సహోదరీలై యున్నారు." తల్లి దండ్రులను గాని, సహోదర సహోదరీలనుగాని మనము ద్వేషించునది ఎప్పుడు? ఎవరిలోనైనను పాపం వున్నప్పుడు. ఆ పాపమును ద్వేషించుచున్నాము. పాపముతో సహవాసము మనకుండరాదు, స్వాభావికముగా

సమస్తమైనవారు పాపులైనందున వారు మనకు సత్య సోదర సోదరీలు కానేరరు. ప్రభువునకు చెంది, ఆయన చిత్తము చేయువారెవరో, వారు నిత్యత్వమునకు మన సోదర సోదరీలై యున్నారు. నిత్యత్వంనకు నిన్ను ప్రేమించునట్టి సత్య సోదర సోదరీలు నీకు కావలెనంటే, తోబుట్టువులమీద నీకు కలిగిన పక్షపాతపు ప్రేమ నీవు విడువవలెను. అప్పుడే నీ స్వంత తోబుట్టువులకే గాక నీవు ఎచ్చటకు వెళ్ళినను సమస్తమైన వారికి నీవు ఉపయోగపడుదువు. అనేక దేశములలో ఎన్నెన్నో నగరములను దర్శించుబాగ్యం నాకు కలిగెను. అక్కడ అక్కడ కలిసికొనిన వారిలో ఎవరైనను వారికి చెప్పబడిన కొన్ని మాటలవలన మేలుపొందిరని వ్రాయుటరద్దు. అది వినినప్పుడు ఎంతో సంతోషము కలుగుచున్నది. ఇతరులకు సహాయం చేయుటకు మనకు అనుగ్రహింపబడిన భాగ్యము ఎంతగొప్పది.

## రా, రమ్ము ఆయనయందు నిలిచి యుండుము

ఈ మాటలు తిరిగి అడుగనిమ్ము. ఇతరులు అనుదినము నీ వలన పొందుచున్న ప్రోత్సాహము ఆదరణ, సమాధాన సంతోషములు ఎంతటివి? లేకుంటే సారము పోయిన ఉప్పు వంటి వాడవా? ఇట్టి ఉప్పు భూమికి ఎరువు పెట్టుటకు కూడ పనికారాదు. పురుగుల కీటకములు వసించు పెట్టకుప్పలకైనను పనికి రాదు. ఎవరికిని పనికి రాదు. అట్టి బ్రతుకు వృధాబ్రతుకే ప్రాణముపోయే సమయమున అనేకులు కన్నీళ్ళతో ఇట్లనుట నేను వినియున్నాను. "ఇంక సమయం మించిపోయింది, నాకు కొనప్రాణంవున్నది. నాకు వట్టి వ్యర్థ బ్రతుకే కనబడుచున్నది. " ఈలాటి బ్రతుకు బ్రతుకకుండ చూచుకొనుము. నీ బ్రతుకు ఫలించునట్టిదియు లాభకరమైనదియు కాగలదు. నీ దగ్గరకు వచ్చిన ప్రతివారు ఏదో యొకటి నీ వలన పొందగలరు. నిన్ను మార్చివేయుశక్తి ప్రభువు

కలిగియున్నాడు యేసు యొద్దకువచ్చి ఇట్లు ఆయనతో చెప్పుము. "ప్రభువా! ఇంతవరకు నిస్సారమైన ఉప్పువలె నుంటిని, ఒక్కరికైనా నేను అవసరము లేదు, నన్ను ఈ దినమే మార్చివేయువా? అప్పుడు నా కళాశాలలో నా వ్యాపారమందు గాని ఎక్కడున్నను ఇతరులకు నేను ఆదరణ కలిగించుచు ఫలించువానిగా నుండగలను".

యేసు ప్రభువు తన్ను వెంబడించుమని కొందరిని పిలిచి వారితో "మిమ్ము, మనుష్యులను పట్టువారిగా తయారు చేతును" అనెను. నిన్నుకూడ ఇట్లు తయారు చేయగలడు. ముందుగా నీవు ఆయన యొక్క ఉప్పుగానుండిన ఎడల, నీ జీవితము, నీ ప్రార్థనద్వారా స్త్రీ పురుషులు రక్షింపబడగలరు.

తీగెద్రాక్షావల్లిలో నిలిచియుండకుంటె, తనంతట తానే ఫలించునా? లేదు, వాడిపోవును. యోహాను 15:4 చూడుము. ద్రాక్షావల్లిలో నిలిచియుంటేనే ఫలించును. యేసుక్రీస్తునాథుని జీవము నీయందు ప్రవహించుచుండిన ఎడల వాక్యము ద్వారాను క్రియద్వారాను ఫలించగలవు. మన జీవితములు ఫలించునది క్రీస్తుయందు నిలిచియుంటేనే. మరొక మార్గములేదు క్రీస్తు జీవము నీలో ప్రవహించుచున్నదా? లేనిచో, ఇప్పుడే ప్రభువైన యేసుక్రీస్తు నొద్దకువచ్చి పాపక్షమాపణ పొందుము. ఈ క్షణమే ఆయనకు మొర పెట్టుము. నిన్ను క్షమించి తన జీవము నీలో పోయును. ఆయన యందు నలిచియుండుట ఎట్లు, ఫలించుట ఎట్లో నీకు నేర్పును.

✤ ✤ ✤ ✤ ✤

# 3

# ఉప్పు సారము నిచ్చుట - 1

## విరిగి నలిగిన హృదయము

## ఏర్పరచుకొనబడిన కొందు ఉప్పగుదురు

"మీరు లోకమునకు ఉప్పయి యున్నారు" మత్తయి 5:13. కొందరు శిష్యులను వెంటబెట్టుకొని, యేసు ప్రభువు గలిలయ ప్రదేశమందు సంచరించుచుండెను.

దెకపొలి, గలిలయ, యొర్దాను, యెరూషలేము, యూదయల నుండియు, యొర్దాను అవతలి నుండియు, అనగా ఆ దేశపు అనేక భాగములనుండి, సమూహములు ఆయన వెంట బడచుండిరి. ఆయన చేయు అద్భుతములను గూర్చి వినియుండిరి గనుక స్వస్థత పొందు నిమిత్తము, ఆయన యొద్దకు వచ్చుచుండిరి. ప్రభువుయొక్క ఒక గొప్ప సంకల్పము, భూమి మీద జరుగవలసియున్న పనికొరకు కొందరిని శిష్యులుగా ఏర్పరచుకొనెను. ఈ సమూహములు ఆయనచుట్టూ మూగుట చూచి, ఆయన కొండపైకి పోయెనని చెప్పబడియున్నది. గలిలయకు ఈ కొండ ఎంతో దూరమునలేదు. దీనిమీద నుండియే 'పర్వత ప్రసంగము' అనబడు ప్రసిద్ధికెక్కిన గొప్ప బోధ చేసెను. మత్తయి 5,6,7, అధ్యాయములందు ఈ ప్రసంగము కనబడుచున్నది. ఆ సందర్భమందే, "మీరు లోకమునకు ఉప్పయి యున్నారు" అని ఆయన చెప్పుట. సర్వలోకమునకు వెలుగు, ఉప్పు, ఇచ్చుటకై ఆయన పావులను వెదకి

రక్షింపవచ్చెను. ఆయన ఏది చేసినను, ఒక్క ఉద్దేశముతోనే చేసెను; నరజాతికి నిరంతర సంతోషము కలిగించునట్టి ఉప్పును, నిత్యజీవమును కలిగించునట్టి వెలుగును ఇచ్చుటకే ఆయన చేతిలో మనము పడగా మనమెట్లు ఉప్పయి పోదుమో, దేవుని వాక్యమునుండి తెలిసికొను చున్నాము. సముద్రపు ఒడ్డున ఉప్పును తయారు చేయుట మీలో కొందరు చూచియుందురు. సముద్రపు ఉప్పు నీటినితీసి ఆవిరియై పోవునట్లు చేయుదురు. ఉప్పు అడుగున నిలిచిపోవును. ఈ ఉప్పును శుభ్రము చేయనిదే ఉపయోగించలేము. శుభ్రము చేయబడినట్టి మేలైన ఉప్పే దేవునికి కావలెను. మనలో ప్రతియొక్కరము, ఇట్టి ఉప్పు కాగలము. బహుకొద్ది వారమే అయి యుండినను, మనము ఎక్కడ ఉండినను; ఆదేశమంతటికి సంతోషము తేగలము. మంచి భోజనము తయారు చేయుటకు ఎంతో ఉప్పు అవసరములేదు. అనేక మందికి వడ్డించవలసిన భోజనము రుచిగా చేయుటకు కొంత ఉప్పు చాలును. అనేక పట్టణములలో, నగరములలో, గ్రామములలో యిద్దరు లేక ముగ్గురు లేక నలుగురే కొద్దిమందే అయిననూ, ఆనందము సంతోష హర్షములు, వెలుగు, ఆ ఊరి వారందరికి కలుగజేయుటకు ఆ కొద్ది మందియే చాలును. ఒక పర్వత శిఖరము మీదనున్న పట్టణమునకు విశ్వాసులను సరిపోల్చుటకు కారణమిదే. పర్వతము మీదనున్న పట్టణమును ఎన్నోమైళ్ళ దూరమునుండి చూడగలము. ప్రభువైన యేసుక్రీస్తునందు జీవము, వెలుగు కలవని ప్రజలకు చెప్పుటకు ఒక విశ్వాసి చాలును.

సమూహములు ప్రభువైన యేసుక్రీస్తు వెంట తిరిగినను, శిష్యులై పోయినవారి సంఖ్య బహుచిన్నది. అయినను, ఈ కొందరే భూలోకమును తలక్రిందులు చేసిరి. వారు సామాన్య పురుషులే, కాని ప్రభువైన యేసుక్రీస్తు

యొక్క శిష్యులగుటచే ఉప్పాయిపోయిరి. దేవుని యొక్క ప్రేమ వీరి ద్వారానే సమస్త దేశములకు తెలుపబడెను.

## నిజమైన ఉప్పు - దైవ ప్రేమ

ఉత్తర ఇండియాలోని కొన్ని భాగములలో, ఒక అతిథి వచ్చినయెడల, తినుటకు ఎక్కువ ఉప్పుకలిపి చేసిన ఫలహారం, ఒక గ్లాసు నీళ్ళను యిత్తురు. దీని భావమేమనగా, "నిన్ను అంగీకరించి, స్వాగత మిచ్చుచున్నాము" అని ఆ చుట్టముతో చెప్పుట. నిజమైన, గాఢమైన ప్రేమకు ఉప్పు గుర్తుగానున్నది.

విశ్వాసులు, సత్యవాత్సల్యము చూపగలరు. సహపాటి విశ్వాసులు చూపునట్లుగా, తల్లిదండ్రులుగాని, సోదరసోదరీలు గాని, స్నేహితులుగాని నీరు ప్రేమ చూపజాలరు. మానవ ప్రేమ మారిపోవును. కాలము, సందర్భము, స్థితిగతులు మారుచుండగా, మానవ ప్రేమకూడా మారును. ప్రభువైన యేసుక్రీస్తు, "మీరు లోకమునకు ఉప్పయి యున్నారు" అని చెప్పుచున్నాడు. అనగా, ఎక్కడ వెళ్ళినను, నీ ద్వారా తన నిత్యజీవము ప్రత్యక్షపరచబడి, ప్రకటించబడి బోధింపబడవలెను. తిరిగి జన్మించిన వారిద్వారా 1155 కంటె అధికంగా ఆయా భాషలు మాట్లాడు జనులు ఆ ప్రేమను పొందియున్నారు. మానవ సాంగత్యము నుండి వెలివేయ బడినట్టివారు, అనగా నరమాంస భక్షకులు, నరహంతకులు, దొంగలు మొదలైన వారు, తిరిగి జన్మించిన తరువాత దేవుని ప్రేమను గూర్చి ఇప్పుడు సాక్ష్యమిచ్చుచున్నారు.

గత ప్రపంచ యుద్ధమందు, ఒకానొక ఆసుపత్రియందు, బహు భయంకరముగా గాయములు పొందిన ఒక సిపాయి పడియుండెను. ఈ ఆసుపత్రిని జార్జిరాజుగారు దర్శించుచు, ఇతని మంచము కడకువచ్చి

అతడు పడుచున్న నొప్పి, బాధనుచూచి, మనస్సు చాలా నొచ్చుకొని, అతనితో ఇట్లనిరి "యువకుడా, నీకు నేను చేయగలిగిన దేదైనా వున్నదా? నీ విన్నపమేదైనా వున్నదా?" సిపాయి ఇట్లు ప్రత్యుత్తర మిచ్చెను "ఏలినవాడా, నాకొక విన్నపమున్నది. ఇన్ని మాసములుగా, ఇంతదయతో, ప్రేమతో నన్ను చూచుకొంటున్న నర్సుకు వందనములు చెల్లిస్తారా?" ఈ మాటలు పలుకుచున్నప్పుడు అతని కండ్లలో నీరుండెను. " ఈ నర్సు నన్ను చూచుకొన్న రీతిగా నాతల్లిగాని, సోదరిగాని చూచుకొని యుండరు. రాత్రింబగళ్ళు ఎంతో దయతో, ప్రేమతో, ఓర్పుతో, నన్ను చూచుకొనుచున్నది. అయ్యా నా పక్షముగా ఆమెకు, మీరు వందనములు చెప్పండి." రాజుగారు ఆ నర్సును పిలిపించి, 'అమ్మా! గాయాలు తగిలిపడివున్న ఈ నాయుద్ధభటుని అంత దయగా నీవు చూచుకొను చున్నందుకు, అతని పక్షమున నేను నీకు వందనములు చెల్లిస్తున్నాను' అనిరి. అప్పుడు ఆ నర్సు ఏమి జవాబు చెప్పెననగా "ఏలినవాడా, అతనికి సహాయము చేసనిది నేనుకాదు, నాలో జీవించుచుండు దేవుడు చేసెను. అయ్యా ప్రభువైన యేసుక్రీస్తు తన కృప చొప్పున నన్ను రక్షించి, ఇతనిమీద ప్రేమ నాలో పెట్టియున్నాడు." అసలైన ఉప్పు ఇదే. నిజమైన ప్రేమ ఇదే. ఇది ఎట్టి స్నేహితులు బంధువుల వలనను పొందలేము. భూలోక ప్రేమ భూలోక పరిస్థితులను బట్టి యుండును; దైవ ప్రేమ పరిస్థితులు ఎన్ని ఎట్లుండినను, అంతటిని మించినది : "మీ శత్రువులను ప్రేమించుడి," యని ప్రభువు ఇందుకే చెప్పెను. ఎంత అద్భుతకరమైన ఉప్పు. మనలను ద్వేషించి శపించు వారిని ప్రేమింపగలుగుదుము. అప్పటికి మాత్రము ఏదో బాధ నుండి వారికి నివారణ కలుగజేయుటకే కాదు, కాని నిత్యత్వమునకు ఆ ప్రేమను వారితో పంచుకొనుటకే వారిని ప్రేమించగలము. ఈ దినము మనకు వడ్డించిన పదార్థము, పట్టి పప్పే అనుకొందుము. అదియైనను, సరిగా ఉడకని పప్పు. అయితే అందులో

ఉప్పు ఉండినయెడల వండిన మాంసముకూర, కోడి కూర, చేపలకూరకంటే ఆ పప్పే ఎంతో రుచిగా నుండును. దైవ ప్రేమ ఇటువంటిదే. మనుష్యులు ఎక్కడుండినను నిత్యత్వమునకై వారికి ఏదో ఇవ్వగలము. వారిని కలిసినప్పుడు దేవుని ఉప్పుయొక్క రుచి నిజముగా ఎట్టిదో వారికి ఇవ్వగలము.

ఎన్నో విధములుగా ఉప్పు హాయినిచ్చును. కొందరు మితిమించి నెయ్యి, వెన్న తినుటవలన వారికడుపులు ఉబ్బిపోవుచున్నవి. ఇందుకే ఇట్టివారు ఎక్కడకు వెళ్లినను, వారితో సోడా తీసికొని వెళ్లుచుందురు. కడుపుబ్బును నివారణ చేయుటకు ఉప్పు మంచిది. ఎన్నో ఇట్టి రోగములను ఉప్పు నివారణ చేయును. నీవు దేవునియొక్క నిజమైన ఉప్పయి యుండవలెను.

## నిజమయిన ఉప్పు ఎట్లుకాగలము?

నిజమైన ఉప్పుగా తయారగుట ఎట్లో, మత్తయి 5:3లో చూచుచున్నాము. విరిగినలిగిన దీన హృదయమును కలిగి యుండవలెను. ఉప్పును శుభ్రపరచుటలో మొదట జరుపవలసిన కార్యమిది. లోకమంతట జనులు దేవుని తెలిసికొనుటకు యత్నించుచున్నారు. అన్ని మతముల వారు, పెద్ద పెద్ద కట్టడములు నిర్మించుట ద్వారా దేవుని వెదకుటకు ఆశించుచున్నారు. ఇట్టి మహా భవనములద్వారా దేవుని కనుగొనగలమని వారి భావము, కాలము, శక్తి, ధనము, విస్తారముగా ఈ కార్యము నిమిత్తము వినియోగించు చున్నారు.

కొంతకాలము క్రితము, లెబానానులోశిథిలమైన ఒక అతి పురాతనపు దేవాలయమును చూచితిని. రోమావారిచే ఇది కట్టబడి యుండెను. బ్రహ్మాండమైన స్తంభములు, పెద్ద పెద్ద రాళ్ళతో 40,50 అడుగుల

ఎత్తువరకు నిర్మించబడిన దళసరి గోడలు ఇప్పటికిని నలిచియున్నవి. అంతటి బ్రహ్మాండమైన రాళ్ళను అంతపైకి ఎట్లు ఎత్తిరని మనము విస్మయము చెందు చున్నాము. దేవుని కనుగొనవలెనను ఆశతో మనుష్యులు ఎంతో శ్రమతో ఎత్తయిన కట్టడములు నిర్మించియున్నారు. లోన ప్రవేశించితివా? అక్కడ సాతానునే చూతువు. పాలస్తీనాలో అనేక రోమన్ క్యాథలిక్ కట్టడములను చూచితిని. ఈ మహా పెద్ద కట్టడములు బెత్లేహేము, నజరేతు, యెరుషలేము, గలిలయలోనున్నవి. బహు గంభీరమైన కట్టడములే, లోపల అంధకారము, చెడుగు, అవమానము, పాపమే. ఇటువంటి మహా కట్టడములవలన దేవుని మరింత దగ్గరగా సమీపించగలమనియు అయన యొక్క సాన్నిధ్యము మరింత బలముగా అనుభవించగలమనియు వారి భావము. యెషయా 57:15;66:2 చూడము. కట్టడములను కట్టినవారు క్రైస్తవులైనను మహమ్మదీయులైనను, యూదులైనను, మనుష్యులు నిర్మించిన భవనములలో దేవుడు వసింపడు. సొలొమోను కట్టిన దేవాలయము వారిదైనందిన దేవుని, ఇతరులకంటె తామే యెక్కువగా యెరిగి యుందుమని యూదులు తలచిరి. అయితే అదే దేవాలయము నాశనమై పోయెను. ఇప్పుడు నీవు యెరుషలేము వెళ్లిన యెడల ఆ స్థలమందు మహమ్మదీయుల మసీదులనే చూతువు. మనుష్యులు నిర్మించిన కట్టడములలో దేవుడు వసింపడు దీనమైన నలిగిన హృదయములలో ఆయన వసించుచున్నాడు. ఎంత ఘన భాగ్యములు: దేవుడు మనయందు తానే వసింప వచ్చినప్పుడు మనము లోకమునకు ఉప్పయి యుందుము. అప్పుడే సమస్తమైన వారికి, మన శత్రువులకు సహా, నిజమైన ప్రేమ చూపగలము. లేని యెడల మన హృదయములు, ఓర్వలేని తనముతోను, శత్రుత్వముతోను, చెడుగుతోను నిండియుండును. ఈ కాలమందు లోకమంతయు ద్వేషము, చేదు, విషముతో నిండియున్నది. దేశమునకు విరోధముగా దేశము, సోదరునికి

విరోధముగా సోదరుడు, స్నేహితునికి విరోధముగా స్నేహితుడు, తల్లిదండ్రులకు విరోధముగా బిడ్డలు, వున్నారు. ఎందుకు? వారిలో ఉప్పు లేనందున.

మనలను నిజముగా దీనులనుగా చేయుటకై దేవుడు బహుబాధకరమైన సాధనములు అప్పుడప్పుడు ఉపయోగించుట కద్దు. కీర్తన 51:17లో దావీదు ఏమనుచున్నాడో కొంత చూడుము. అత్యంత చేదైన అనుభవముద్వారా అతుడ పాఠము నేర్చుకొనెను. యౌవనమందు దావీదు, బాహ్యముగా యెన్ని యోగ్యతలు గలవానిగానుండెనో 1 సమూయేలు 16:12,18లో చూతుము. ఈ బాహ్యమైన సుగుణములు అతడు ఎన్ని కలిగియున్నాడో చూడుము. ఏ వాయిద్యమునైనను వాయించగల వాడు, యుద్ధవీరుడు, బుద్ధిమంతుడైన, జ్ఞాని రాజ్యమేలుటకు తగినవాడు. అయితే తన స్వంతహృదయములోని కల్మషమును తానే ఎరిగియుండలేదు. అయితే శరీర సంబంధమైన అత్యధిక శోధన కలుగు కాలమురాగా, అపవాది జిత్తులతోను, ఉపాయంతోను అతనిని మోసగించెను. 2 సమూయేలు 11 చదువుము. అంతటి గొప్ప, ఘనమైన, జ్ఞానియైన రాజు వ్యభిచారి యాయెను. దీనివలన మోసగాడాయెను. పిమ్మట వేషధారియు, జిత్తులు మారియు, కట్టకడపట ఒక నరహంతకుడు నాయెను. దావీదు ఘనుడైన రాజు, జ్ఞానియై యుండియు, సాతాను మోసములో పడిపోయెను. ఇట్టి అపాయము ప్రతివానికి గలదు. అట్లు పడిపోయిన పిమ్మట దావీదు ఒక పాఠము నేర్చుకొనెను. శోకపూరితమైన హృదయముతో, "పాపములోనే నా తల్లి నన్ను గర్భమున ధరించెను" (కీర్తన 51:5) అని అతడు వ్రాయుటకు కారణమిదే. మానవ హృదయముయొక్క మలినమును దావీదు చూడ మొదలు పెట్టెను. ఎంతో ముచ్చటించు చక్కని ముద్దుల మూటకట్టునట్టి బిడ్డలు

కొందరున్నారు. వారి ప్రీతి ముద్దు ముచ్చటకు ఆకర్షింపబడి, వారి పాదములకే ముద్దులిడవలెనని నీకుండును. కొంతసేపు అయిన తరువాత అప్పుడు వారి మొండితనము, కోపము, కాళ్ళు తన్నుకొనుట చూతువు. దయ్యముపట్టినవారే యగుచున్నారు. ఇదేల? దేవుని వాక్యము వక్కాణించునట్లుగా. జన్మముతోనే మనము పాప స్వభావము కలిగి యుండుటవలననే.

ఇప్పుడు దావీదు ఆర్తధ్వని చేయుచున్నాడు:- 'ఓదేవా నా అతిక్రమములను క్షమించుము. కేవలము నీకే విరోధముగా నేను పాపముచేసియున్నాను. హిమముకంటె నేను తెల్లగానుండునట్లు నీవు నన్ను కడుగుము." తనలోని మలినమును తానే తెలసికొనుచున్నాడు. కడుగుమని మొరపెట్టుచున్నాడు. "ఓ ప్రభువా శుద్ధీకరించుము. నన్ను శుద్ధీకరించుము" శుద్ధీకరించుట అను పదము ఆంగ్లభాషలో అగ్నిలో పుటము వేయబడు బంగారమునకు చెందుచున్నది. నీళ్ళతో కడిగినంత మాత్రమున బంగారము శుభ్రపరచబడదు. దానిని అగ్నిలో పుటము వేయవలెను. ఏడుమారులు బంగారము పుటము వేయబడవలెను. ఇన్ని మారులు పుటము వేయుటయే శుద్ధీకరింపబడుట అనుబడు చున్నది. ఈ రీతిగా శుద్ధిచేయుటవలన లోపలదాగియున్న మలినముకూడ పైకి వచ్చును, అది పూర్తిగా తీసివేయబడును. మన అందరి హృదయములలో ఎంత కుళ్ళు, ఎంత కీడు, ఎంత మైల వున్నదో మనము గ్రహించుట లేదు. దేవుని వెలుగు, లోన ఎప్పుడైతే ప్రవేశించునో అప్పుడే ఇదంతయు మనకు గోచరమగుచున్నది. నీవెట్టివాడవో నీవు తెలిసికొనగా, దావీదువలె మొరపెట్టుకొనుచున్నావు: "ప్రభువా, నన్ను పవిత్రపరచుము. సంపూర్ణముగా కడిగివేయుము. లోన, పైనకూడా నన్ను శుద్ధీకరించుము. సమస్త చెడగునుండియు శుద్ధీకరించుము." ఏ హృదయమునుండియైతే

ఇట్టి ఆర్తధ్వని లేచుచున్నదో ఆ హృదయమే విరిగి నలిగిన హృదయము. నీ హృదయము ఇట్టిది కాని ఎడల నిస్సారమైన ఉప్పుగానే నిలిచిపోతున్నావు. దేవుడు ఇట్టి హృదయమున ప్రవేశించి వాసము చేయలేడు. దావీదువలె మంచి ఉప్పు కావలెనని నీవున్నచో అతనివలె నిన్ను శుభ్రపరచమని ప్రభువునకు మొరబెట్టుము.

## నిజమైన ఉప్పు ఆశీర్వాదకరము

లోకమంతట మనవకోటికి దావీదు కీర్తలను ఎంతో ఆదరణ కారణములు. కష్ట దుఃఖ నిరాశలో పాలైనవారు కీర్తనల గ్రంథమును చదివియున్నారు. కీర్తనలు 23, 91,103, 104 ద్వారా ధన్యత చెందినవారు ఎందరో; సకల విధములైన గాయములనుండి మనుష్యులకు స్వస్థత కలిగించెడు దివ్య ఉప్పును ఈ ఆశ్చర్యకరమైన కీర్తనలు కలిగియున్నవి. ఎందరెందరికో కన్నీటిని తుడిచివేసి, ఎన్నో భారములు తీసివేసి, ఎంతమందికో నెమ్మది కలుగచేసిన కీర్తనలివి. ఎప్పుడైతే దావీదు గుండె పగిలిన వాడాయెనో, అప్పుడే అతడు నిజమైన ఉప్పయ్యెను. దేవుని ఉప్పుగా కావలెనంటె ఇదే మొదటిమెట్టు "ఆత్మ విషయమై దీనులైనవారు ధన్యులు. పరలోక రాజ్యము వారిది" ( మత్తయి 5:3). ఇట్టివారు ఏమి బదులు పొందుచున్నారో చూడుము వారు దేవుని నివాన స్థలమగుచున్నారు.దేవుని ఉప్పు అగుచున్నారు. ఇంతేగాక "పరలోక రాజ్యము వారిది" యని దేవుని వాక్యము చెప్పుచున్నది. దేవుని పరిశుద్ధ రాజ్యమునకు వారసులై పాలిభాగస్థులగుచున్నారు. విరిగిన హృదయము ద్వారా తప్ప వేదజ్ఞానము, కళాశాల పట్టములు, మంచిమంచి ప్రసంగములు, పాటలు పాడుట, అద్భుతములు, ఇట్టి వాటి ద్వారా అది సాధ్యము కాదు. అంతకంతకు మరింతగా దేవుని యెదుట నీవు

దీనుడవు కావలెను. జీవితకాలమంతయు నేర్చుకొనవలసిన పాఠమిది. ఆత్మీయముగా మనకెంత దారిద్ర్యము కలదో మరియులోన ఎంత కల్మషమున్నదో, ఇది మనము తెలిసికొనవలెనని ప్రభువు చెప్పుచున్నాడు. మనలను మార్చి వేయుటకు దేవుని కృపయు, ప్రేమయు మన అందుబాటులోనే యున్నవి.

ఎక్స్-రే ఉపయోగించనిదే కొన్ని వ్యాధులను కనిపెట్టుట దుర్లభము. ఎంత నేర్పరియైన వైద్యుడైనను, అట్టి వ్యాధులను ఎక్స్-రే లేకుండ కనిపెట్టజాలడు. ఆ ఎక్స్-రే ఫోటో తీసిన వెనక, మెదడులోనో, పేగులలోనో ఆ వ్యాధి అనేక సంవత్సరములుగా రోగికి తెలియకనే అతనిలో నుండెనని కనిపెట్టవచ్చును. ఎక్స్-రే శరీరములో జొచ్చుకొని పోవుటవలన సమస్తమును కనబరచును.

నేనెరిగిన ఒక యువకుడు దగ్గుతోను, గొంతు నొప్పితోను బాధపడుచుండెను. ఇది మామూలు జలుబు అనుకొనెను. ఒకనాడు ఎవరో ఒక మంచి వైద్యుని దగ్గరకుపోయి పరీక్ష చేయించుకొనమని సలహా చెప్పగా, ఆ యువకుడు వెళ్ళెను. ఎక్స్-రే అవసరమని వైద్యుడు ఎక్స్-రే తీయగా, ఆ ఫోటోను చూచి వైద్యుడు ఇట్లనెను! "నీకు క్షయరోగము వున్నదని చెప్పడానికి విచారపడుచున్నాను అబ్బాయి." ఆ ఫోటోను తీసికొని ఏడ్చుచు ఆ యువకుడు ఇంటికి వెళ్ళెను. ఏమయింది! ఎందుకు ఏడుస్తున్నావు? అని తల్లి అడుగగా, 'నాకు క్షయరోగమున్నది' యని అతడు ప్రత్యుత్తరమిచ్చెను. కుటుంబము వారందరు ఎడ్వసాగిరి. పేదవారు గనుక ఒక క్షయరోగ చికిత్సాశాలలో పైకము కట్టి అతనిని చేర్చుటకు వారికి డబ్బులేదు. వారికి కలిగిన సొత్తంతయు అమ్మివేసి, సరియైన చికిత్స పొందుటకు సానిటోరియంలో చేర్చిరి. అప్పుడు అతడు స్వస్థత పొందెను.

ప్రభువునందు నీవు పొందునట్టి వెలుగే అసలైన వెలుగు మన వ్యక్తిగత స్థితిని మనమే చూచుకొనునట్లుగా దేవుని వెలుగు మనలోనికి వచ్చెను. " నేను లోకమునకు వెలుగైయున్నాను" అని ఆయన తేట తెల్లముగా పలికి యున్నాడు. ఆయన క్రొవ్వు వత్తి వెలుగుగాని, సూర్యుని వెలుగుగాని, ఎలెక్ ట్రిక్ బల్బు వెలుగు గాని అయి యుండలేదు. ఆయన నిరంతర వెలుగై యున్నాడు. దేవుని వాక్యము తెలుపునది ఏమనగా నూతన సృష్టియందు మనకు వెలుగునిచ్చుటకై దీపములుగాని, ఆకాశ జ్యోతులుగాని అవసరములేదు. దేవుని గొర్రెపిల్లయగు మన యేసు క్రీస్తు ప్రభువే మనకు వెలుగైయుండును. ఇప్పుడున్న మర్మమేమనగా ఈ నిత్యమైనట్టి, స్వచ్ఛమైనట్టి దైవ వెలుగు మనకు ఈనాడే అందింపబడుచున్నది. ఈ వెలుగులో మనయొక్క స్థితిని వున్నది వున్నట్లుగాను, మన పాపపు మైలను మున్ముందుగా చూతుము. ఇదే మనలను ఎక్స్‌రే తీయుట ఆ యువకుడు ఫోటోను చూచిన పిమ్మట భయముతో ఎట్లు ఏడ్వసాగెనో అట్లె దేవుని వెలుగు నీలో ప్రవేశింపగా నీ యొక్క నిజమైన స్థితిని చూచుకొని సత్యముగా దుఃఖింతువు.

ఒకడు ఫోటో తీయించుకొనుటకై ఫోటో గ్రాఫరు దగ్గరకు పోయెటప్పుడు సాధ్యమైనంత చక్కగా కనబడవలెనని కోటు, ఒక వాచ్, ఇంకేవేవో అరువు తీసుకొని తొడుగుకొనును మరియు తలను అందముగా బ్రష్ చేసికొని దువ్వుకొనును. ముఖ క్షౌరము తప్పక చేసికొని, కావలెనంటె కొంత పౌడరు పూసికొనును. అతడు ఎంతటి నల్లని కురూపియైనను, ఫోటోలో చక్కగా పడిన ఎడల మురిసిపోయి దానిని పట్టుకొని "నా ఫోటో చూచితివా?" అనుచు అందరికి చూపుచుండును. బైబిలు ఎన్నడు ఇటువంటి తప్పుడు మోసపు రూపముతో నిన్ను కనబరచదు. నీవు నిజముగా ఎట్లున్నావో అ[illegible] నీకు సూక్ష్మంగాను, తేటగాను ఎత్తి చూపును.

మన సత్య స్థితిని మనము చూచుట్లుగా చేయుట వలన మన మెంత కృతజ్ఞులుగా నుండవలెను. అప్పుడు మనం విరిగిన హృదయంతో " అవును ప్రభువా, నా హృదయం పావ సహితమైనదియును, ఆపవిత్రమైనదియును, బహు చెడ్డదియునైయున్నదని నేనెరుగను. ప్రభువా నన్ను కరుణించుము" అని మొరలిడుదుము. " అప్పుడు "శాశ్వతమైన ప్రేమతో నిన్ను ప్రేమించుచున్నాను. గనుక విడువక నీ యెడల కృపజూపుచున్నాను", అని జవాబిచ్చును. ఆయన నన్ను ప్రేమించు చున్నాడు. గనుక నన్ను కడిగి, నా లోకానికి వచ్చు నిమిత్తమై నా నిజస్థితిని ఆయన చూపించును.

## ఉప్పుగా మారుటకు ప్రారంభము విరిగి నలిగిన హృదయము

భారత దేశములోని ఒక మహనీయుడు కొన్ని గంటల సేపు మీ యింటిలో దిగవలెనని ఇష్టపడుచున్నాడని ఎవరో నీతో చెప్పిరని అనుకొనుము. నీవెంతో హడావిడిగా ఇంటిని సిద్ధము చేయుదువో? ప్రతి మూల కూడ శుభ్రము చేయుదువు. "ఫలాని వారు మా యింటికి వస్తున్నారు" అనుచు చెప్పుకొని తిరుగుదువు. పాతిక సం॥ల పొడవున నీ బాత్‌రూమును కడిగి ఎరుగవేమో అయినను ఆ దినము పెద్ద డబ్బా ఫినాయల్ తెప్పించి ఇంటినంతా కడుగుచున్నావు. అయితే మన విషయంలో దుర్గంధ మేమియు నుండక, నిత్యత్వమునకే మనలో వసించుటకు ప్రభుయేసు క్రీస్తు రాగోరుచున్నాడు. కావున మనము శుభ్రపరచబడవలెను. పశ్చాత్తాప పడుచున్న విరిగిన హృదయము మనకు కావలెను. ఉప్పగుట దీనితోనే ప్రారంభము. మనలో ప్రవేశించి వాసము చేయకోరునది ఎవరనగా పరిశుద్ధుడైన ప్రీతి గల సజీవుడైన గొప్పదేవుడే.

నిజమైన ఉప్పయితివా? ఆ దివ్య ఉప్పును నీ ద్వారా, నీ స్నేహితులు, పొరుగువారు, ఇతరులు రుచిచూడగలరా? కాకున్నచో ఇప్పుడే నిజమైన ఉప్పుకమ్ము. అప్పుడు నీవెక్కడికి పోయినను నీ మాటలద్వారా కన్నీళ్లు తుడిచి వేయబడును. అనేక భారములు తొలగించి వేయబడును. అనేక గృహములునూతన సంతోషము పొందును. నీ ద్వారా మీ ఊరు యావత్తు మీ దేశము ధన్యమగును. దినదినము మరి ఎక్కువ మంది నీ ద్వారా దేవుని ఉప్పగుటకు సిద్ధపడుదురు.

విరిగిన హృదయము, దీనమనస్సు దేవునికి నివాస స్థలము ఆయన తన సమస్తమును మనకు యిచ్చి, నిరంతరం మన యందు వసించును. ఎవరైనను బంధువులను దర్శింపవెళ్లినపుడు వట్టి చేతులతో వెళ్ళక ఒక గంపలో ఫలహారములు లేక పండ్లు వేసికొని పోవుదురు. నేను బాలునిగానున్నపుడు ఒక దినము మా తల్లి, మీ మామయ్యవస్తున్నాడు ఆయనకు చాలా డబ్బుంది. చాలా దయకూడాను పోయిన సారి వచ్చినపుడు చాలా వస్తువులు తెచ్చియిచ్చారు. అని నాతో చెప్పెను." మా మామయ్య రాగానే ఆయన ఇంటి గుమ్మము దాటకముందే ఆయన జేబులు తనిఖీచేస్తిని. అక్కడ పొట్లము దొరికినది. మన హృదయమందు వసింప దేవుడు రాగా మనకు తన సంపూర్ణతను సమస్తమును ఇచ్చుచున్నాడు. తన సర్వ రాజ్యము ఆయనతోనే యున్నది. ఆయన పరిపూర్ణ మహిమ మనకే. ఇపుడే నీవు విరిగిన హృదయముగలవాడవై ఆయన రక్తముచే కడుగబడ్డవా?

మనము విరిగి నలిగిన హృదయములు కలిగిన వారముగా దేవుడు చేయునుకాక.

✣ ✣ ✣ ✣ ✣

# 4

# ఉప్పుకు సారమునిచ్చుట - 2 పరీక్షలు

"మీరు లోకమునకు ఉప్పయి యున్నారు" (మత్తయి 5:18)

లోకమునకు ఉప్పువలె నుండుటకై ప్రభువైన యేసుక్రీస్తు మనుష్యులను ఎట్లుకూర్చుకొనుచున్నాడో చూచితిమి మన జీవితములలో ఉప్పు చేయునట్టి పని ప్రాముఖ్యమైనది యని కూడ తలపోసితిమి. చెట్లకు పంటలకు కూడా ఉప్పును వుపయోగింతురు. భూమిలో అనేక రకములైన ఉప్పులు వున్నవి. ఈ ఉప్పు అందుకొను నిమిత్తం వృక్షపు వేర్లు ఎంతో దూరమునకు వెళ్ళు చున్నవి. ఆరోగ్యమునకు కూడ ఇది అవశ్యమైయున్నదని తెలిసి కొంటిమి. ఎముకలకేమి, కండరములకేమి, రక్తమునకేమి ఇది అవసరమైయున్నది. కూరగాయలను, నెయ్యి వెన్నలను ఇది నిలువ చేయుచున్నది. ఇది కొంత వేయునప్పటికి మన అనుదిన ఆహారమునకు ఎంతరుచి కలుగుచున్నదోకూడా తెలిసి కొంటిమి. ప్రతి దేశ ప్రజలకు ఆహారములో ఉప్పు కావలియున్నది. ఆనందము, ప్రేమ, వెలుగు ఆరోగ్యమునకు ఇది సూచనగానున్నదని కూడ చూచితిమి. ప్రభువైన యేసు క్రీస్తు సమస్తమైన వారికి ఆరోగ్యము. సంతోషము, ప్రేమ వెలుగు కలుగుటకై ఉప్పును ఇచ్చుటకు ఈ లోకమునకు వచ్చెను. కొందరు విశ్వాసులు అనేక దేశములలో ఎందరికో ఆరోగ్యము ఆనందము తెచ్చుట కూడ చూచితిమి.

మనమెట్లు నిజమైన ఉప్పుకాలగమో పర్వత ప్రసంగములో చూతము. సముద్రపు నీటియందున్నంతకాలము ఉప్పు ఆహారమునకు పనికిరాదు. నీటినుండి వేరు చేయంబడవలెను. మరియు

శుభ్రపరచబడవలెను. అప్పుడే పనికి వచ్చుచున్నది. మత్తయి 5:3లో, ఇది శుభ్రపరచబడి స్వచ్ఛమైనదిగా కాగలుగుటకు మొదటి మెట్టు చూచితిమి. "ఆత్మ విషయమై దీనులైన వారు ధన్యులు; పరలోక రాజ్యం వారిది." శుభ్రపరచబడుటతో మొదట జరుగవలసిన కార్యమిదే. విరిగిన హృదయంతోను, నలిగిన మనస్సుతోను దేవుని యొద్దకురావలెను.

## సంకటములలో ఆదరణ

మనము మంచి ఉప్పు కాగలుగుటకు రెండవ మెట్టు ఏదనగా సంకటములలో ఆదరణ. "దుఃఖపడువారు ధన్యులు; వారు ఓదార్చబడుదురు" మత్తయి 5:4. అర్థపూరితమైన మాటలివి. మనం ఎప్పుడైతే హృదయంలో క్రీస్తుయేసునాథుని యందు విశ్వాసముంచితిమో, వెంటనే మనము అదివరకు ఎన్నడు తలంచని పరిస్థితులను ఎదుర్కొనవలసి యుండుట కనుగొందుము. మారు మనస్సునొందకముందు స్నేహితులు, బంధువులు, తల్లిదండ్రులు మనలను ఎంతో మెచ్చుకొనిరి. ఎప్పుడైతే క్రీస్తు యేసు నాథునికి లోబడ నిశ్చయించితిమో, వెంటనే మిత్రులు శత్రువులుగా మారిపోయిరి. మనలను ఎంతగా ప్రేమించిన సోదర సోదరీలు, బిడ్డలు, తల్లిదండ్రులు, మనలను ద్వేషింప మొదలిడుచున్నారు. మా కుటుంబమునందు నేను ద్వేషింపబడుటకు బాల్యమునుండి నా జనని జనకులు, సోదరి సోదరులు నన్ను ఎంతగా ప్రేమించిరి. నన్ను గాయపరచునటువంటి గాని, కష్ట పెట్టుటకైనను వారు తలంచలేదు. అయితే ఎప్పుడైతే నేను క్రైస్తవుడనైతినో, ప్రభువైన యేసుక్రీస్తు నా స్వంత రక్షకుడై, నా జీవితమును మార్చివేసి, నా పాప మార్గము నుండి నన్ను తప్పించి నాకు నూతన జీవమును ప్రసాదించెనో, అప్పుడు నా బంధు మిత్రాదులు నన్ను త్రోసివేసిరి. జీవితంలో నేను ఇంటనుండక ఒంటరిగా బొంబాయిలో వారు నన్ను వదిలి

కొనుటకువచ్చిరి. నేను అదివరకే, ప్రభువు నా జీవితమును ఎట్లు మార్చివేసియుండెనో వివరములు తెలుపుచు, మా తండ్రికి పెద్ద జాబు వ్రాసియుంటిని. "నీవు క్రైస్తవుడవైతివని, మీ అమ్మకు నాకుమట్టుకే తెలుసును" అని మా తండ్రి చెప్పి ఇంకను ఇట్లు అనిరి. "నీవు క్రైస్తవుడవుగా వుండడు మాకేమి అభ్యంతరములేదు. నీవు క్రైస్తవ కూటాలకు వెళ్ళుటను మేము అడ్డుచేయము. ఎక్కడికైనా వెళ్ళు, ఏమైనా చేయి. అయితే ఈ ఒక్క మనవి: మన ఇంటిలో వున్నంతకాలము, నీవు క్రైస్తవుడవని చెప్పుకోవద్దు." అప్పుడు నాయనగారితో ఇట్లంటిని, "ప్రభువైన యేసుక్రీస్తే నా జీవితాన్ని మార్చివేయకుంటే, ఇప్పటి కింకా పాపములోనే జీవించేవాణ్ణి. ఇప్పుడు యేసుక్రీస్తు ప్రభువు నన్ను రక్షించి మార్చివేసి, నాకు నూతన జీవమిచ్చియున్నాడు. రక్షణమార్గము మీకు చూపడానికి నన్ను పంపియున్నాడు. నేను ముక్కు, నోరు మూసికొంటే నేనెంత సేపు జీవించగలను? ఆ విధంగానే, ఇప్పుడు నా ప్రభువే నాకు జీవమైయున్నాడు. నేను ఆయనను దాచిపెడితే, జీవించుటెలాగు!" ఈలాగైతే యింటికి రావద్దు," అని మా తండ్రి అన్నారు. ఏడేండ్లు పై దేశాలలో గడిపి తిరిగి ఇండియాకురాగా, ఇంటికి రావద్దు అనిరి. నేను విదేశాలలో ఉన్నప్పుడు "నీవు తిరిగి ఎప్పుడు ఇంటికి వస్తావో అని దినాలు, గడియలు లెక్కపెడుతూ వున్నాము" అని కన్నీళ్ళతో మాటిమాటికి మాతల్లి వ్రాయుచుండెను. కాని నేను నిజముగా తిరిగి వచ్చినప్పుడు నేను అవసరము లేకపోతిని, మా తండ్రికి నేను చేయవలసిన మర్యాద చేయుటకై, నావద్ద ఏమి పైకముండునో, అదంతయు ఆయనకు ఇచ్చివేస్తిని. నన్ను బొంబాయిలోనే విడిచి పెట్టి ఆయన వెళ్ళిపోయెను. ఎంత దుఃఖకరమైన విషయమది! నేనే, ఒక త్రాగుబోతుగాను, వ్యభిచారిగాను ఇండియాకు తిరిగి వచ్చియుంటే, నాకు స్వాగతమిచ్చియుందురు. నా ప్రభువు నన్ను మార్చివేసి, నూతన జీవము ఇచ్చినందున, వారికి నేను

అవసరముండలేదు. మా అమ్మ రైల్వే స్టేషనులో ఏడ్చుచు, "నాకోసమైనా, ఒక నాలుగురోజులు ఇంటికిరావా? క్రిష్టియన్ అని చెప్పుకొనకుంటె వచ్చిన నష్టమేమి? నీవు బైబిలు చదువడానికయినా, ప్రార్థన చేసుకోడానికీయినా, మేము ఆటంకం చేయము నీవు వచ్చినట్లయిన, నిన్నుచూచి చాలామంది నీలాగే మారవచ్చునుకదా!" అని చెప్పెను. అమ్మతో దేవునికే మొదటిస్థానమివ్వవలెనంటిని. గాని, అంతకంతకు ఆమె ఏడ్పు అధికమగుట చూడగా ఈ తలంపు వచ్చెను: "అమ్మను గురించి వెళ్ళుతాను. నా తల్లికదా! ఆమెను ఘనపరచాలి. ఏ నాలుగు దినాలకోరకో వెళ్ళుతాను." ఈ సంగతి ఆమెకు చెప్పబోవుచుండగా ఏదో నా గొంతుకలో పట్టుకొనెను నోటినుండి మాట్లు రాకుండెను. కొన్ని క్షణములలో, ఈ మాటలు నా చెవినిబడెను. "తండ్రినైనను, తల్లినైనను సహోదరుడనైనను! సహోదరినైనను నా కంటె ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడుకాడు." "నాగటిమీద చెయ్యిపెట్టి వెనుకతట్టు చూచువాడెవడును దేవుని రాజ్యమునకు పాత్రుడుకాడు." అప్పుడు నా తల్లితో "అమ్మా, నేను రాలేను నాకు నా దేవుడే ప్రాముఖ్యము" అని అంటిని. అప్పుడు వారిద్దరు నన్ను బొంబాయిలోనే వదలివేసి వెళ్లిపోయిరి.

బొంబాయిలో నేనొక పరదేశిని. ఒక్కరికైనా నేను తెలియను. జేబులో డబ్బులేదు పోవడానికి స్థలములేదు కొంత సేపటివరకు వ్యసనపడితిని. ఇప్పుడైతేనో, దేవునికి వందనములు, ఎందుకనగా కొంతకాలము నేను ద్వేషింపబడి, తృణీకరింపబడి, త్రోసివేయబడినను, ఆయొక్క దుఃఖమే అటు తరువాత సంతోషముగా మారిపోయెను. మా తండ్రికి స్వప్నంలో ఎవరో" నీ కుమారుని తొందర పెట్టవద్దు, అతనికి సమాధానము దొరికియున్నది" అని చెప్పిరట. అప్పుడు ఆయన వచ్చి నన్ను యింటికి తీసికొని వెళ్ళి "నా కుమారునికి సత్యశాంతి దొరికింది. అతని ఏమీ అనవద్దు" అని అందరికతో చెప్పెను. అదే సమయములో,

ఆయన ఎన్నో రోజుల పర్యంతము నన్ను తిట్టుచు, శపించుచుండెను. ఇంటికి వచ్చినవారందరు, మా తల్లితండ్రులతో, "మీ కుమారుని గురించి మాకెంతో విచారము. ఇది చాలా విచారకరమైన సంగతి" అనుచుండిరి. ఇట్లే అనేక దినములు గడిచెను. నా ముఖము ఎదుటనే నన్ను దూషించుచు, శపించుచుండిరి.

మనలో ప్రతియొక్కరికి ఇట్లే దుఃఖపెట్టబడు, నిందింపబడు దినములు వచ్చును. ఈ విషయము మరువవద్దు. నీ స్వంత తోబుట్టువులు నిన్ను ద్వేషించి, శపించి, నిందించినప్పుడు నీ మనస్సు కృంగును. అయినను దేవునికి వందనములు, ప్రభువైన యేసుక్రీస్తు మనలను ఓదార్చును.

కాలక్రమమున తన స్వంత పద్ధతి మీదనే మా కుటుంబంలోని సమస్తమైనవారితో దేవుడు మాట్లాడ నారంభించెను. వారు నన్ను దూషించినను, శపించినను, నేనేమియు అనక యుంటిని వారిమీద నా మనస్సునందు ద్వేషమే ఉండలేదు. ప్రభువుకొరకు నిందలుపొందు భాగ్యము నా కొసగినందుకు దేవునికి స్తోత్రము. కొన్ని మాసములలో మాతల్లి చాలా జబ్బుపడెను. మా తమ్ముడు డాక్టరును పిలిపించెను. ఈ డాక్టర్ ఒక స్నేహితుడు. "ఆమెకు విషజ్వరము, మీరు చాలా జాగ్రత్తగా చూచుకొనవలెను," అని ఆ వైద్యుడు మా తమ్మునితో చెప్పెను. డాక్టర్ వెళ్లిపోయిన పిమ్మట మా అమ్మ నాతో "నాయనా, ఆ డాక్టర్ ఇచ్చె మందులు నాకు వద్దు. నా గురించి ప్రార్థనచేయి నీవే ప్రార్థన చేయి" అనెను. అప్పుడు నేను మోకరించి "ప్రభువా మా అమ్మను తాకి, స్వస్థపరచుము" అని ఒక చిన్న ప్రార్థన చేసితిని. ఆ సాయంకాలమే, ఆమె జ్వరము పోయెను. తిరిగి రాలేదు. ఆనాటి నుండియు మావాళ్ళకు ఏ వ్యాధులు, కష్టములు కలిగినను, "మా కొరకు ప్రార్థనచేయి" అని నాకు వ్రాయుచుందురు మా తమ్ముని కుమారుడు చిన్నవాడు ఒకడున్నాడు.

వాడు నన్ను "ప్రార్థనచేసే పెద్ద నాయన" అని పిలుచును. నేను రావడము చూచినప్పుడెల్ల, "ప్రార్థన చేసే పెదనాన్న వస్తున్నారు" అని తెలుపుము మా వాళ్ళకు తొందరలు కలిగినప్పుడెల్ల నన్ను ప్రార్థించమని వ్రాయుచుందురు. లేదా రమ్మని పిలుతురు. ఎంతటి ఆధిక్యత! మా స్వగ్రామమునకు గాని, బంధువులు లేక స్నేహితుల దగ్గరకుగాని నేను వెళ్లినపుడెల్ల అనేకులు వచ్చి "మా కొరకు ప్రార్థించుము" అని నన్ను అడుగుదురు. చూచితిరా? మన స్వంత కష్టదుఃఖాలను సంతోషముతో భరించిన యెడల, అటు వెనుక మన ద్వారా ఇతరులు ఓదార్పు నొందుదురు. నన్ను ఎవరైతే దూషించి శపించుచుండిరో, వారే అటు తరువాత ఓదార్పు కొరకు నా దగ్గరకు వచ్చు చుండిరి. ఆ దినములలో ప్రభువు నా సమీపముగా చేరి, 'నేను సదాకాలము నీతో కూడా వున్నాను' అని చెప్పెను. నా దుఃఖములలో ఆయన నాకెంతో ప్రియముగా నున్నాడు. ఎన్నో యేండ్లవరకు అనేక శ్రమలలో నన్ను నడిపించి, దాటించెను. ఆయన మహిమార్థమే చెప్పు చున్నాను. గంటలకొలది కన్నీళ్ళు విడుచువాడను. మా కుటుంబములో ఎవరు నన్ను లక్ష్యపెట్టలేదు. అయితే ఒక కాలము వచ్చెను. వారి ప్రతి అక్కరలో నన్ను పిలుచుచుండిరి.

## ఓదార్పు నిమిత్తము, ఓదార్పబడుట

కొన్ని సంవత్సరముల క్రిందట మా మూడవ తమ్ముని ఇరువదియొక్క యేండ్ల యువకుడైన, పెద్దకుమారుడు రైలు బండి క్రిద చిక్కుకొని చనిపోయెను. తల్లిదండ్రులకు అది చెప్పరాని దెబ్బ. మా తమ్ముడు భోజనము మానుకొనెను. ఇంటికిరాగా, ఆవరణమందు ఉంచబడిన కుమారుని శవమును చూచి, దానిమీద పడెను. తన వస్త్రములమీద అతని నెత్తురు అంటుకొని యుండెను. వారము రోజులవరకు ఆ బట్టలు మార్చకుండెను. ఎంతోమంది ఆయనను

ఓదార్చుటకు వచ్చిరి. నగర వాసులందరు వచ్చిరనవచ్చును. నేను ఈ సమాచారము వినగానే ఆతనిని చూచుటకు విమానముమీద వెళ్లితిని, అతనివైఖరి చూచి ఏమి ఓదార్పుమాటలు చెప్పగలను అనుకొంటిని. అతడు, "ఇప్పుడు నీ దేవుడెక్కడ? ఏమైనాడు చెప్పు" అని నన్ను అడిగెను. ఏమి చెప్పగలుగుదును, జవాబివ్వక మోకరించి, "ప్రభువా, ఇతనిది చాలా గొప్పదుఃఖము, ఇతనిని ఓదార్చుము. జేష్టకుమారుడు ఎంతో అదమైనవాడు, ఈ విధముగా మరణించెను. ప్రభువా, నీవు ఓదార్చినచో అతనిలో మార్పు కలుగును" అని ప్రార్థించితిని. ఆ దినమే, ఆతడు క్రిందనుండి లేచి వస్త్రములు మార్చుకొని ముఖక్షౌరము చేసికొని, ఆఫీసులో తన పనికి వెళ్ళెను. ఎంతటి ఓదార్పది! మనము శోకించినప్పుడే ఇతరులను ఓదార్చగలము. అనగా, "దుఃఖపడువారు ధన్యులు వారు ఓదార్చబడుదురు." నీ వలన ఇతరులకు ఓదార్పు కలుగును. 1 కొరింథీ, 1:4-7 చూడుము. క్రీస్తుయొక్క శ్రమలలో తాను పాలుపొంది నందువలన అనేకులను పౌలు ఓదార్చగలిగెను. మనమే దుఃఖపడినవారము కాకుంటె, మనద్వారా ఇతరులు ఎట్లు ఓదార్పు పొందగలరు? ఇతరులను ఓదార్చుట మన అధిక్యతయై వున్నది. అపజయము పొందిన వారి యొక్కయు, దూషించబడినవారి యొక్కయు సంతోషహీనుల యొక్కయు భాష్పములను మనము వెళ్ళెడిచోట్లలోనెల్ల తుడిచి వేయగలము. మనము లోకమునకు ఉప్పయి వుండురీతి ఇదే. దుఃఖములోనున్నవారి సంతోషము, ఆదరణ కలిగించును. ప్రార్థన ప్రేమ, లేక కొన్ని ఓదార్పు మాటలు దుఃఖములోనున్న వారికి సంతోషము, ఆదరణ కలిగించును. అయితే, మనమే దుఃఖమును అనుభవించి వుండిన వారముగా నుండవలెను. నీ తల్లిదండ్రులు, సోదర సోదరీలు, భార్య లేక భర్త, బిడ్డలు, లేక స్నేహితులుగాని, పొరుగువారుగాని, నిన్ను ద్వేషించి శపించి, నిందించునపుడు ఆశ్చర్యపడవద్దు. శ్రమలు సంకటములుగుండా

నిన్ను ప్రభువు తీసికొనిపోవును. అది శరీర బాధ, లేక కుటుంబమందు మరణము, లేక ఏదో తప్పిపోవటం, లేక భయంకరమైన ప్రమాదమైనా, అయి వుండవచ్చును. ముందుగా మనమే ఆయన ద్వారా ఆదరింపబడుటకై అట్టివి అంగీకరించుము. "దుఃఖపడువారు ధన్యులు. వారు ఓదార్చబడుదురు."

నేను సాధారణముగా మాటిమాటికి చెప్పెడు ఒక సంగతి తిరిగి చెప్పెదను నేను కెనడాలో వుండిన కాలమందు ఒక మారు చలి విస్తారముగా నుండెను. నా చేతిలో పైసాలేదు. నేను ఒక కోకోడబ్బాను కొనగా ఎన్నో [illegible]ము ఆ కోకోయే నా భోజనముగా నుండెను. ఎంతో వ్యసనపడుచు ఒకనాడు వీధిలో పోవుచుండగా మనస్సులో యిట్లనుకొంటిని - "నేను పాపములో జీవించినంత కాలము డబ్బుకు, స్నేహితులకు కొదువనేది లేదు. ఇపుడు రక్షింపబడ్డాను. డబ్బు ఎగిరిపోయింది. స్నేహితులు ఎగిరిపోయారు." మనస్సు ఎంతో కృంగియుండెను. ఒక పెద్ద భవనము కనబడగా లోపలికి వెళ్లితిని. ఒక ఖాళీ పడక కుర్చీ అక్కడుండెను. అందులో కూర్చుండబడితిని. అలసిపోయి ఆకలితో నుండుటనుబట్టి నిద్ర వచ్చినది. ఆ కుర్చీలో నిద్రించుచుండగా ఎవరో నా భుజముపై చేయివేసి, ఒక చిన్న స్వరంతో యిట్లనుట వింటిని- "ఏకాకిగా వున్నావని ఏల తలచితివి? నిన్ను ఎన్నటికి విడువను ఎడబాయను అని నేను నీకు చెప్పలేదా? నీకీ వ్యసనము ఎందుకు?" నేను "ప్రభువా నీయందు సంశయము కలిగినందుకు నన్ను క్షమించుము' అంటిని. ఆ భవనమునుండి బయటకు వచ్చి మలుపు తిరగగా ఎత్తయిన ఒక పురుషుడు కనబడెను. అతడు నన్ను సమీపించి ఇట్లనెను: "నీవు ఇండియా నుండి వచ్చితివికదా?" "అవునా" అంటిని. ఇండియా నుంచి వచ్చిన ఎవరినైనా కలుసుకోవాలని, మా తల్లిదండ్రులు ఎంతో ఆతురతగా వున్నారు. అదిగో అక్కడ వున్నకారు నాదే, రా మా

యింటికి తీసుకెళ్లుతాను. మా తల్లిదండ్రులను చూతువుగాని అనెను." అతడెవరో! నాకు తెలియదు. ఆమెరికాలో పట్టపగలే మనుష్యులను దోపిడిచేసే దొంగలున్నారని విని వుంటిని. వారు మీద తుపాకి గురిపెట్టి, నీ సొమ్మంతా దోచుకొందురు. అతడొక దొంగ అయి వుండునేమో అనుకొంటిని. "అయితే నా దగ్గర వాడికి ఏమిదొరుకును? పైసాలేదు. ఒక వాచి అయినా లేదు. వెళ్లితే, తంటాఏముంది?" అని నాలోనేను తలపోయుచు అతనితో వెళ్లితిని. సరోవరము ఒడ్డుననున్న ఒక మంచి గృహమది. "నిన్ను చూడడం మాకెంతో సంతోషము. మధ్యాహ్న భోజనము కొరకు ఆగండి" అని అతడెనెను. రెండు మారులు, "వద్దండి వందనములు' అంటినిగాని, మూడవమారు సమ్మతించితిని. మంచి భోజనము వడ్డించిరి. ఆ వూరిలో నేనున్నంత కాలము, వారు నా స్నేహితులుగా నుండిరి. ఈ రీతిగా ప్రభువు నన్ను ధైర్యపరచెను. ప్రతి దుఃఖము ప్రతి శ్రమలో ఆయన నాకు అంతకంతకు ఎక్కువ ప్రియుడాయెను. దేవునియొక్క ఉప్పు అగు పద్ధతి ఇదే. నీవు దేవునికి ఉప్పు అగుదువా?

## ఆయనను అంగీకరించి, ఆయన ఉప్పుకమ్ము

"ఈమరు లోకమునకు ఉప్పయి వున్నారు" అనుచున్నాడు యేసుక్రీస్తు ప్రభువు మనలో ప్రవేశించితేనేగాని యిది అసాధ్యం ఆయన నీ సజీవ రక్షకుడు కావలెను. ఆయన నా రక్షకుడైన కాలమందు, రక్షణ క్రొత్త జన్మము, ప్రాయశ్చిత్తము, అను పదముల అర్థమే నాకు తెలిసి వుండలేదు. అపవాది అనగా యెవరో యెఱుగను. అయితే జరిగిన సంగతి ఏమనగా, ప్రభువు నాకు ప్రత్యేక్షమై, నా సమస్తపాపముల భయంకరతను చూపెను. ఈ దర్శనమందు నా శరీరమంతా నల్లనిమచ్చలతో కప్పుబడెను. నాకొక దుర్గంధము కొట్టుచుండెను.

అప్పుడాయన, ఖక్తసింగ్, నీవు చూచుచున్న మచ్చలు నీకు వచ్చుచున్న దుర్గంధము నీ పాపముల వల్లనే" అనెను. నేనిట్లు ప్రత్యుత్తర మిచ్చితిని. "అవును ప్రభువా, సత్యము. యిన్ని ఏండ్లు నా పాపములు అందరికి దాచి పెట్టితిని. ఐతే నేడు వాటిని ఒప్పుకొనుచున్నాను. నేను ఘోరపాపిని, అంతటా మలినమైనవాడను, మనశ్శాంతి లేనివాడను." అప్పుడొక ప్రేమగల స్వరము యీ రీతిగా వినబడెను. "ఇది నీ కొరకు విరువబడిన నా శరీరము. ఇది పాపక్షమాపణ నిమిత్తము నీ కొరకు చిందింపబడిన నా రక్తము చిందింపబడెననియు నమ్ముచున్నాను" అని అంటిని. అప్పుడు "నీ పాపములు క్షమించబడి యున్నవి" అను ఒక చిన్న స్వరం వచ్చెను. ఆ సమయమునుండి నేను పూర్తిగా మారిపోతిని. పాపములమీద నుండిన రుచి తీసివేయబడెను. ప్రేమగల ప్రభువు నా హృదయములోనికి వచ్చెను. ఆ సంతోషకరమైన దినము కొరకు ఇప్పటికిని ప్రభువుకు వందనములు చెల్లించు చున్నాను. దైవదూషకునిగా నుంటిని. ఆయన నన్ను ప్రేమించి సదాకాలమునకు తనవానిగా నన్ను చేయుటకు నేను పాత్రుడను కాను. ఆయన ప్రేమగల రక్షకుడని ఎరుగుదును. ఆయన నన్ను ప్రేమించుచున్నాడు. ఆయనను త్రోసి వేయకుమని నేను నిన్ను వేడుచున్నాను. కష్ట దుఃఖములు వచ్చునని జడియకుము. నీకు ఆయన నిత్య ఓదార్పు నిచ్చును. అనుదినం నిన్ను నడుపును. ఏ బాధలైనను, నీతో: ' నా కుమారుడా, నా కుమారీ, నీకు నేను తోడై వున్నాను, భయపడకుము" అని అనును. నేను ప్రతి దుఃఖములోను, ఆయనను రుజువుపరచు కొంటిని. ఆయనను ప్రేమించుచున్నాను. ఆయన నా దేవుడు ఆయన నీ జీవముగల రక్షకుడగును. ఆయన నాకెంతో ప్రశస్థమైన వాడగును. ఆయన యింకనూ నీకు ప్రశస్తమైనవాడు కాని యెడల, ఇప్పుడే ఆయనను నీ ప్రశస్తమైనవానిగా చేసికొనుము ఆమెన్.

✤ ✤ ✤ ✤ ✤

# 5

# ఉప్పుకు సారము నిచ్చుట -3 సాత్వికము

"మీరు లోకమునకు ఉప్పయియున్నారు" మీరు లోకమునకు వెలుగైయున్నారు" మత్తయి 5:13-4 ఈ వాక్యము ఒక దానికొకటి సంబంధించి యున్నవి. ఈ నిదర్శనముచే, దాని అర్థము చెప్పనిమ్ము. మనకు ఆకలిగానున్నపుడు మరియు అలసిపోయి బడలిక చెందియుండగా, మన ముఖములు కళాహీనములుగా నుండును. ఎవరితోనైనా మాట్లాడుటకుగాని, ఒక చిరునవ్వు నవ్వుటకుగాని, మనకు అయిష్టముగా నుండును. ఏడ్వవలెనని కూడా మన కుండును. అట్టి సమయమందు మంచి రుచిగల భోజనము దొరికిన ఎడల, వాడిపోయిన ఈ ముఖముల మీదనే కాంతి కనబడును. క్రొత్త వెలుగుతో కండ్లు ప్రకాశించును. ఉప్పు వెలుగు ఈ రెండును మన జీవితంలోనికి రాగా, ఆత్మీయముగా కలుగు అనుభవము ఇట్లే యుండును.

## పరలోక ఆనందము కొరకు ఆకలిగొనియుండుట

ఇంతరవకు మా ప్రయత్నములు యేసుక్రీస్తు ప్రభువు మానవజాతికి క్రొత్త సంతోషము, క్రొత్త సమాధానము, క్రొత్త వెలుగు కలిగించునట్టి ఉప్పుగా పాపులను తయారుచేయుటకై వారిని రక్షించ ఏవిధముగా వెదకుచున్నాడో, అది మీకు తెలియజేయవలెననియే. నరునికి సంతోషమిచ్చుటకే ఆయన భూలోకమునకు ఏతెంచెను. ఏ యుగమందైనా నరులు సంతోషముగా నుండవలెనని, అయితే, సంతోషము సంపాదించుట ఎట్లో వారు ఎరుగరు. దేవుడు ఎవరో, ఎక్కడున్నాడో! ఆయనను కనుగొనుట ఏవిధముగానో, ఆయనతో మాట్లాడుట ఎట్లో ఇవేవియు వారికి తెలియవు.

నేను మారుమనస్సు పొందక పూర్వము నాకే ఈ ఆకలి దప్పులుండుట నాకు జ్ఞాపకము. సిక్కు మతము, దేవుడు చాలా చాలా దూరమున వున్నాడని బోధించును. ఆయనను సమీపించుట ఎట్లని ఆశ్చర్య పడుచుంటిని. నా భావ మేమనగా ఎక్కడో కొందరికి మాత్రమే సంవత్సరముల కొలది ఆయనను వారు వెదుకగా తుదకు దూరమున వారికి కనబడునని అయినను, నా బాల్యదినములలో ఇట్లు ప్రార్థించుచుంటిని. "ఓ దేవా, నీవు ఎవరు? ఎక్కడున్నావా? నీవు నాకు దొరకడము ఎలాగు"? ఈ మాటలతోనే అనేక మారులు ప్రార్థన చేసియుంటిని. ప్రార్థన చేసిన కొలది అంతకంతకు నేను ఆయనకు దూరమగుచుంటినని తోచెను. అన్ని యుగములలో కూడా నావలెనే అనేకులు శాంతి కోరుచు ఆయన ఉన్న రీతిగా ఆయనను తెలిసికొన వలెనని, ఆయనను వెదకినవారుగలరు. కట్ట కడపటికి విసిగిపోయి తమ ప్రయత్నములను మానుకొనిరి. దేవుని కనుగొనుటకై, ఎడేండ్లు ఎక్కడెక్కడో సంచిరించిన ఒకతను, నా దగ్గరకు వచ్చెను. దక్షిణ ఇండియాలో ఎక్కడనో అతడు ఒక ప్రొఫెసర్ అట. తుదకు ప్రాణము విసిగి ఉద్యోగమును, భార్య బిడ్డలను విడిచిపెట్టి అతడొక సాధువుయిపోయెను. వెంట్రుకలు, గోళ్ళు పొడవుగా పెరిగిపోవుచుండెను. దేవుని వెదకుచు ఎనుబది నాలుగు పుణ్యక్షేత్రములు దర్శించి యుండెనట. అతని ముఖమంతయు ముడతలు పడియుండెను. "దేవుడు దొరికెనా?" యని నేను ప్రశ్నించగా, "నా ప్రయత్నాలన్నీ వ్యర్థమే" అని చెప్పెను. అన్ని యుగములలో ఎందరో దేవునిని కనుగొనవలెనని, వారి హృదయములు ఆకలిగొనుచుండెను. నేను మారు మనస్సు పొందక పూర్వము లండనులో నుండిన కాలమందు ఎందరో ధనికులను పండితులను వారు నిజ సంతోషమును కలిగియున్నారాయని అడిగియుంటిని. సత్య ఆనందము వారికుండెనని, యుదార్థముగా ఎవరు చెప్పకుండిరి.

# పరలోక ఆనందముయొక్క రహస్యము

ఎప్పుడైతే పరలోక ఆనందమును పొందితిమో ఇతరులతో దానిని పంచుకొనవలెను. మన మట్టుకే దానిని ఉంచుకొనలేము. పొరుగువారితోను, పరాయి వారితోను. బంధువులతోను. కలసిన వారెల్లరితోను, శత్రువులతో సహా దానిని పంచుకొనవలెనని మనము ఆశింతుము ఈ సంతోషము నీకు దొరికెనా? నీ ద్వారా ఎంతమంది ఈ సంతోషమును కనుగొనిరి. "అందుకే మీరు లోకమునకు ఉప్పయియున్నారు" అని ప్రభువు చెప్పుచున్నాడు. నీవెక్కడుండినను, సంతోషము వెదజల్లుదువు. దీనమనస్సు, విరిగిన హృదయములద్వారా మనము స్వచ్ఛమైన ఉప్పు ఎట్లు కాగలమని కూడా చూచియుంటిమి. మన బంధుమిత్రాదులు మనలను ద్వేషింపను, తృణీకరింపను ప్రారంభించినపుడు ప్రభువు మనలను ఆదరించును. దైవ ఓదార్పు తెలిసికొనుటకు అన్ని విధములైన దుఃఖములలో పడి వెళ్ళవలసి యున్నది. ఇతరులను మనము ఆదరించుటకు మనము పొందినట్టి తర్ఫీదు ఇదే. మరికొంత చూతము.

అ) సాత్వికము : 5వ వచనమందు, "సాత్వికులు ధన్యులు వారు భూలోకమును స్వతంత్రించుకొందురు" అని చదువుచున్నాము ఎంతగా వారికివ్వవలెనని! దేవుడు ఏర్పాటు చేసి యున్నాడో అనేకులు గ్రహించకున్నారు. మనము తలంచుదానికంటె అత్యధికముగ దేవుడు మనకిచ్చును. మనకు ఆయన అందించునట్టి అధిక్యతను గ్రహించుటకై మనము ఆయన హృదయములో ప్రవేశింపవలెను. చాలా సం॥ల క్రింద ఒక బిక్షగాడు నా దగ్గర పైసలు అడుగుటకు వచ్చెను. 'నీకు డబ్బెందుకు?' అని అడిగితిని. "ఆకలిగా వున్నది" అనెను. నాతోరా నీకు మంచి భోజనము ఇప్పిస్తాను" అంటిని. కొంతదూరము నాతో వచ్చి ఒక అణా ఇవ్వండి అనెను. నేను నీతో హేళన చేయడములేదు. నాతోరా నీకు

భోజనము ఇప్పిస్తాను అంటిని మరి కొంత దూరము నాతో నడిచి " ఒక దమ్మిడి ఇవ్వండి పోతాను" అనెను. "ఇదిగో ఇదే హోటల్ రా" అని పిలిచితిని. హోటల్ చేరితిమి. అతడు భోజనం చేసిన తరువాత టీ కూడా తెప్పించి పైగా అర్ధరూపాయి చేతిలో పెట్టితిని. ఇవి నాకేనా? అని ఆ బిచ్చగాడు అడిగెను. నీకే అంటిని, వాడికి ఎప్పుడు దొరుకునవి దమ్మిడీలే. అందుచేత నేనేమి ఇవ్వవలెనని నా హృదయమందుండెనో అతనికి కనబడలేదు. అట్లే ఎంతమట్టుకు మనకు దేవుడు ఇవ్వగలడో మనకు నమ్ముటకే కష్టముగానున్నది. కొరింథి 1కొరి. 2:9-10; మత్తయి 13:17; ప్రకటన 21:7 చూడుము. ఇవి విచిత్రమైన వాక్యములకావా! "దేవుడు తన్ను ప్రేమించు వారికొరకు ఏవి సిద్ధపరచెనో అవి కంటికి కనబడలేదు, చెవికి వినబడలేదు. మనుష్య హృదయమునకు గోచరముకాలేదు" వీటిని చూచుటకు అనేక ప్రవక్తలు నీతి మంతులు కోరిరి గాని వారికి గోచరం కాలేదని కూడా దేవుని వాక్యము చెప్పుచున్నది. మన పాపములను క్షమించుటయే గాక తనకున్న సమస్తము మన కివ్వవలెనని దేవుని కోరిక.

మత్తయి 11:28 చూడుము. 'నా యొద్దకురండి.' ప్రభువైన యేసుక్రీస్తుయొక్క అద్భుతమైన మాటలివి ఇట్టి మాటలు పలికిన ఇంకొకడు ఈ లోక చరిత్రలోనే లేడు. పాపులమైన మనము ఎంత బరువైన భారము మోయవలసి వున్నదో అదంతయు ఆయన ఎరుగును. ఒక పెద్ద బరువు నీవు మోయవలసి యుండిన యెడల నీకెట్లుండును? నేను పొలములందు పనిచేయుచుండగా పెద్ద పెద్ద బరువులు మోయవలసి వచ్చినది. కొన్ని గజముల దూరము నడుచునప్పటికి ఆయాసపడి నొప్పుచుంటిని. మెడ [illegible], కాళ్ళు, ఎముకలు కూడా అలసిపోయి వణకుచుండెను. [illegible] మోయుచున్నప్పుడు కూడా మనకు ఇట్లే యుండును. అవి [illegible] అందుకే మన అందరితోను ప్రయాసపడి

భారము మోసికొను సమస్త జనులారా నా యొద్దకు రండి'అని చెప్పుచున్నాడు. ఎటువంటి ప్రేమగల పిలుపిది! మన పాప క్రయమును తానే చెల్లించుటకు యేసు ప్రభువు ఇష్టపడెను మన పాపపు తలంపులకు, భావములకు సహితం ఆయన సంపూర్ణంగా క్రయము చెల్లించివేసెను.

చీనా దేశమందు ఎవరైనను భోజనమునకు పిలిచినచో కనీసము 20,30 రకముల పదార్థములు తయారు చేయుదురు. నీవు మరియెక్కువగా భుజించునిమిత్తము రకరకములైన రసములు, పానీయములు నీకు వడ్డింతురు. అవసరమైనప్పుడెల్ల ముఖము తుడుచుకొనుటకు నీకు ఒక తువాలును కూడా ఇత్తురు ఈ పదార్థములు భుజించుచుండగా కొంత సేపటికి నీ పొట్ట ఇట్లనును. చాలు చాలు ఇంకా ఎక్కించాలంటే నాలో స్థలము లేదు. అనగా పొట్ట ఇట్లు చెప్పినట్లగును. 'అయ్యగారు నాకు పూర్తిగా తృప్తి అయింది. ఇంకేమియు నాకొద్దు సంపూర్ణ.' తృప్తి నొందిన ఉదరము సంపూర్ణ తృప్తి విశ్రాంతికి గుర్తుగా నున్నది. తాను సృజించిన ప్రతీదియు మంచిదైనట్లు దేవుడు చూచెను. తన సృష్టిని దేవుడు చూచిన దినమును తలంచుము. పాపశాపము అంటని విచిత్రమైన సృష్టియది. ఒక అంగలార్పు ఎరుగరు. విష సంబంధమైనది ఏదియు ఎరుగదు. సమస్తము ఆశ్చర్యకరముగా నుండెను. లోకములో ఏ భాగము చూచినను, సౌందర్య శృంగారములతో నుండెను తన చేతి పనియైన ఈ సృష్టినిచూచి 'చాలా బాగుగా ఉన్నది' అనెను. అంతయు సొగసుగాను, తేజోవంతముగా నుండెను. ఆనందముతో ఆయన హృదయము నిండి యుండెను. దానినే విశ్రాంతి యనవచ్చును.

ఆయన కార్యము భంగమగుటచేత దేవుని విశ్రాంతి చెడెను అది భయంకరమైన నష్టమే. ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా దేవుడు తిరిగి విశ్రాంతిని సంపాదించుకొనుచున్నాడు. విలువైన సామానులను తీసికొని పోవుచున్న ఓడలు ఒకప్పుడు తుఫానులు వీచుటవలన సముద్రములో

మునిగిపోవును. సముద్రము లోపల దిగుటకు నేర్చుకొనిన వారిలో కొందరని కుదిర్చి ఆ సామానులను పైకి తీయుదురు. నష్టపోయిన ప్రతి దానిని తిరిగి సమకూర్చుటకే మన ప్రభువు లోకమునకు వచ్చెను. దేవునియొద్దనుండి ప్రతిదియు ఆయన మనస్సున సంకల్పింపబడిన ప్రతిదియు సంపూర్ణముగా మనము పొందువరకు మన ప్రభువు తృప్తి పొందడు. సాత్వికముగా ఉండ నేర్చుకొనుట ద్వారా ఇది కలుగును. ప్రభువైన యేసుక్రీస్తులోని సమస్త ఐశ్వర్యమును మనము పొందగలుగుట ఈ రీతినే. అందుకే "నా యొద్దకు రండినాయొద్ద నేర్చుకొనుడి. నేను సాత్వికుడను, దీనమనస్సు గలవాడను, నేను మీకు విశ్రాంతి కలుగజేతును." ఈ పాఠము నేర్చుకొనుటకు జీవిత కాలమంతయు పట్టును. మారుమనస్సు పొందుటకు పూర్వము మనకుండిన గర్వమును అనగా కుటుంబము, దేశము, స్నేహితులు, బంధువులు లేక యోగ్యతలను బట్టి అతిశయించు గర్వమును విడిచి పెట్టవలెను.

(ఆ) దీనత్వము : మనము అతిశయించురీతిని విశదపరచు ఒక నిదర్శన మిదిగో. లాహోర్‌లో నా బంధువుడు ఒక గొప్ప ఉద్యోగములో నుండెను. నన్ను ఏ స్నేహితులు చూడ వచ్చినను, "శంకరముగారు తెలుసా?"అని అడుగుదును. "తెలుసును" అనినచో " ఆయన మా అంకుల్ అని తెలుపుదును ఈ అంకుల్ ఎప్పుడైనా నన్ను పలుకరించికూడా ఎరుగడు. పేదవానిని మట్టుకు అంకుల్ అని ఎన్నడునూ చెప్పను. మనలను మోసగించుటకు అపవాది ఎన్నో మాయోపాయములు చేయును. నీవు అద్దములో చూచుకొందువు కదా? "ఒరే నీ పళ్ళు ఎంత బాగున్నాయి, ఏమి అందము!" అని చెప్పినట్లేవుండును. తిరిగి చూచుకొనుచున్నావు. ఇప్పుడు అద్దము యిట్లు చెప్పుచున్నది: "నీ కండ్లు చూచితివా? నీవు పద్మలోచనుడవే, తిరిగిచూచుకో," ఇదే మన స్వభావము. మనలను బట్టి మనమూ అతిశయించు చున్నాము. ఐతే యిని త్వరలో గతించిపోవునట్టివి.

దేవుని యెదుట మనము యెందుకును పనికిరానివారము. పరిశుద్ధుడైన దేవుడు బైబిలునందు మన నీతిని మురికి గుడ్డలు అనుచున్నాడు. అవి ఎట్టివో కొంత ఆలోచించుము. ఒక కుష్టుడైనా తన పుండ్లను కట్టుటకు అంత అసహ్యకరమైన మైలతోనున్న గుడ్డలను ముట్టడు. దేవుని యెదుట మన స్థితి యిదే. మారు మనస్సు పొందిన పిమ్మట ఆయనకొక వింతయైన ఐశ్వర్యముగా చేయబడితిమి. ఐతే మన పరలోకపు పిలుపును గ్రహించవలెనని మనము స్వాతికులము కావలెను.

1 కొరింథీ. 15:10లో పౌలు చెప్పుచున్న దానిని చూడుము. "నాకు అనుగ్రహింపబడిన ఆయన కృప" పౌలు, ప్రభువు బలముగా వాడుకొనిన దైవజనుడు. అతని వంశము, జ్ఞానము, విద్యలను బట్టి చూడ వున్నతమైన లోకయోగ్యతలు కలిగినవాడు. అటు తరువాతనే అతడు అపోస్తలుడాయెను. అయినను ఏమనుచున్నాడా? "నేనేమైయున్నానో అది దేవుని కృప వలననే అయియున్నాను."

మనము తిరిగి జన్మించగా ప్రతివానికి ఏదో ఈవి దేవుడిచ్చి యున్నాడు. ఐతే దానినిబట్టి మనము గర్వించకూడదు. ఈ నిదర్శనము చూతము. మనకు తపాలావాడు మనిఆర్డర్లు తెచ్చును. ఆ మనిఆర్డర్లకొరకు తపాలావానికి వందనములు చెల్లించముకదా? చెల్లించినను 'వందనములు నాకు చెందవు. ఆ ధనము పంపిన వారికి చెల్లించుము' అని అతడు చెప్పును. మనము దేవుని తపాలావారము మాత్రమే. మనము దేవునిదగ్గర పొందినవి మన చుట్టుప్రక్కల నున్నవారికి అందించుచున్నాము యిట్లు చేయుట ఆయన కృపవలననే. కావున మాత్రము దేవుడు మనకిచ్చిన ఈవులను బట్టి మనము అతిశయించుటకు కారణమే లేదు.

నేను బెంగుళూరులో దేవునిపని చేయ ప్రారంభించినప్పుడు నాకొక మంచి పనివానిని ఇమ్మని ప్రభువును వేడితిని సువార్త ఉద్యోగముల విస్తీర్ణమైన

ప్రదేశములలో అంతటా పర్యటనము చేసి వ్యక్తిగతముగాను బహిరంగముగాను సువార్త చెప్పవలెనని నా భావము. ఈ జతపనివాడు సర్వకళాశాల బిరుదుగలవాడై యుండవలెనని కోరితిని. ఇటువంటి స్నేహితుడుండగా నిరాటంకముగా ప్రార్థన చేయుచు సేవ జయకరముగా జరిగింపవచ్చునని అనుకొంటిని. ఒకనాడు గడ్డము పెంచుకొనిన ఒకడు వచ్చి బ్రదర్ మీ జతపనివానిగా వుండుటకు దేవుడునన్ను పిలుచు చున్నాడు అనెను. నేను బసచేసి యుండిన పేటలో యితడు స్వీపరుగా నుండెను. వట్టి తెలివితక్కువవాడు. ఇట్టివానిని తన సేవకు దేవుడు పిలిచేనాయని సంశయించితిని. ఒకనాడు ఇతడు నా దగ్గరకువచ్చి, "బ్రదర్ మా యింటికి కొంతమంది అతిథులు వచ్చియున్నారు. మీ ఎలెక్ట్రిక్ బల్బు ఒకమారు యివ్వండి అనెను." నేను ఇచ్చితిని. కొంత సేపటికి తిరిగివచ్చి "అది వెలుగడములేదు" అనెను. నేను మంచిబల్బు నీకిచ్చితిని అంటిని. "మా ఇంటికి మీరే వచ్చి చూడండి" అని అడిగెను. నేను అక్కడికి వెళ్ళితిని. అక్కడ ఒక త్రాడు కొసకు అది వ్రేలాడ కట్టబడి యుండుట చూచితిని. ఎలెక్ట్రిక్ తీగలులేవు, ఏమీలేవు అతడేమో "వెలగడంలేదు, వెలగడంలేదు" అని ఒకే పాట పాడుతున్నాడు. అతడంత మూఢుడు. మరొకనాడు వచ్చి "నాకేదైనా పని ఇవ్వండి చేస్తాను" అని నన్ను అడిగెను. "ఈ సువార్తల్ని తీసుకువెళ్లి బజారులో అమ్ము" అని యంటిని. "ఈ నీలిరంగుది లూకా సువార్త, ఆకుపచ్చ రంగుది మత్తయి, ఎర్ర రంగుది లూకా సువార్త, ఆకుపచ్చ రంగుది మత్తయి, ఎర్ర రంగుది మార్కు, పసుపు రంగుది యోహాను సువార్త." ఒక్క మారుకాదు. పదునైదు మారులు ఈ విధముగా బోధించితిని అతడు గుమ్మము వెలుపల అడుగు వేయునంతలో నేను చెప్పినదంతయు మరచిపోయెను. బజారులో ఒకనాడు ఇతని గడ్డము చూచి ఇతడు మహమ్మదీయు క్రైస్తవుడు కాకముందు ఎవరవు?" అతడిచ్చిన ప్రత్యుత్తరం "గాడిదగా

వుంటిని" అలాగంటే ఏమి? "ఏమంటే? ప్రభవు యేసుక్రీస్తుని నమ్మనివారంతా గాడిదలన్నమాట." "నేను గాడిదను కాను" అని అతడనెను. అయ్యా మీ సంగతికాదు, ప్రభు యేసుక్రీస్తుని ఎవరు నమ్మరో వాళ్ళే గాడిదలు" ఈ మనుష్యుడే నా జత పనివాండ్రలో ఉత్తమమైన వాడాయెను. ఇతడు హిందూ దేవాలయముల లోపలికి ప్రవేశించువాడు. "ఇది దేవాలయమని ఎరుగవా?" యని ఎవరైనను ప్రశ్నించినచో "అయ్యా తెలియలేదండి" అనును. ఇట్టి సాహసంతో మహమ్మదీయులకు, హిందువులకు, క్రైస్తవ పాస్టర్లకును సువార్తలు అమ్ముచుండెను. ఎందుకు చెప్పుచున్నానంటే సర్వ కళాశాల బిరుదలు గలవారు కూడా ఈ దినములలో నోరుతెరచి ప్రభువైన యేసుక్రీస్తును గూర్చి ధైర్యంతో సంభాషింపరు. అంతభయము; దేవుడైతే వెర్రివవారినికూడ తన సువార్తను వ్యాపింపచేయుటకై ఉపయోగింపగలడు. కుటుంబ అంతస్థు, విద్య, దేనిని బట్టియైనను, మనము అతిశయించుటకు వీలులేదు. అనుదినము ఆయన కృప కొరకు వందనస్థులమై దీనులముగా, సాత్వీకులముగా ఉన్నప్పుడే దేవుడు మనలను ఉపయోగింపగలడు. దేవుని రాజ్యము ప్రవేశింప ఎవరికైనను ఉండవలసిన యోగ్యత దీనత్వమేగాని బైబిలు జ్ఞానము, విద్యాబిరుదుల కావు. మత్తయి 5:5 చూడుము, "సాత్వీకులు ధన్యులు; వారు భూలోకమును స్వతంత్రించు కొందరు." ఈ స్వాస్థ్యమునుఏ విశ్వాసియైనను పొందగలుగును దేవునికి వందనములు; ఈ స్వాస్థ్యము మన వంశము, మన ఆరోగ్యము, మన విద్యలమీద ఆధారపడియుండలేదు.

## నా కృప చాలును

నేను క్రైస్తవుడైన తరువాత నా జీవితము జయకరమైనది గాను ఫలించునట్టిదిగాను ఉండజేయుటకు తన శక్తి యొక్క మర్మమును నాకు చూపుమని రెండేండ్ల పర్యంతము దేవునికి ప్రార్థన చేయుచు

నేయుంటిని. రెండేండ్ల పర్యంతము దేవునికి ప్రార్థన చేయుచునేయుంటిని. రెండేండ్లు ఇట్లు గడచని పిమ్మట ఒక రాత్రి ప్రభువు నన్ను కలిసికొని 'భక్తసింగ్ నీ పాపములు ఏ విధముగా క్షమింపబడెనో నాతో చెప్పుము' అనెను. "ప్రభువా నా వంటి పాపి ఇంకొకడు జీవించి యుండలేదనియు నమ్మితిని అప్పుడు బలహీనుడు జీవించి వుండలేడనియు నీకెట్టి శక్తి లేదనియు నమ్ముచున్నావా? చెప్పుము" అనెను. నా సందేహములన్నియు నమ్ముచున్నావా? చెప్పుము" అనెను. నా సందేహములన్నియు తక్షణమే ఎగిరిపోయెను. ప్రభువు లేకుంటే నా బలహీనత, శక్తిహీనత ఎటువంటిదో గ్రహించితిని. నేను ఒకమాట కూడ పలుకలేను. ప్రతిదినము "ప్రభువా నేను నత్తివాడను తడబడుచునే ఎట్లో మాటలు పలుకుదును, అంత జనము మధ్య నేనేలాగు మాట్లాడగలను, నా పెదవులను, గొంతుకనుతాకుము అని ఎక్కువగా ప్రార్థన చేయుచుంటిని. ఆయన నమ్మకమైన వాడు, నా బలహీనతను ఎరుగును గనుక "నా కృప నీకు చాలును" అని చెప్పుచుండెను. అది ఎవరికైనను విస్తారమైన చాలినంత కృప. మనము విద్యలేనివారమా?నిరుపేదలమా ఎక్కడ చూచినా మనలో వంకలే ఉన్నవా? కురూపులై సామాన్య జనులమా? అయినను దీనులమై, సాత్వికులపై యుంటిమా, ఆయన చేతిలో విచిత్ర ఉపకరణములు కాగలము నేను చెప్పగలను. అడుగు అడుగునకు బలహీనుడను, చేతకానివాడనైనను ఆయన కృపను నమ్ముకొని యున్నామని చెప్ప గలను. ఆయన రాజ్యములో ప్రవేశించుటకు మనకు ఉండవలసిన యోగ్యత ఇట్టి విశ్వాసమే. –

## ముందుగా - ఆయనను నీ హృదయములోనికి చర్చుకొనుము

మున్ముందుగా నీ పాపములు క్షమించబడవలెను. ఇదే క్రైస్తవ జీవిత ప్రారంభము. క్రొత్త జన్మముయొక్క అనుభవము లేనిదే ఈ

సత్యములేవియు మనకు బోధపడవు. 'నీవు తిరిగి జన్మించియున్నావా?' అనే నేను నిన్ను ప్రశ్నించినచో నామీద కోపపడుదువేమో. 'ఏలాగున్నావు?' అని ఎవరైనను నిన్ను అడిగినచో కోపం వచ్చునా? చిరునవ్వు నవ్వుచు "బాగానే వున్నాను, మీకు వందనములు" అందువు. "నీవు తిరిగి జన్మించితివా?" అను దాని అర్థముకూడ "క్షేమంగా ఉన్నావా?" అనుటయే. అంటే నీకు కోపమేల రావలెను? ఆయన నీకు సమాధానము అనుగ్రహించియున్నాడా? ఆత్మీయముగా బాగున్నావా? ఆయన నీకు ప్రియ స్నేహితుడాయెనా? ఆయన నీతో మాట్లాడగలడా? నీవు ఆయనతో మాట్లాడుదువా? ఆయన సాన్నిధ్యము నీకు తెలియుచున్నదా? ఈ ప్రశ్నలన్నింటికి "అవును" అని నీవు చెప్పలేనిచో ఇది చదువుచుండ నీవు ఈ క్షణమే ఆయన పాదములయొద్దకు రమ్ము. ఇప్పుడే ఆయన నీ పాపములను క్షమించును, కడిగివేయును. తన ప్రేమ నీయందు పోసి తనరాజ్యములో నిన్నొక పౌరునిగా చేయును. నీవైతే ముందుగా నా హృదయమందు ప్రవేశించుమని ఆయనను అడుగవలెను.

✤ ✤ ✤ ✤ ✤

# 6

# ఉప్పును శుభ్రపరచుట-1: నీతి

### పరిపూర్ణులుగా నుండుడి

"మీరు లోకమునకు ఉప్పయి వున్నారు" (మత్తయి 5:13)

దేవునిగూర్చి మూడు అంశములు బైబిలునందు నిరూపింపబడి వున్నవి. మొదటిది-దేవుడు వున్నాడని. సకల జాతులలో అజ్ఞానులైనవారు దేవుడు లేడని ఋజువుచేయు నిమిత్తం ఎల్లప్పుడు ప్రయాసపడుచున్నారు. బైబిలు దేవుడు వున్నాడని చాటుచు ఆయన సజీవమైన దేవుడనియు, ఒక వ్యక్తియైన దేవుడనియు ప్రచురించుచున్నది. ఆయన స్వరము వినగలము తాకుడు తెలిసికొనగలము. ఆయనతో మాట్లాడగలం. రెండవది - దేవుడు ప్రేమయై యున్నాడని బైబిలు చూపుచున్నది ప్రకటనయొక్క కడపటి అధ్యాయము అంతటిలో ఈ సత్యమును కనుగొందువు మూడవది - నీవు ఎవరైయుండినను దేవుడు నిన్ను ప్రేమించుచున్నాడని కనబరచుచున్నది. ఇతరులు నిన్ను ద్వేషించి తృణీకరించినను దేవుడు నిన్ను ప్రేమించుచున్నాడని నీతో నిస్సందేహముగా చెప్పగలుగుచున్నాను. మనయొక మారు ఆయనను రుచించితిమా, మనము ఎక్కడుండినను ఎక్కడికి వెళ్ళినను మనద్వారా ఆ దైవ ప్రేమను ఇతరులు రుచిచూతుడు మన బోధవలన మాత్రమే కాదు మన జీవితముల ద్వారాకూడ దైవిక ప్రేమ మనలోనుండి సదా ప్రవహింపగలదు.

ఇందుకే మనము మేలైన, స్వచ్ఛమైన ఉప్పు కావలెను. దేవుడు కోరుచున్నాడు. మంచి ఉప్పు రుచిగా వుండును: పాకిస్తానులో రాతి ఉప్పు దొరుకును. ఒకసారి జూన్ మాసమందు నేను పాకిస్తాన్‌ను విడిచి వచ్చుచుండగా "అమ్మా పాకిస్తాను నుంచి మీకేమైనా తేవలెనా" యని

మా తల్లిని అడిగితిని. "పాకిస్తాను ఉప్పు కొంచెము తెమ్ము" యని ఆమె ఆనెను అంతకంటే ఇంకేమియు ఆమె కోరలేదు. ఇక్కడ మనకు దొరుకు ఉప్పు మంచిదేకాదు. దానినిండా మురికి, మట్టి; దాని రాతి ఉప్పు స్వచ్ఛమైనది. ఇక్కడ మన వంటలో ఆ ఉప్పు కొంత ఉపయోగించితే పదార్థములు మరింత రుచిగా నుండును. ఆహారము రుచిగా నుండుటకు మనకు మంచి ఉప్పు కావలసియున్నది. మనము మంచి స్వచ్ఛమైన ఉప్పుగా నుండవలెనని ప్రభువు కోరుచున్నాడు. కొండమీదినుండి ఈ మాటలు చెప్పినప్పుడు అక్కడ పెద్ద సమూహముండినను, కొందరు శిష్యులకు మాత్రమే అవి చెప్పబడెను. సమూహమంతా కూడా మేలైన స్వచ్ఛమైన ఉప్పు కాకూడదని అర్థము కాదు. అయితే వారిలో అనేకులు వచ్చినది రొట్టెలు, చేపలకే, దేవుని వెదకుట లేదు. వారి ప్రయాసమంతయు నశించిపోయే ఆహారముకొరకే. ప్రభువైతే అంతకంటె మేలైనదానిని పుచ్చుకొనుమని వారిని అడుగుచున్నాడు. కొండమీద చేసిన ప్రసంగమంతయు ఒక్క వాక్యమందు ఇట్లు క్లుప్తపరచి యున్నాడు, "మీ పరలోకపు తండ్రి పరిపూర్ణుడు గనుక మీరును పరిపూర్ణులుగా ఉండుడి' మత్తయి 5:48. ఇదెంత ఉన్నతమైన కొలత! మనలను పరిపూర్ణులుగా చేయుట కొరకే ఆయన వచ్చెను. పాపమువలన పూర్తిగా చెడి, మలినమైపోయి యుండినను మను ప్రభువు హస్తములలోకి వచ్చుట వలన మచ్చ, మరకలేని వారమై పరిపూర్ణుల మగుదుము.

అనేక సంవత్సరముల క్రిందట ఒక గారడీవాని మంత్రము చూచితిని. ఒక మంచి గడియారమును తీసి ఒక కుండను దానిమీదకప్పి, పెద్దసుత్తిని పట్టుకొని ఆ గడియారము ముక్కలు ముక్కలుగా దంచివేసెను. అటుపిమ్మట ఒక గుడ్డను ఆ ముక్కలమీద కప్పివేసి, 'మూ' అనుచు, ఆ బట్టల క్రిందనుండి విరగని సరిక్రొత్త గడియారము నొకటి పైకి తీసెను. అదిఎట్లు జరిగెనని మేము చాలా ఆశ్చర్యపడితిమి. ఆ గడియారము

ముక్కలుగా పగులగొట్టబడుట చూచితిమి. ఒక్క క్షణములో అదిక్రొత్త గడియారమాయెను. ఇదంతయు గారడి విద్య, దేవుడుచేయు కార్యము సత్యమేగాని, మంత్రము కాదు. పాపమువలన పూర్తిగా చెడిపోయి, పాడైపోతిమి. అందుకే బైబిలులో మురికి గుడ్డలకు పోల్చబడి యున్నాము. ఎప్పుడైతే మారురూపము పొందుదుమో, మనము తేజోవంతమైన అమర్త్యులమగుదుము. ఇది దేవుని కార్యమేగాని మనవలన జరుగు పనికాదు. పాపము మనలను ఎంతగా పాడుచేసి యుండినను, దేవుని చేతియందు సంపూర్ణుల మగుదుము ఆ సమూహము వారందరు రొట్టెలు చేపలు దొరుకునని వచ్చియుండినను ఆ సమస్తమైన వారికొరకు ప్రభువు ఆశించునది పరిపూర్ణత. తన ప్రేమను వారు చూడవలెననియు వారు ఏ రీతిని సర్వమానవ జాతికి నిజమైన ప్రేమాసంతోషములు కలిగించునట్టి నిజమైన ఉప్పుగా కావచ్చునని చూపుటయే ప్రభువుయొక్క కోరిక.

## దేవుని కొరకు ఆకలి దప్పులు గొనుట

మత్తయి5వ అధ్యాయమందు మనము చూచినది ఏమనగా మనలను స్వచ్ఛమైన ఉప్పుగా తయారు చేయుటలో వివిధ కార్యములు జరుగవలెను. 6వ వచనమందు "నీతికొరకు ఆకలి దప్పులు గలవారు ధన్యులు" అని ప్రభువు చెప్పుచున్నాడు. అనేక మంది దేవుని వెదకుచున్నామని చెప్పుకొందురు గాని, అది వాస్తవము కాదు. తమ కొరకే ఏదో వెదకుచున్నారు. తాము పరిశుద్ధులు మహాత్ములు అని ప్రజలు ఎంచవలెనని పేరు ప్రఖ్యాతిని సంపాదించుటయే వారి యుద్దేశము ఇట్టి కీర్తిపొందు నిమిత్తము భయంకరమైన త్యాగములు, హింసాకరమైన యోగములు చేయుదురు. ఇప్పుడొక కథను వినుడి. ఇది అనేక మారులు చెప్పియుంటిని. అనేక శతాబ్దముల క్రిందట ఒక రాజు ఇండియామీద

దండెత్తివచ్చి హిందూదేవాలయములను దోచుకొనుచుండెను. బహువిస్తారమైన దోపిడి కూర్చెను. సింధూనదిని దాటిన పిమ్మట తన యుద్ధ భటులను పిలిచి వారితో, "నా పరాక్రమవంతులైన యోధులారా ఇన్ని మాసములలు నేను పడిన పాట్లలో మీరు నన్ను అంటిబెట్టుకుని యుంటిరి. ఇంత నమ్మకస్థులై ఇన్ని కష్టములు ఓర్చినందుకు మీ కందరికి బహుమానము ఇవ్వబోచున్నాను. వచ్చి బంగారు, వెండి, వజ్రాలు, ముత్యాలతో నిండిన ఈ ధన సంచిని విప్పి ఆ ధనమంతటిని పంచుకొనుడనెను" ఆయుద్ధభటులు ఆ ధనమంతయు వారి సంఖ్య ప్రకారము పంచి ఎవరి భాగము వారు తీసికొనిరి. ఒక యోధుడు మాత్రము రాజు పక్కన నిలిచియుండి కదలక యుండెను. అతనితో రాజు ఇట్లనెను. "నా దగ్గర ఉద్యోగము మానుకొనే ముందు పోయి నీ వంతు నీవు కూడా తీసికో". "రాజా, నాకు బంగారము, వెండి, వజ్రాలు వద్దు. నాకు నీవే కావలెను. ఎప్పటికి నీతోనే ఉందును" అని ఆ భటుడు ప్రత్యుత్తరమిచ్చెను. అత్యధికమైన బహుమానము పొందిన భటుడు ఎవరని తలంచెదరో చెప్పండి. ఆ రాజ మరణానంతరము అతని సింహాసనమును ఎక్కిన వారసుడు ఈ భటుడే.

తమ భూసంబధమైన కోరికలు తీర్చుకొనే నిమిత్తమే అనేకులు దేవుని వెదకుదురు. ఇదిగో ఒక నిదర్శనము ఒక మహమ్మదీయుడు కొన్ని ఏండ్ల క్రిందట నాయొద్దకువచ్చి, సహోదరుడా ఆగురించి ప్రార్థనచేయుండి, నాకు కుమారుడుపుట్టితే నేను క్రైస్తవుడనౌతాను," అనెను. నీవు ఎన్నటికీ క్రైస్తవుడవు కాలేవు భూసంబధమైన ఉద్దేశము పెట్టుకొనివచ్చువాడెవడును నిజ క్రైస్తవుడుకాడు" అని చెప్పితిని. "లేదు; నా కొరకు ప్రార్థన చేయుడి. నేను వెంటనే క్రైస్తవుడనవుతాను" అని నాతో అనెను. నేను ప్రార్థన చేసితిని. ఒక సంవత్సరము గడిచిన తరువాత అదే గ్రామము నేను దర్శించుట తటస్థించెను. ప్రకాశించుచున్న ముఖముతో

అతడు నన్ను కలిసికొని "దేవుడు మీ ప్రార్థన విని నాకొక కుమారుని ఇచ్చాడు. ఆరు మాసముల సమయము నా కివ్వండి. ఆ తరువాత క్రైస్తవుడ నౌతాను" అనెను. మరొక సంవత్సరము తరువాత తిరిగి వెళ్ళితిని. ఇంకొక ఆరు నెలలు ఆగమని మరల అతడు అడిగెను. "ఆరు నెలలు ఆగండి, ఆరు నెలలు ఆగండి" యనుచు ఐదు సంవత్సరములు వెళ్ళనిచ్చెను. తుదకు ఆ పిల్లవాడు చనిపోయెను. ఆ మనుష్యుడు ఇప్పటి కింకను అంధకారము లోనే పడియున్నాడు. ఘోరసంబంధమైన వాటికొరకే నీకు దేవుడుకావలెనంటె, దేవుని విషయము నిజమైన అనుభవము లేనివాడవే. అందుకే ప్రభువు ఇట్లనుచున్నాడు. "నీతి కొరకు ఆకలి దప్పులు గలవారు ధన్యులు."

కొన్ని సంవత్సరముల క్రిందట ఇరువురు యౌవన దంపతులను దర్శించితిని. వారికి కొత్తగా వివాహమై యుండెను. వారి మొదటి బిడ్డకు సుమారు రెండు నెలలుండును. ఆ భర్తతో నేను మాట్లాడుచు కూర్చుంటిని. ఆమె వంట గదిలో వంట చేయుచుండెను. బిడ్డ ఏడ్పుట మొదలు పెట్టెను. తండ్రి ఆ శిశువును శాంత పరచుటకు ఎన్నెన్నో ప్రయత్నములు చేసెను. ఆట వస్తువులను, గిలకలను పట్టుకొని బిడ్డను ఊరకుండ చేయజూచెనేగాని ఆ బిడ్డ ఏడుపు మానకుండెను. పిమ్మట ఆ శిశువును ఎత్తుకొని గదిలో అటునిటు తిరిగెను. ఏడుపు ఆగలేదు. పాలబుడ్డితీసి బిడ్డకిచ్చెను. ఏమియు లాభముండలేదు. తల్లి, తన వంటపని మానుకొని వచ్చి ఆ బిడ్డను తీసికొని రొమ్ము మీద పెట్టుకొని పాలుయిచ్చెను. వెంటనే ఏడుపు ఆగిపోయెను. ఆ బిడ్డ ఆటవస్తువులనుగాని, గిలకలనుగాని, పాలబుడ్డినిగాని లక్ష్యము చేయలేదు. వాడికి కావలసినది తల్లి. ఈ విధముగా నీతి కొరకు మనము ఆకలి దప్పులు కలిగినవారమైతేనే సంతృప్తి చెందుదుము.

హెబ్రీ. 5:12,13,14 బట్టిచూడగా అనేక మంది విశ్వాసులు ఏండ్ల కొలదిగా ఆత్మీయముగా పసిబిడ్డలైయున్నారు. అట్టివారిని నీవు కూడ చూడగలవు. ఇట్టివారు కష్టములు, శ్రమలు, బాధలు, దుఃఖములు వచ్చినప్పుడే ప్రార్థన చేయుదురు. అనేక పాఠశాల కళాశాల విద్యార్థులు కూడ ఇట్టివారే. పరీక్షలు జరుగునప్పుడు, "ఓ ప్రభువా నన్ను ప్యాసు చేయించు" ప్యాసు అయ్యానంటె నీకు ఐదు రూపాయలిస్తాను. ఫెయిల్ అయితే మట్టుకు రెండు నెలలు వరకు ఏ మీటింగునకును వెళ్ళను. ఏదో అవసరము వచ్చినప్పుడే ప్రార్థనలు ఇతరులు ఏ చిక్కులో నుండియో విడిపించుమనిగాని, లేక ఆరోగ్యము, లేక స్వస్థత, లేక మరి వేరేదానికొరకో ప్రార్థన చేయుదురు. దేవుడు ఏ నీతిని గూర్చి బోధించుచున్నాడో, దానికి ఆకలిదప్పులు కలవారు బహు కొదిద్దమందియే.

మన క్రైస్తవ జీవిత ప్రారంభములో ఏవేవో కోరుదుము; సూచనలు అద్భుతములు కావలెనని కొందరు. ఏదో ఒక దివ్య కాంతి నా గదిలో కనబడిన యెడల నేను చాలా ధన్యుడనగుదునని నేను తలచుచుంటిని. "ప్రభువా నా గదిలోనికి ఒక దివ్య వెలుగును పంపుము" అని ప్రార్థన చేసితిని. ప్రతిరాత్రి అట్టి వెలుగును చూచిన యెడల నాకు మరింత శక్తి కలుగునని నా భ్రమ. దానికొరకే గంటలకొలది ఇట్లు ప్రార్థన చేయుచుంటిని. ఒకరాత్రి ఇట్లు ప్రార్థించుచుండగా, మంద కాంతితో ఒక వెలుగు నా గదిలో పడెను. ఆ కాంతిని అధికము చేయుమని ప్రార్థించి కండ్లు తెరువగా ఆది ఎక్కువైనట్లె కనబడెను. "మరింత తేజోవంతముగా చేసి నా గదంతయు ప్రాకశించునట్లు గావించు ప్రభువా" యని తిరిగి ప్రార్థించితిని. కొంతసేపైన పిమ్మట నా కిటికీ తెరచితిని. నా గదిలో పడిన వెలుగు వెన్నెలగాని మరి ఏ యొక్క దివ్య వెలుగు కాదు.

దేవుడు నాకొక వరమిచ్చిన ఎడల ఎంత బాగుండునని కోరుచుంటిని. నేను పాటలు పాడలేనందున పాటలు పాడగలుగుటకు లేక

వాయించుటకు శక్తి ఇమ్మని తొమ్మిది సంవత్సరములు ప్రార్థన చేసితిని. వీణె వాయించగలిగి దేవుని కొరకు గొప్పపని చేయగలనని నా ఊహ. దేవుడైతే నా కేమియు నివ్వలేదు. వరముల విషయము నన్ను వట్టి శూన్యునిగా విడిచెను. నాదంతయు వెర్రితనమే. ఒక క్రొత్త కోరిక నాలో పుట్టగా, "ప్రభువా, నాకు నీవే కావలెను. నాకు ఏ వరములు వద్దు. అంతకంతకు నీవు నాకు ప్రశస్తమైన వాడవుగాను, వాస్తవమైన వాడవుగాను కావలెనని మాత్రమే ఎక్కువగా కోరుచున్నాను". ఆనాటి నుండి సంతృప్తి నాకు దొరికెను. "నీతి కొరకు ఆకలి దప్పులు గలవారు ధన్యులు; వారు తృప్తిపరచబడుదురు" అని లేఖనము చెప్పుచున్నది. తృప్తి నొందువారు ఇట్టివారే. అప్పుడు మన ప్రార్థన ఈ విధముగా నుండును. "ప్రభువా, నాకు వేరే కోరిక లేదు. ఇది అది నాకొసగుము అని అడుగుటకు నేను వచ్చియుండలేదు. నిత్యత్వమునకు నీతో నన్నుండనిమ్మని అడుగు చున్నాను గాని వేరే విషయము అడుగుటలేదు. నీ సాన్నిధ్యము యొక్క రుచి నేను అనుభవింపవలెను. నన్ను ఆవరించియున్న నీ హస్తముల స్పర్శ నాకు తోచనిమ్ము."

కొంత మందికి ప్రార్థన సులభముగా రాదు. మొదటిలో నాసంగతి కూడ ఇట్లేయుండెను. ప్రతి దినము గంటల కొలది బైబిలు చదువుదును. సినిమా మొదలైన లౌకికమైన వాటిమీద నాకుండిన సరదా దేవుడు తీసివేసెను. దానివలన ఇతర పుస్తకము లేమియు ముట్టక దినమంతయు బైబిలునే చదువుచుంటిని. ఇట్లు చదువుటలో పన్నెండు గంటలు గడిపినను నాకు పుట్టలేదు. అనుదినము కూటములకు వెళ్లుటకు ఎప్పుడు విసుగుకొనలేదు. అయితే ఐదునిమిషములు ప్రార్థన చేయుట గండముగా నుండెను. ఎంతగా ప్రయత్నించినను, కొద్ది నిమిషములు ప్రార్థన చేయునంతలో నా ఆలోచనలు ఎక్కడెక్కడో సంచరించును లేదా నిద్రపోవు చుంటిని. ఇట్లే రెండు సంవత్సరములకు పైగా గడచెను.

ప్రభువుకు స్తోత్రము, అటు తరువాత ఆయనతో సంభాషించుట ఎట్లో ఆయనే నాకు నేర్పెను. ఇంత ప్రశస్థమైన అనుభవము నాకు ఇంకొకటి ఉండలేదు. వేరే కోరికలన్నింటిని నా హృదయమునుండి ఆయన తీసివేసెను. ఆయనను సమీపించినప్పుడెల్ల "ప్రభువా డబ్బుగాని, జ్ఞానముగాని, మరింకేదిగాని అడుగుటకు నేను నీ దగ్గరకు వచ్చియుండలేదు. నన్ను ఎక్కడైనా నుంచుము. ఎక్కడికైనా పంపుము, అయితే నేను నీతో ఉండవలెను. నీతోనే; మరి ఎవరితోను కాదు, ఈ ఘనత ఈ అధిక్యత నాకిమ్ము" అని చెప్పుచుంటిని ఆదైవ సాన్నిధ్యమందు నీవు ఎప్పుడు ప్రవేశింతువో అప్పుడు వెంటనే ఆయాసము, భయము, చింత, సమస్తము ఎగిరిపోయెను. నీ భయము నీ కష్టము ఎట్టిదైనను యేసుక్రీస్తుకడకు పోయినప్పుడు అవన్నియు ఆయనతో చెప్పుకొనుము. నీ చింత నీకష్టదుఃఖములు నీవు తెలుపకముందే ఆయన ఎరుగును. మోకరించి "ప్రభువా ఈ సమయము నీతో గడుపుటకు వచ్చి యున్నాను. నీ సన్నిధిలో నన్ను ఆనందింపనిమ్ము." అనుము. నీ కష్టములన్నియు మాయమై పోవును. నీకెంతో హాయిగా నుండును. ఆశీర్వదింపబడిన వానిగా, మోకాళ్ళ మీదనుండి లేతువు.

## నీ మందిరముయొక్క సమృద్ధివలన వారు సంతృప్తి నొందుచున్నారు

మరొక ప్రాముఖ్యమైన నియమమును చూతము. ఇట్టి ఆకలి దప్పులు దేనివలన తృప్తిపరచబడును? దీనికి జవాబు, కీర్తన 36:8లో ఇవ్వబడియున్నది " నీ మందిరము యొక్క సమృద్ధి వలన వారు సంతృప్తి నొందుచున్నారు. దేవుని మందిరము అనగా ఇటుకలతోనో, రాళ్ళతోనో కట్టబడిన ఒక భవనము కాదని ఇదివరకే చెప్పియుంటిమి. చేతులతో నిర్మింపబడిన కట్టడము ఏదియు దేవుని యొక్క

ఆత్మీయమందిరకు కాజాలదు. 1. పేతురు 2:5ను బట్టి చూడగా, మనమే దేవుని మందిరమగుటకు సజీవమైన రాళ్ళవలె నున్నాము.

తిరిగి జన్మించుటనుబట్టి సజీవమైన రాళ్ళు అగుచున్నాము. నేను పాలస్తీనా దర్శించినప్పుడు సమాజమందిరము అనబడిన ఒక పురాతన కట్టడము యూదులచే నిర్మింపబడిన దానిలో బండలవంటి పెద్ద రాళ్ళను చూచితిని. ఇది బహురమ్యమైన మందిరము. ఒక చిన్న రాయితీసికొని, గోడలోని ఈ బ్రహ్మాండమైన రాళ్ళలో నొకదానిని కొట్టిన ఎడల మధురమైన స్వరము వచ్చును. ఒక హార్మోనియంలో వలె ఒక్కొక్క రాతికి ప్రత్యేకమైన స్వరమొకటి కలదు. ఈ రాళ్ళ ఎట్లు కోసి తయారు చేసియుండిరో ఈ నాటికిని ఎవరు కనిపెట్టలేదు. ఎంతో దూరము నుండి ఈ రాళ్ళను చూచుటకు జనులు వత్తురు. అమధుర స్వరములు వినుటకై వాటిని తట్టుదురు. ఈరీతిగానే, నీవు తిరిగి జన్మించినప్పుడు ప్రభువైన యేసుక్రీస్తుయొక్క సజీవమైన రాయిగా నగుదువు. పరలోక సంగీతము నీలోనుండును. ప్రజలు మనలను శపింపనిమ్ము, కొట్టనిమ్ము, అయినప్పటికిని వారితో "ప్రభువునిన్ను దీవించుగాక, ఇంతకంటె సంతోషింపజేయుగాక, నిన్ను క్షమించుగాక," అని ఇట్లు చెప్పగలము. జనము అతనిమీద రాళ్ళురువ్వి చావగొట్టుచుండగా "ప్రభువా, వారిమీద ఈ పాపము మోపకుము", అని సైఫను ప్రార్థనచేసెను. దాని అర్థమేమనగా "ప్రభువా! వారిని క్షమించుము." పరలోక సంగీతము అతనికి దేవుడిచ్చెను. ఇటువంటి సజీవమైన రాళ్ళ నన్నింటిని కలిసినప్పుడు దేవుని మందిరము కట్టబడు చున్నది, ఇట్టి నిజమైన విశ్వాసుల మధ్య మనము చేరినప్పుడు సమృద్ధిగా సంతృప్తి నొందుదుము.

నేను క్రైస్తవుడనైన పిమ్మట హృదయమందు గల ఆకలి వలన వేరు వేరు స్థలములకు తిరుగుచు వేరు వేరు నీ దేవాలయములకు వెళ్ళుచుంటిని. మహా గొప్ప గుడి ఏదైన కనబడి నప్పుడు మనస్సులో

"అక్కడ వెళ్ళితే తృప్తి పడుదును" అను కొనుచుంటిని. మందిర కట్టడము ఎంత పెద్దదైనను, అక్కడి బోధకులు ఎంత గొప్ప యోగ్యతా పత్రములు పొందియుండినను, అక్కడ ఎంతగంభీరమైన వాయిద్యములు ఉండినను, నా ఆకలి తీరకయే ఆకట్టుబడమును విడిచి వచ్చుచుంటిని. రెండు సంవత్సరములు ఇట్లుగడచెను. ఒకనాటి ఉదయము వాన్కోవర్ నగర వీధులలో షికారుకు వెళ్ళితిని. అక్కడ చిన్న కుటీరము కనపడెను. సాధారణముగా క్రైస్తవ ఆరాధన జరుగు స్థలములు పెద్ద పెద్ద రాతి భవనములు. ఇది ఒక చిన్న కుటీరము. "ఈ ఆదివారము ఆరాధనకు ఇక్కడికిపోదాము" అని తలచి లోపల ప్రవేశించితిని. ముఖము కాంతితో ప్రకాశించుచున్న ఒకరు వచ్చి నాకు నమస్తే చెప్పెను. మిమ్మును చూచుట నాకెంతో సంతోషము అనుచు నా పేరేమని కూడా విచారించక, లోపలికి రమ్మనుచు "ఇక్కడ కొందరే విశ్వాసులు కూడుకొందురుగాని, వారందరును ప్రభువును ప్రేమించువారే' అనెను. ప్రతివారి దగ్గర బైబిలుండెను. ఈ చిన్న కుటీరమందు నేనేంతో సంతోషముగా నుంటిని. నిజమైన విశ్వాసుల మధ్యనే దేవుని సాన్నిధ్యము అనుభవించగలము, అయితే దుఃఖకరమైన విషయమేమనగా అనేక పట్టణములందు విశ్వాసులకు నిజమైన సహవాసము దొరుకునట్టి స్థలములే లేవు. ప్రజలు తృప్తిపొందకుండుటకు ఇదే కారణము. మన ఆకలి ఎప్పుడు ధారాళముగా తీర్చబడుననగా దేవుని మందిరముయొక్క పరలోక మర్మమును గ్రహించి, దేవుని బిడ్డలతో కూడుకొని దేవుని సత్యముతోను, ఆత్మతోను ఆరాధించినప్పుడే, అయ్యో అనేకమంది విశ్వాసులకు దేవుని నిజమైన మందిరమనగా ఏమో తెలియకున్నది. వారు ఒక కట్టడమును (చర్చ్) సంఘమని పిలుచుచున్నారు. ఇది సెయింట్ జాన్స్‌చర్చ్. ఇది సెయింట్ లూక్స్‌చర్చ్ అని ఈ విధముగా చెప్పుచున్నారు ఆ కట్టడము ఒక చర్చ్ (సంఘము) కానేరదు.

విశ్వాసులమైన మనము కూడినప్పుడు మనమే సంఘమగుచున్నాము. దేవుని మందిరమందు దొరుకునట్టి సారంలో మనయొక్క నిండుభాగము మనము తీసికొని నప్పుడే మన ఆకలి దప్పులు సంపూర్ణముగా తీరును. ప్రభువును ఆరాధించుచు, చూచుచు ఆయనను భుజించుచుండగా ఆయన యొక్క సాన్నిధ్యము అంతకంతకు అధికముగా మనకు గ్రాహ్యమగును. అప్పుడేమనము ఈ లోకమునకు మేలైన ఉప్పు యొక్క రుచిని ఇవ్వగలము.

✤ ✤ ✤ ✤ ✤

# 7

# ఉప్పును శుభ్రపరచుట - 2:

## కరుణ, పవిత్రత, శాంతి.

### ఉప్పుయొక్క రమ్యత - దైవప్రేమ

మీరు ఇంకే వర్తమానమును మరచిపోయినను, ఇది మాత్రము మరువకుడి "మీరు లోకమునకు ఉప్పయి యున్నారు" మత్తయి 5:13 "ప్రభువా, నన్ను మేలైన ఉప్పుగా చేయుము"అనుచు అనుదినము విశ్వాసముతో ప్రార్థించుచుండుము. "నేనెచ్చటినుండి సేవ చేసినను; నాద్వారా నీయొక్క ప్రేమ, కృప, కనికరము ఇతరులు రుచి చూచినట్లు నీ ప్రేమ, కృపలను నా కిమ్ము. నా మాటల ద్వారా, క్రియల ద్వారా, ఇతరులు బలపడి, ఆదరణపొంది సంతోషించురుగాక: నా శత్రువులు సహా నా వలన ఆదరణపొంది సంతోషింతురుగాక: అంధకారమందుండు వారికి వెలుగుకలుగునుగాక; పడిపోయినవారు పైకెత్తబడుదురుగాక; దుఃఖించు చున్నవారి కన్నీళ్ళు తుడిచి వేయబడునుగాక," యని వేడుము. ఉప్పువలె పనిచేయుట ఎంతో అధిక్యత. దయారసముతో చేయు ఒక్క క్రియ, సమయోచితముగా పలుకు కొన్ని మాటలు ఇతరులకు ఆదరణ కలిగించును.

ఐదవ జార్జీ చక్రవర్తిని గూర్చి ఒక కథ చెప్పుకొందురు. ఆయన తల్లి మరణించగా ఆయనను పరామర్శించుటకై తన మంత్రులు వచ్చిరి. రమ్యమైన పదములు, వాక్యములు అనేకములను ఉపయోగించి "సార్వభౌమా, ఈ దుఃఖకరమైన వార్తను విని శోకించుచున్నాము" అనుచు ఒకరివెనుక నొకరువచ్చి పలికిరి. తుట్టతుదకు, మంత్రులలో

నొకడగు లాయిడ్ జార్జ్ వచ్చి రాజుగారిని సమీపించెను. అప్పుడు అతని రాజు కండ్లనుండి నీరు కారెను. అటువెనుక వారందరు కలిసికొనినప్పుడు ఇతర మంత్రులు లాయిడ్ జార్జ్‌తో ఇట్లనిరి: "రాజు గారితో యేమంటివి? నీ మాటల వలన ఆయనకు కొంత మనశ్శాంతి కలిగి నట్లున్నది. మేమెంతో పరామర్శింప చూచితిమి గాని మేము పలికిన మంచి మంచి మాటలు యేమియు పనిచేయలేదు. ఆ ముఖమందు మార్పు లేకుండెను మాకేమియు చెప్పకుండెను. నీవు వెళ్ళగా నీ చేతిని పట్టుకొనెను, కన్నీరు విడిచెను." "నేనేమియు చేయలేదు, ఊరకనే ఆయన ముఖములో చూచుచు, చేతిని పట్టుకొంటిని. ఆయన ఏడ్చెను. నా చేతి పట్టువలన ఆయన కొరకు నేను దుఃఖించుచున్న విషయము రాజు గ్రహించెను," అని లాయిడ్ జార్జ్ ప్రత్యుత్తరమిచ్చెను. ఇతరుల చక్కని మాటలన్నియు వారి బుర్రలోనుండి వచ్చినవేగాని, హృదయము నుండి కాదు. కొన్ని సమయములందు మాటలు చెప్పకపోయినను, నిజమైన ఉప్పుగా నుండగలవు. నీవు తాకుటతోనే ఇతరులకు ఓదార్పు కలుగును. దుఃఖించుచున్న ఒక హృదయము నుండి నొప్పి బాధ, దయాపూర్వకమైన ఒక్క తాకుడుతో తొలిగిపోగలవు. విరిగిన హృదయములు లోకమంతటా నున్నవి. మనము ఒకరి హృదయముతో నింకొకరు చూడగలిగితే, ప్రతి వారము ఎన్నెన్ని గాయాలు కలిగియున్నామో తెలిసికొందుము. నవ్వు ముఖములు కలిగి సంతోషముగా కనబడుటవలన లోపలి సంగతిని ఇతరులు కనుగొనజాలరు. ఏ గుగ్గిలము తైలముగాని, వైద్యుడుగాని మాన్పలేనట్టి ఏదో ఒక బాధగల గాయము ప్రతి యొక్కరి హృదయమందు నున్నదనియే నేను అనుకొనుచున్నాను దైవ ప్రేమ, సానుభూతి మాత్రమే దానిని మార్చగలుగును. మనము ఎచ్చట నుండినను మనము ఎవరితో కలియుదుమో వారు మనవలన మేలు పొందవలెనను

ఈ సంల్పమును నెరవేర్చు నిమిత్తమే మన సజీవ రక్షకుడు మనలను లోకమునకు ఉప్పయి యుండునట్లు సిద్ధపరచుచున్నాడు.

## దైవ ప్రేమ మనలను కరుణించువారిగాను, క్షమించువారినిగాను చేయును

లోకమునకు ఉప్పయి యుండజేయు నిమిత్తము మనలను శుభ్రపరచునట్టి కార్యమందు పది పద్ధతులు జరుపవలసి యున్నవని 3 నుండి 10 వరకు నుండు వచనములలో ప్రభువు ఎట్లు ప్రత్యక్షపరచుచున్నాడో ఇదివరలో చెప్పితిని.

ఇప్పుడు 7వ వచనముచూతము. "కనికరముగలవారు ధన్యులు.' ' నిజమైన విశ్వాసులు మాత్రమే నిజముగా కనికరించి దయచూపువారైనందున ఈవాక్యము విశ్వాసులకే ముఖ్యముగా చెప్పబడెనని నా నమ్మకము ఎవరికైనను, ఎచ్చటనైనను, ఏ వేళయుందైనను ఇట్టివారే కనికరించువారు ప్రేమకు ఏ మాత్రమును పాత్రులు కానివారిని సహితము కరుణించుటకు మనలో దైవప్రేమ ఉండిన ఎడలనే సాధ్యపడును. మనలో దైవప్రేమ లేనిదే మనమెంత ప్రయత్నించినను ఇది సాధించలేము. అందువలననే, పరిశుద్ధాత్మచే దైవ ప్రేమ మనహృదయములందు వెదజల్లబడుట అవశ్యమాయెను. మానవ ప్రయాసమువలన, మానవ యత్నము వలన ఈ ప్రేమ ఉద్భవించదు. పరిశుద్ధాత్ముడే దానిని మన హృదయములందు పోయవలెను. అట్లయితేనే ఇతరులకు సహాయము చేయుబుద్ధి మనలో సహజముగా పుట్టి అట్లు చేయుటవలన మనకెంతో సంతోషమును కలిగించును దైవప్రేమ ద్వారానే ఇతరులను క్షమించుట మనకు సులభమగును. నరులమైనందున మన హృదయములు తరచుగా

కఠినముండును. కఠిన హృదయులగు క్రైస్తవులు అనేకులున్నారు. వారు ఏ ప్రేమ కనబరచినను హృదయమునుండి కాదు, నోటితోమాత్రమే.

కొన్ని ఏండ్ల క్రితము ఒకరు వచ్చి తన భార్య, కుమార్తె కొరకు నన్ను ప్రార్థించమని అడిగెను. తన రైల్వే ఉద్యోగమును బట్టి పని మీద తాను ఉండగా, తన ఇంటినుండి ఈ ఇరువురు పారిపోయిరట. 'అన్నా! దయచూపి నా కొరకు ప్రార్థించండి" అని కన్నీళ్ళతో అతడువేడెను. నేను ప్రార్థన చేసితిని. అతడు వెళ్ళిపోయెను. కొంత సేపటికి నాహృదయము నన్ను ఖండించెను. అప్పుడు నాలో ఇట్లు తలచితిని. "అతడు దుఃఖములో మునిగి కన్నీళ్ళతో నా దగ్గరకువచ్చెను. నిజముగా భారముతో అతని కొరకు నేను ప్రార్థన చేసితినని సత్యముగా చెప్పలేను. మా అమ్మ ఆ విధముగా వెళ్ళిపోయి యుంటె, నా కేలాగుండును? నాకు ఏడ్పురాకుండునా;" అప్పుడు నేను "దేవానన్ను క్షమించి, మెత్తని మృదువైన హృదయం నాకిమ్ము, ప్రార్థన చేయుటకు ఒక నూతన భారము నాకిమ్ము" అని అంటిని. అతను కలిగి యున్నటు వంటి బాధను నేనును పొందువరకు రెండు గంటలకంటె ఎక్కువగా ఈ రీతిగా ప్రార్థన చేసితిని -"కనికరము అక్కరలోనున్న అతని మీద చూపి అతని భార్యను, కుమార్తెను తిరిగి ఇంటికి రప్పించుము"మరునాటి ఉదయమున ఎవరో ఇద్దరుస్త్రీలు నన్ను చూడవచ్చియుండిరని నాకు కబురు వచ్చెను. వారిని చూడ వెళ్ళితిని వారు అదే వ్యక్తియొక్క భార్య, కుమార్తె, వారు నన్ను చూడగానే ఏడ్చుచు "అన్నా, మా కొరకు ప్రార్థించండి, సాతానుచే మోసగించబడి ఇల్లు విడిచి వెళ్ళిపోతిమి మాకు క్షమాపణ కావలెను" అనిరి. ఆ రైల్వే మనుష్యుడు అంతకముందే నాదగ్గరకు వచ్చియుండెనను సంగతి వారికి తెలియనే తెలియదు. ఆ స్త్రీలు తిరిగి వెళ్ళగా అతనికి ఎంతో ఆదరణ కలిగెను. నేనుకూడ సంతోషించితిని. దుఃఖబాధలలో

నున్న వారి కొరకు నిజముగా కనికరము గలవారమైతే, నిజమైన కనికరము చూప గలుగుదుము.

ఇతరులు మనలను క్షమాపణ కోరగా క్రీస్తు నామమున వారికి కరుణ చూపుటకు మనకు అవకాశము దొరుకుచున్నది (మత్తయి 18:35) నా స్వంత అనుభవములో ఇది తెలిసికొని యున్నాను. ఏమనగా దేవుని వాక్యము వారిని తాకినప్పుడు అనేకులు తాము ఎవరిని నొప్పించిరో వారి కడకు పోయి క్షమాపణ కోరియున్నారు. అయితే అవతలివారు ఒకప్పుడు ఇట్లు చెప్పుట కద్దు. "సరే నిన్ను క్షమింతును. అయితే నీతో నేను మాట్లాడను; నిన్ను క్షమించుతనుగాని, మా ఇంటిలో మట్టుకు తిరిగి దయచేసి అడుగు పెట్టవద్దు." ఇది క్షమాపణేనా! వారు నీకు విరోధముగా అనేక మారులు పాపము చేసియుండినను, నీవు వారిని మనసారా క్షమించవలెను. మత్తయి 18:21-22 చూడుము. కఠిన హృదయుడవగు క్రైస్తవుడవు కాక కరుణ చూపుము. ప్రభువు నిన్ను క్షమించిన రీతిగా దయతోను, కనికరముతోను క్షమించుము. కొలొస్సై 3:13-15 చూడుము. కరుణ చూపగోరిన వాడవైతే, నిన్ను క్షమాపణ కోరువారు నీ దగ్గరకు డెబ్బదియేడు మారులు వచ్చినను సరే, వారిని మనస్పూరా క్షమించుము. స్వాభావికముగా మనము కఠిన హృదయులమై నందున "ఓ ప్రభువా, మా హృదయములు మృదువై, దయా కనికరములుగలవై యుండునట్లు చేయుము" అని మరల ప్రార్థించుచునే యుండవలెను.

మా తండ్రికి ఒక బద్ధ శత్రువు ఉండెను. ఇతని వలన మా నాయన కచ్చేరి ఎక్కి ఏడు సంవత్సరములకు పైగా వాజ్యములో దిగి ఎంతో నష్టము పొందెను. ఒకనాడు మా స్వగ్రామములో ఆ మనుష్యుడు బజారుకు వెళ్ళుచుండగా చూచి, అతని వెనుక వెళ్ళి అతని భుజము మీద చేయి వేసితిని. అతడు వెనుకకు తిరిగి నన్ను చూచి, "నన్ను

గుర్తుపట్టగలిగితివా? యని అడిగెను. గుర్తించకేమి? మీరు ఫలానావారు కదా?" అంటిని. విస్మయము చెంది, "మీ కుటుంబములో ఎవరును నా వైపుకు చూడరు. నేను కనబడితే నన్ను శపించడమే. నీవు నాతో మాట్లాడుచున్నావే, అది ఏలాగు?" అనెను. సంగతులన్ని మా వాళ్ళు నాకు వ్రాసిరి. మా తండ్రికిని మా కుటుంబానికిని మీరు ఎంత కీడుచేసితిరో ఎరుగుదును. క్రీస్తును కలిగయుండకుండా నేను ఇక్కడికి వచ్చియుంటే మీమీద కట్టెలు విసరి రాళ్ళు రువ్వేవాడను. అయితే ఇప్పుడు మిమ్మును ప్రేమిస్తున్నాను. మీ గురించి విన్నప్పుడు మీ కొరకు ప్రార్థన చేయనారంభించితిని. నేను మహా పాపిగా నుంటినిగాని, ప్రభువు నన్ను క్షమించినాడు. మీరు మా కుటుంబానికి బద్ధ శత్రువని నాకు తెలియును. ప్రభువు నా పాపములను క్షమించినందుకు, నేను మిమ్మును క్షమిస్తున్నాను. మీకొరకు ప్రార్థన చేయమని ప్రభువు నాతో చెప్పుచున్నాడు" అని సమాధానమిచ్చితిని. ఒక బిడ్డవలె ఏడ్వ మొదలు పెట్టి, "ఇటువంటి ప్రేమ లోకములో ఉన్నదని నా కెన్నడు తెలిసి యుండలేదు" అని అతడు చెప్పెను. అటువంటి ప్రేమ మన హృదయములలో పెట్టు శక్తి గలవాడు ప్రభువైన యేసుక్రీస్తే, ప్రభువుకు స్తోత్రము. ఉప్పు మన బంధు మిత్రాదులకేగాక, మన శత్రువులకు కూడా ఒక ఆశీర్వాదముగా నున్నది. రోమా 12:20, 21 చూడుము. "కనికరము గలవారు ధన్యులు, వారు కనికరము పొందుదురు." మనము ఇవ్వగల ప్రేమకంటే దేవుని వలన మనము పొందు ప్రేమ విస్తారమైనది.

## ఉప్పువలన కలుగునది - పవిత్రత, దేవుని దర్శనము

"హృదయ శుద్ధిగలవారు ధన్యులు. వారు దేవుని చూచెదరు" (మత్తయి 5:8). మేము వీధులలో ప్రసంగము చేయునప్పుడు కొందరు తరుచుగా మమ్మును హాస్యము చేయుచు "మాకు దేవుని చూడాలని ఉన్నది. మీ దేవుని చూపితే నమ్ముతాము" అందురు. దేవుని

చూడగలుగుటకు ఒక శుద్ధ హృదయము తప్పక ముందుగా కావలసియున్నదని వారు గ్రహించరు. నేను మారు మనస్సు పొందుటకు పూర్వము, అనేక సంవత్సరముల క్రిందట దేవుడు చాలాచాలా దూరమున నుండెననియు, ఆయనను సమీపించుట ఎవనికైనను దుర్లభమనియు, నేను తలచెడి వాడను. బైబిలు ఏమనుచున్నది; "హృదయ శుద్ధి గలవారు ధన్యులు; వారు దేవుని చూచెదరు." వారు ఆయనను ఒక నిమిషము కాదు, క్షణ మాత్రమునకుకాదు, ఒక ఘడియకే కాదు, నిత్యత్వమువరకు చూచెదరు. ఆయన యొక్క సంపూర్ణ మహిమలో ఆయనను గాంచెదరు. ఆయన యొక్క సంపూర్ణ మహిమలో గాంచెదరు. ఆయనకు అతి సమీపముగా నుండెదరు. దేవుని వాక్యము ప్రకారము మనకు గల హృదయము చెడ్డది. మోసముతోను, చెడుగుతోను నిండిన హృదయము. దానిని వాక్యము ఇట్లు వివరించుచున్నది. హృదయము అన్నిటికంటె మోసకరమైనది. అది ఘోరమైన వ్యాధి కలది. దాని గ్రహింపగల వాడెవడు?" (యిర్మీయా 17:9) అట్లైతే, హృదయశుద్ధి మనమెట్లు పొందగలము.

## పవిత్ర హృదయము పొందు విధము

అనేకులు తమ్మును తాము బాధించుకొనుటవలన లేక కన్నీరు విడుచుట ద్వారా, లేదా ఇంకేదో సాధనమువలన శుద్ధులు కాగలరని భావింతురు. ఏకాంతముగా నివసించి స్త్రీ పురుషుల నెవరిని చూడక ఫలములనే భక్షించి నీళ్ళు మాత్రమే పానము చేసిన ఎడల పవిత్రుడు కాగలనని ఒకడు భావించెను. ఇతడు ఆఫ్రికాలో చీకటియైన కొండ గుహలో ప్రవేశించి ఏడు సంవత్సరములు నివసించెను. అటు పిమ్మట వెలుపలికిరాగా, "ఎంత మట్టుకు శుద్ధిపొందితివి" యని స్నేహితులు అడిగిరి. "మునుపటికంటె నేను ఇప్పుడు అశుద్ధముగా ఉన్నాను" అని అతడు చెప్పెను. అతని మనస్సు పూర్వముకంటే కూడ చెడి

మలినమైయుండెను. ఆరీతిగా మానవ యత్నములవలన నీవు పవిత్రుడవు కానేరవు.

1 యోహాను 1:7లో దేవుని వాక్యము తెలుపునది ఏమనగా, యేసు క్రీస్తుయొక్క రక్తము మనలను పవిత్రులనుగా చేయుచునే యుండును. దానికిట్లు అర్థము చెప్పవచ్చును; మన కన్ను ఏ విధముగా చేయబడి యున్నదనగా ధూళిగాని, ఏదైనా ఒక అతి సూక్ష్మమైన నలుసైనను కంటిలోపడగా, కన్ను రెప్పలు కొట్టుకొనుటయు, నీళ్ళు కారుటయు ప్రారంభించి, ఆ నలుసు తొలిగిపోవువరకు అట్లే జరుగును. ఈ విధముగా కంటి గ్రుడ్డు శుభ్రముగా నుంచబడును. ఈ విధముగానే యేసు రక్తము మనలను సదా కడుగుచుండును. ఎల్లప్పుడు ఏదో ఒక చెడుతలంపు మీ హృదయమందు ప్రవేశింప చూచుచుండును. యేసు క్రీస్తుప్రభువు రక్తమువలననే తప్ప ఇట్టి తలంపులు మనలను వదలవు. మనము విశ్వాసముతో ఎప్పుడైతే, "ఓ ప్రభువా, నన్ను శుద్ధికరించుము" అని యడుగుదుమో వెంటనే కడుగబడుచున్నాము. "నా కిప్పుడు సమయము లేదు. రేపు వచ్చి కడుగుదును" అని ఎన్నడును ప్రభువు చెప్పడు. ఆయన ఇట్లనుచున్నాడు -"నాకు మొర పెట్టుము; ప్రత్యుత్తర మిత్తును.' ' మనము శుద్ధీకరింపబడితిమని ఏ రీతిని తెలసికొనగలము? దేవుని చూడ గలుగుట ద్వారానే యోహాను 4:24లో చెప్పబడినట్లు "దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెను;" మనము, ఆత్మలో కడుగ బడిన వారమైనచో దేవుతని తెలసి కొందుము, మరియు ఆయనను చూతుము, ఆయనతో నుందుము.

ప్రతి మనుష్యునిలో మూడు భాగములన్నవి. శరీరము, ప్రాణము, ఆత్మ, శరీరమనగానేమి అది ఎముకలు, రక్తమాంసములతో చేయబడి యున్నది. ప్రాణమువలన ఏమి జరుగుచున్నది. ఆలోచించుట, ప్రేమించుట, తీర్మానములు చేయుట. ఆత్మద్వారా దేవుని తెలిసికొన

గలిగి, ఆయనను ఆరాధించి, ఆయన చిత్తము చేయగలుగుచున్నాము. పాపియొక్క ఆత్మ మరణించి యున్నది. అతని ప్రాణము అంధకారములో నున్నది. అతని శరీరము మలినమైయున్నది. దేవుడు ఆత్మయై యున్నందున నా ఆత్మలోనే ప్రవేశింపగలడు. కాని, నా శరీరమందు లేక ప్రాణమందు ప్రవేశింపలేడు. ఆయన నాలో ప్రవేశింపగా మరణించియున్న ఆత్మ జీవము పొందును. దేవుడు పరిశుద్ధుడు, కావున మనలో ఆయన ప్రవేశించుటకు ముందుగా, మనలను శుద్ధిచేయవలెను ఇది ఆయన తన రక్తము ద్వారా చేయును. తన రక్తముతో నా మనస్సాక్షిని కడిగి, అటు తరువాత నా ఆత్మలో ప్రవేశించును. ఇదే నూతన జన్మము" అప్పటినుండియు ఎల్లప్పుడు నన్ను కడుగుచునే యుండును. మనము తిరిగి జన్మించగా మన ఆత్మ జీవము పొందుచున్నది. శరీర ప్రాణములు పవిత్రత చెందుచున్నవి. ఆత్మరూపమున దేవుడు మన ఆత్మలో నివసించు చున్నందున మన ఆత్మద్వారా ఆయనను తెలిసికొందుము మరియు స్పర్శింతుము. మనము ప్రార్థనద్వారా ఆయన యొద్దకు చేరి, "ప్రభువా, నిన్ను చూచుటకు, నీతో మాట్లాడుటకును, కొంత సమయము నీతో గడుపుటకు వచ్చియున్నాను," అని చెప్పినచో, ఆయన "రమ్ము బిడ్డా, నిన్ను చూచి సంతోషించుచున్నాను, నీ భారమేమి? నీ ప్రశ్నఏమి? నిరాటంకముగా చెప్పుము" అని ప్రత్యుత్తర మిచ్చును. మరియు దేవుడు "బిడ్డా, నీతో మాట్లాడనిమ్ము, నీకు ఒకటి ఇవ్వనిమ్ము నీకు కొంత చూపనిమ్ము" అనును. మనము పవిత్రులముగా నుంటిమేని, ఆత్మతో సర్వదా ఆయనను చూడగలము. ఎల్లప్పుడు ఈ భావమును అనుభవింప కోరిన ఎడల విశ్వాసముద్వారా ఆయన ప్రశస్తరక్తముతో సదా కడుగ బడుచుండవలెను. ఈ విధముగా ప్రార్థింపవచ్చును - "యేసు ప్రభువా, నా కోపపు మాటలవలన నా చెడ్డ తలంపువలన, నేను మలినమైయున్నాను. నీ ప్రశస్తరక్తముతో నా తలంపులను కడుగవా;" అప్పుడు ఆయన "బిడ్డా,

అట్లేకానిమ్ము, నిన్ను క్షమించి, కడుగుదును. నీవు వెళ్ళి ఇకను పాపము చేయకుము" అనును. నీకు పరలోక ఆనందమిచ్చును నీవు సదా ఆయనతో మాట్లాడు చుందువు. అప్పుడు ఈ మాటలు నెరవేరును - "హృదయ శుద్ధిగలవారు ధన్యులు; వారు దేవుని చూచెదరు." ఎడతెగని సహవాసము ఆయనతో కలిగియుందువు. నీ అనుభవము ద్వారా అనేకులు దేవుని యొద్దకు వచ్చుటకు ప్రోత్సహింపబడుదురు.

### ఉప్పుచేయు కార్యము - సమాధాన పరచుట; దైవ పుత్రత్వము నిచ్చుట

మత్తయి 5:8లో, "సమాధాన పరచువారు ధన్యులు; వారు దేవుని కుమారులనబడుదురు" అని వ్రాయబడి యున్నది. స్వాభావికముగా మనమందరము దేవుని శత్రువులమే. మనము తిరిగి జన్మించినప్పుడు దేవుని బిడ్డలమైతిమి. లోకస్థులు దేవునికి, మనకు కూడా శత్రువులై యున్నారు. మనము బాధించి, గాయపరచి, మనకు కీడు చేయుదురు. ... మాటలతో తలంపులతో, క్రియలతో దేవుని సదా న్యాయమైయున్నది. నీవు తిరిగి జన్మించగా సమాధాన పరచువాడవగుదువు. నీ ద్వారా దేవుని శత్రువుల ఆయన మిత్రులగుదురు. దేవుని బిడ్డ వైనందువలన ఈ పరిచర్య నీ కొరకు అధికృతగా ఇవ్వబడి యున్నది.

దేవుడు తన సేవకు నన్ను పిలిచినప్పుడు, ఒక నెపము తరువాత నింకొకటి తెచ్చుచుంటిని. నా ఉద్యోగము ద్వారా, డబ్బు ద్వారా, ఆయనను సేవింపగలను అంటూ రెండేండ్ల పర్యంతము ఇట్లే పోరాడుచుంటిని. 1932 జనవరి మాసములో ఒకానొక ఆదివారము ఉదయమున ఫ్లిన్ అనబడిన ఒకని ద్వారా దేవుడు నాతో బహుస్పష్టముగా మాట్లాడెను. నా చేతిని పట్టుకొని ఆ ఉదయమున అతడు, 'ఇండియాకు పోయి అక్కడ సువార్త బోధించకూడదా? అని అడిగెను. "ఫ్లిన్‌గారు, చదువుచూ

తర్ఫీదు పొందడానికి ఎంతో డబ్బు ఖర్చు పెట్టితిని. ఇంజనీరైనవాడు బోధకుడు అవడము ఎలాగు? అంతేకాదు, నాకు చాలా నత్తి ఉన్నది. నోటిలో నుండి మాటపైకి రావడము ఒక గండము. నా వంటివాడేమిటి బోధించడమేమిటి? ఇక సంగీతమైతే ఒక్క స్వరమురాదు. అని ప్రత్యుత్తరమిచ్చితిని. అక్కడ సువార్త బోధించకూడదా?" అప్పుడు దేవునితో "నా డబ్బంతా నీకే ఇస్తానని ప్రమాణము చేస్తున్నాను. నేను ఉపయోగించుకోడానికి గాని, నా సదుపాయాలకు గాని ఆ డబ్బు నాకు వద్దు. నీవే అంతా తీసికో. నన్ను బోధకునిగా మాత్రము చేయవద్దని నిన్ను బ్రతిమాలుకొనుచునా ను. నేను బోధలు చేయలేను" అంటిని. 'నీ డబ్బు నాకవసరములేదు; ప్రభువుతో నేను డబ్బు సంపాదించి, జీతమిచ్చి ఎవరైతే పాడగలిగి, సాక్ష్యమిచ్చి బోధించగలరో అలాంటి బోధకులను చాలా మందిని పెట్టిస్తాను. నాకంటె వారే మంచి పని చేయగలరు. నేను ఇంజనీరుగా వుంటే, బాగా డబ్బు గడించి అదంతా నీ సేవకు ఇవ్వగలను' అని వాదించితిని. దేవుడింకను కావాలి; ఇండియాకు పోయి సువార్త ఎందుకుబోధించ కూడదు?' అనెను. చిట్టచివరకు 1932 ఏప్రిల్ మాసమందు ఆయనకు లోబడితిని. దేవునికి స్తోత్రము. ' ఈ దినము నా జీవితము నీకు సమర్పించు కొనుచున్నాను. నా కేదీ దాచుకొనక అంతా నీకే ఇచ్చివేస్తాను. ఎక్కడికైన పంపించు, ఎంత కాలమైనా ఉంచు ప్రభువా, నన్ను నీకు సమర్పించు కొనుచున్నాను,' అని చెప్పితిని. అప్పుడు ప్రభువు నేను నిన్ను అంగీకరించుటకు మూడు షరతులు నీవు నెరవేర్చవలెను. నీ ఆస్తిపై నీకున్న హక్కును వదులుకొనవలెను. మరియు ఉత్తరముల ద్వారా గాని సూచించుట ద్వారా గాని, మరి ఇంకేవిధముగానైనను, నీ భౌతిక అక్కరలను ఏ నరునికి తెలియజేయగూడదు. నీవు తెలియజేయవలసినది నాకు మాత్రమే. ఇది

మొదటిది. రెండవదిగా ఏ సంస్థలోగాని, మిషనులోగాని, చేరవద్దు. నీ సేవ అన్నింటికిని సమముగానిమ్ము: మూడవదిగా నీ స్వంత ఏర్పాట్లు చేయవద్దు. ఏ దినమునకు ఆ దినం నేను నిన్ను నడుపనిమ్ము.' అని ప్రత్యుత్తర మిచ్చెను. 'నేను అంగీకరించు చున్నాను. ప్రభువా' అని జవాబిచ్చితిని ఈ విధమైన ఒప్పందము కెనడాలోని వాన్కోవర్ నగరమందు, 1932 ఏప్రిల్ 14, రాత్రి రెండున్నర గంటలకు జరిగెను. గత 41 సంవత్సరములు నాకెంతో ఆనందకరమైనవి ఇండియా, పాకిస్తాన్, సిలోన్ మరియు ఇతర దేశములలోకూడ ధనవంతులలో నేమి గొప్పవారిలోనేమి, తక్కువవారిలో నేమి, దేవుని శత్రువులు ఆయన మిత్రులుగా మారుట చూచియున్నాను. మనద్వారా ఇతరులు ప్రభు పాదములయొద్దకు వచ్చి పరలోక ఆనందము పొందుట వలన మనకు కలుగు సంతోషము లోకమును మించిన సంతోషము లోకములో వేరొకటి లేదు. ఈ విధముగా మనము సమాధానపరచు వారముగా అగుదుము మరియు దేవుని పిల్లలమని పిలువబడుదుము.

## దేవుని పిలుపు - ఆయనకు లోబడుము

"నన్ను వెండించుము, నన్ను వెండించుము," అని దేవుడు నీతో మాట్లాడుచున్నాడా? ఆయనతో ఈ విధముగా వాదములు వేయుచున్నావా? తప్పక వెంబడిస్తాను. కొన్ని సంవత్సరాలు గడిచిన తరువాత అయితే ముందుగా నా బిడ్డలందరికి వివాహాలు కానిమ్ము." మనము దేవునికి లోబడకుండునట్లు అపవాది ఎన్ని ప్రయత్నములైనను చేయును. భూదిగంతములకు దేవుడునిన్ను పంపించును. ఆయనకు లోబడుటకు నీకు ఆయన సహాయము చేయును గాక మనుష్యరీతిగా నీకేమైనను యోగ్యతలు కలవా లేవా యని తలంచకుము. ఆయనకు లోబడుటకు ఇష్టపడిన ఎడల మనలో ఎట్టి వానినైనను దేవుడు ఉపయోగించగలడు. అయితే నిన్ను బలిమితో బలవంతపెట్టడు "నీకు

నా జీవితమును సమర్పించుకొంటున్నాను." అని దేవునితో నేను చెప్పిన వెనుకనే తన మార్గమును అనుసరించియే ఆయన నన్ను ఉపయోగించు కొనుచున్నాను. తర్ఫీతుచేసి ఆయన ఏయే పరీక్షలగుండా నన్ను తీసుకొని వెళ్ళునో, అవి ఇన్ని యన్ని కావు. అయితే వాటి యన్నిటి నిమిత్తము, ఆయనకు వందనములు చెల్లించువాడను. నిన్ను నేను బ్రతిమాలి వేడున దేమనగా, ఇప్పుడే ఆయనకు లోబడుము. 'నా జీవితమును అంగీకరించి నీ చిత్తప్రకారము నన్ను ఉపయోగించుకొనుము.' అని ఆయనతో చెప్పుము.

ఒక భిక్షకుడు వీణె నొకటి వాయించుచు భిక్షము ఎత్తుచుండెను. దినమునకు రెండు రూకలు సంపాదించుట ఎంతో కష్టము. ఒక దినము భిక్షకుని సమీపము నుండి వెళ్ళుచుండిన ఒకడు ఇతనిని చూచెను, ఆ బాటసారి వీణెవాద్యపుంగవుడు. అతడు భిక్షకుని చెంతకువచ్చి, 'కొంచెము సేపు నీ వీణె నాకిమ్ము' అనెను. భిక్షకుడు ఆ రెండవ వ్యక్తికి దానిని ఇవ్వగా అతడు వాయించసాగెను. వెంటనే జనులు గుమిగూడిరి. వీణ వాద్య పుంగవు వారితో; 'ఏదైనా, ఇవ్వాలని మీకుంటె మీకు తోచింది ఏదైనా ఈ భిక్షగానికి ఇవ్వండి' అనెను. ఆ దినమున ఆ భిక్షకుడు ధనవంతుడాయెను. ఆభిక్షగాడు దానిని వాయించినంత కాలము ఆవీణెయందు ఇంపు సొంపు కానరాకుండెను. ఆ వీణె ఎప్పుడైతే, సంగీతోత్తముని చేతబడెనో విచిత్రమైన గానము దానినుండి బయలు దేరెను. అట్లె మనము ప్రభువైన యేసుక్రీస్తుకు మనంతట మనమే అప్పగించుకొనిన యెడల ఆయన మనలో నుండి అద్భుతకరమైన పరలోక సంగీతము బయలుదేరజేయును. ఆయనకు లోబడి ఆయనతో 'నా ప్రభువా నిన్ను వెంబడింతును. నా జీవితమును అంగీకరించుము. నీ సాక్షిగా చేయుము. నీ మహిమార్థము నన్ను ఉపయోగించుకొనుము. నీ నిమిత్తము సంతోషముగా వ్యయపరచెదను; నిన్ను నేను వ్యయపరచు

కొందును.' అని ఆయనతో చెప్పుము. నీవు యౌవనస్తుడవుగా నుండగానే నీ జీవితమును ఆయనకు అప్పగించుము. ముసలితనము వచ్చు వరకు కనిపెట్టవద్దు. 'సమాధాన పరచువారు ధన్యులు; వారు దేవుని కుమారులనబడుదురు.' వారు దేవునికి పూర్ణ సంతోషము నిత్తురు.

✤ ✤ ✤ ✤ ✤

# 8

# ఉప్పును శుభ్రపరచుట - 3: శ్రమలు

## ఉప్పు-దైవిక జీవితముయొక్క రహస్యము

"మీరు లోకమునకు ఉప్పయియున్నారు" అను లేఖనము లోని ఈ చిన్న భాగము తిరిగి గమనించు చున్నాము. మీరు ఎక్కడకు వెళ్లినను ప్రయాణమందుండినను, ప్రభువు సేవ చేయుచుండినను, ఏమియుచేయక కూర్చుండినను, దేవుడు మిమ్ములను లోకమునకు ఉప్పయియుండునట్లు వాడుకొనవలెనని నా హృదయపూర్వకమైన ప్రార్థన. ఈ ప్రశస్తమైన పరిచర్య నాలుగు దయా పూర్వకమైన ప్రార్థన. ఈ ప్రశస్తమైన పరిచర్య నాలుగు దయా పూర్వకమైన మాటలద్వారా దేవుడు నీలో నెరవేర్చునట్లు ఇంత సులభమైన సాధనముద్వారా దేవుడు నీకు సహాయము చేయువచ్చును. దుఃఖము, వ్యాధి, కష్టము, బాధ ఇట్టి వాటివలన కృంగియున్న అనేకులు నీ ద్వారా దైవిక జీవనమును కలిగియుండు సంతోషమును రుచింప వీలుపడును.

ఆ దైవిక జీవము నీలోనే ముందుగా ప్రవేశించియుండని యెడల దేవుడునిన్ను ఎన్నటికిని ఉపయోగించలేడని చెప్పనవసరములేదు. ఒక సమయమున ఉత్తర ఇండియాలో దాదాపు ఏడు వారములు ఒక సువార్త దండయాత్ర నడుపుచుంటిని. ఈ దండయాత్ర పూర్తియైన తరువాత మేమొక ప్రేమ విందు పెట్టుకొందుమని ప్రకటించితిమి. ప్రతి కుటుంబము కొంత భోజనము తీసికొనిరావలెను. ఆ ఆహారమంతయు కలుపబడి అందరికి పంచబడును. అందరు ఎంతో ప్రేమతో ఆహారము తెచ్చిరి. ఆ ప్రేమ విందు మాకెంతో ఆనందకరమైన సమయముగా

నుండెను. అటు వెనుక మేము ఆ నగరమునుండి వెళ్ళి పోతిమి కొన్ని మాసములు గడిచెను. ఆ నగరములోని మిషనరి క్రీస్తు జన్మదినమున ఒక ప్రేమవిందు జరుగునని ప్రకటించి, అందరికి తమతమ భోజనములను తెచ్చుకొని సమస్తమైన వారితో పంచుకొని విందార గించునట్లు చెప్పెను. క్రీస్తు జన్మదినము వచ్చెను. వచ్చిన వారిలో ఒక్కరైనను భోజనము తెచ్చియుండలేదు. అందుకా మిషనరీ కోపంతో కొన్ని వారముల క్రితము అంతా మంచి మంచి వంటలు తెచ్చారే ఈనాడు అలాగెందుకు చేయలేదు? అని వారితో అనెను. ఆ సమయమున సహవాస ప్రేమను అనుభవించడమువలన మా భోజనాలు ఆశతో తెచ్చుకొంటిమి. ఇప్పుడైతే ఇక్కడ ఏ ప్రేమ సహవాసములేదు. అంతా మాటలేయనివారు ప్రత్యుత్తరమిచ్చిరి. ప్రేమను నీవు అనుభవించి ఉంటేనేగాని ఎవరినికూడ ప్రేమలోనికి నడుపలేవు. ముందుగా నీవు ఉప్పు కావలెను. అప్పుడు దానియంతట అదే దైవ ప్రేమనీలో ప్రవేశించి, నీ ద్వారా ఇతరులలో పోయబడును.

మనలను దేవుడు ఏర్పరచుకొనివున్నాడని దేవుని వాక్యం చెప్పుచున్నది. మనలను శుభ్రపరచి మేలైన ఉప్పుగా చేయవలెనని ఆయన కోరిక. ఏయే దైవ కార్యములద్వారా మనలను శుభ్రపరచవలెనో, మత్తయి 5వ అధ్యాయమందు చూచుచున్నాం. మన దుర్భరతలు ఎన్ని యుండినను ఈ యన్నింటిద్వారా మనలను శుభ్రపరిచ దైవ సద్గుణములు మనము పొందునట్లు దేవుడు చేయగలడు. బిడ్డల సంగతి చూడగా మంచి తెలివి తేటలు గల వారు భూమిమీద వర్ధిల్లుట సాధ్యము. గాని ఏటేట ఉన్న తరగతిలోనే పడియుండు వారికది సాధ్యముకాదు. ఆత్మీయ ఆశీర్వాదములకైతే తెలివి తేటలు అవసరములేదు. అందరికి లభించును. మందబుద్ధులైన వారిక, తెలివిహీనులకు, పేదకుటుంబములకు చెందినవారికి, దీన స్థితిలోని

దేశస్థులకు, పరిస్థితులు బాగులేనివారికి లభించి, వారు మేలైన ఉప్పుగా చేయబడి దైవ సద్గుణములచే నిండియుండగలరు. అనుదినము తరచుగా ఉదయము పెందలకడనే పాపులను వెదకుచు యేసుక్రీస్తు ప్రభువు వెళ్ళుచుండును. దీని ఫలితము ఏమనగా; అవమానపు బ్రతుకు వలన ఎందులకు కొంచెమైనా పనికి రానట్టి మనుష్యులను శక్తిమంతులైన దైవ స్త్రీ పురుషులుగా రూపాంతరపరచెను. వారిట్లు మారిన పిమ్మట వారి ద్వారా గొప్ప గొప్ప కార్యములను దేవుడు జరిగించి యున్నాడు. శుభ్రపరచు ఉప్పు యొక్క మరియొక విధానమును పరిశీలింతము.

## శ్రమలు - ఒక ఆశీర్వాదమే

మత్తయి 5:10లో ఇట్లు వ్రాయబడి యున్నది. "నీతి నిమిత్తము హింసింపబడువారు ధన్యులు; పరలోక రాజ్యము వారిది" చాలా సంవత్సరముల క్రిందట ఒక కుంటి పంజాబీ వాడుండెను. అతడు నిజముగా తిరిగి జన్మించి బాప్తిస్మం పొందినవాడు అతని కాంతిగల ముఖమును చూచి దేవుడు అతని జీవితమందు ఒక మహాకార్యమును చేసియున్నాడని ఎవరైనను చెప్పగలరు. అయినను అతని గ్రామస్థులు అతనిని హింసించి, తన పాత మతమునకు అతనిని త్రిప్పివలెనని చూచిరి. అతడు విశ్వాసమందు బలముగాను, దృఢముగాను నిలిచి యుండుట వలన అతని సామానులను ఇంటినుండి తీసి వెలుపల పారవేసిరి అతనిని తృణీకరించిరి. వారి బావిలోనుండి అతనిని నీరు తోడుకోనివ్వలేదు. అతనికి హాని కలుగజేతుమని కూడా బెదిరించిరి. దేనికి జడియక ఈ కుంటివాడు ఒక చెట్టు క్రిందకుపోయి నివసించుచు, దూరమునుండి నీళ్లు తెచ్చుకొనుచుండెను. ఒకానొక మిషనేరి ఇతని విశ్వాసమును గూర్చివిని అతనిని చూడవచ్చెను. అతడు అపాయమందుండెనని విని అతనికి సహాయము చేసి రక్షించవలెనని

తానువచ్చినట్లు చెప్పెను. అయితే ఆ మనుష్యుడు ఆ గ్రామము విడిచి పోవుటకు నిరాకరించెను. "దేవుడు నన్ను ఈ గ్రామములో ఆయన సాక్షిగా ఉపయోగించుకొను నిమిత్తమై నన్ను రక్షించి, నీ జీవితమును మార్చెనని అతడు ప్రత్యుత్తరమిచ్చెను. ప్రభువు కొరకు నేను ప్రాణము పెట్టవలసినగాని సిద్ధముగానే ఉన్నాను. ఈ ఊరు విడిచి పెట్టను" అని తెలిపెను. ప్రతి ఉదయము ప్రకాశమైన ముఖముతో తన పని ప్రారంభించుచుండెను. తనను హింసించుచుండిన వారికొరకు ప్రార్థన చేయుచుండెను. ఇదంతయు చూచిన పిమ్మట ఇతడు దైవజనుడని ఆ గ్రామస్థులకు నిశ్చయమాయెను. అతని యొద్దకువచ్చి క్షమాపణ కోరి, ఇంతటి ఆశ్చర్యకరమైనరీతిగా అతడు దేవునికనుగొని యుండెనని, వారు గ్రహించియుండలేదని ఒప్పుకొనిరి. ఇట్లు ఈ కుంటి వానిమూలముగా అనేకులు రక్షణాను భవమును పొందిరి. శ్రమలను ఓర్చుకొనుట వలన మన విశ్వాసము దృఢపడును. మనము ప్రభువును వదలక పట్టుకొందుము. దేవుని వాక్యం, "నీతి కొరకు హింసింపబడు వారు ధన్యులు"యని చెప్పుచున్నది (మత్తయి 5:10)

కొన్ని సం॥ల క్రిందట మహమ్మదీయుడొకడు నన్ను చూడవచ్చి తాను క్రైస్తవుడగుటకు కోరుచున్నాడని నాతో చెప్పెను. అతడు సర్వకళాశాల పట్టము కలిగినవాడు. "ఎక్కడైనను కూటములకు వెళ్ళియుంటివా," యని అడిగితిని. "లేదు" అనెను. అయితే, సువార్తలో ఇంత శ్రద్ధనీకేలాగు కలిగెను?" అంటిని. అతడు చెప్పినదేమనగా, తన యింటిపొరుగున ఒక హిందువుడైన స్నేహితుని ఒకనాడు చూడపోయెను; ఆ ఇంటిముందు ఒక చిన్న వసారా యుండెను; ఈ మహమ్మదీయుడు అక్కడ నిలబడియుండగా, దొడ్లు తుడిచేవాడు ఒకడు వచ్చి తన గంపను ఒక మూలలోపెట్టి, ఆ వసారాను తుడుచుచుండెను ఆ సమయమందు హిందువుడైన ఒక వ్యాపారస్తుడు కూడ ఆ యింటికి వచ్చి వసారాలో

ప్రవేశించెను. అతడు కట్టిన పంచ (దోవతి) ఆ గంపకు తగిలెను. ఆ వ్యాపారస్తుడు బహుగా కోపపడి కాలునుండి చెప్పుతీసి "నీ గంప ఇక్కడ ఎందుకు పెట్టుకొన్నావు?" అనుచు ఆ తుడిచేవానిని ఆ చెప్పుతో కొట్ట నారంభించెను. "నాది తుడిచేపని తుడవటానికి వచ్చితిని" అని జవాబిచ్చుచు, ఆ మనుష్యుడు దెబ్బలు కొట్టుటకు ఇంకొక చెంపను కూడ త్రిప్పి "దేవుడు నిన్ను దీవించుగాక" అనెను. ఆదంతయు జరిగిన తరువాత మహమ్మదీయుడు తాను సమస్తము చూచినందున "ఆతడు నిన్ను కొట్టుచుంటె ఎందుకు ఊరకున్నావు? అది నీ తప్పుకాదు, నీ వు నీపని చేస్తున్నావు. తప్పంతా వాడిదే. పంచ (దోవతిని) కొంచెము పైకెత్తుకొని వాడు నడవవలసింది" అనెను. తుడిచే వాడు "నా కొరకు నా ప్రభువు అంత హింస భరించగా ఆయన కొరకు నేను ఈ మాత్రము సహించ కూడదా?" అనెను. నన్ను చూడవచ్చిన ఆ మహమ్మదీయుడు "ఆ తుడిచే వాని ప్రేమ నాలో పనిచేసినది. అందుకే నేను క్రైస్తవుడను కావలెను" అని నాతో చెప్పెను. అతడు క్రైస్తవుడాయెను; బాప్తిస్మము పొందెను. ప్రభుయొక్క మంచి సాక్షియాయెను. "నీతి నిమిత్తము హింసింప బడువారు ధన్యులు." చూడుము, హింసలను మనము నెమ్మదితో ఓర్చు కొనుటవలన ఇతర హృదయములలో ప్రేమను ప్రవేశింప జేయవచ్చును.

అపొస్తలుల కార్యములు 7:54 నుండి 60 వరకు మరొక నిదర్శనము కనబడుచున్నది. స్తెఫను అనబడిన ఒక దైవజనుడు పరిశుద్ధాత్మతో నింపబడియుండుట చూచుచున్నాము. ప్రభువైన యేసుక్రీస్తును గూర్చిన సాక్ష్యము ఇచ్చినందులకు ఇతడు హింసింపబడుట చూచుచున్నాము. అతడు అనేక మంచి కార్యములు చేసియుండెను. బీదలు, విధవరాండ్రు, తండ్రిలేని బిడ్డలు ఇతని ద్వారా ఆశీర్వాదములు పొందియుండిరి. అయినప్పటికిని మత నాయకులు అతని మీద కోపాగ్నితో మండిపడుచుండిరి. అతని మీద అబద్ధనేరము మోపిరి. అయినను

అతడెట్లు వారిని క్షమించెనో చూడుడి. రాళ్ళతో కొట్టబడుటకు సమ్మతించెను. ప్రకాశించుచున్న ముఖముతో మరణమును ఎదుర్కొనెను. రాళ్ళతో అతనిని చావగొట్టుచున్న వారిని స్తైఫను శపించక; "ప్రభువా వారిమీద ఈ పాపము మోపకుము. వారిని కరుణించి క్షమించుము" అని వారి కొరకు ప్రార్థించెను.

సౌలు అనబడు ఒకడు ఇదంతయు చూచుచుండెను. స్తైఫనును రాళ్ళతో కొట్టి చంపిన మనుష్యులు తమ వస్త్రములను సౌలు పాదముల యొద్ద పెట్టిరి. సౌలు స్తైఫను చావుకు సమ్మతించెను, (అపొ.కా.8:1) స్తైఫను మరణమునకు అతడొక సాక్షి. ఆ కాంతిగల ముఖమును చూచినవాడు, "నా శత్రువులను క్షమించు తండ్రి" అని స్తైఫను చేసిన ప్రార్థన వినినవాడు. ఇంత సంతోషముతో బాధను ఎట్లు సహించెనని అతడు ఆశ్చర్యపడి యుండవచ్చును. ఇదే సౌలు అటు తరువాత పౌలు అనబడిన ఆ గొప్ప అపోస్తలుడాయెను. ఇదెంతటి మార్పు అంకురించెను. ప్రభువైన యేసుక్రీస్తును అత్యధికముగా ద్వేషించిన శత్రువులలో సౌలు ఒకడు, విశ్వాసులను కారాగృహములకు ఈడ్చుకొని పోయి యుండెను. వారిలో అనేకులను చంపెను. ఇప్పుడు చూడగా అతడు క్రీస్తు సేవకుడాయెను. అపొ.కా. 16:24,25 చూడుము. పౌలును, సీలను పట్టుకొని వారి వస్త్రములను లాగివేసి వారిని చాలా దెబ్బలుకొట్టి, చెరసాలలో త్రోసి, వారి కాళ్ళకు బొండవేసి బిగించిరి. అయినప్పటికిని మధ్య రాత్రివేళ పౌలును, సీలయు సంతోషముతో దేవునిగూర్చి ప్రార్థించుచు కీర్తనలు పాడుచుండిరి. సణుగుడు గాని మూల్గులుగాని శాపముగాని వారి నోట నుండి రాలేదు. దేవునికి స్తుతి కీర్తనలు పాడుచుండిరి. స్తైఫను యొక్క ఆదర్శము పౌలును ఎట్లు మార్చివేసెననగా కారాగృహందుండిన వారి కెల్ల అతడు నూతన జీవము, ఆశీర్వాదము తేగలిగెను, ఇతర ఖైదీలు కూడా దేవునికి స్తుతికీర్తనలు పాడసాగిరి. [illegible]

జరుగునది ఏమనగా కారాగృహమందు పడవేయగా మొదటి రాత్రి ఖైదీలు అట్టివారు కాదు ఇతరులు సాధారణముగా ప్రవర్తించునట్లు, కొట్టుకొనుచు జగడములు చేయుచునుండక దేవునికి స్తుతికీర్తనలు పాడుచున్నారు. దేవుడేమి చేసెననగా; ఒక భూకంపము పంపెను. దానివలన ఆ స్థలమంతయు అదరిపోయెను. ఖైదీల గొలుసులు బంధకములు ఊడిపోయెను. బంధింపబడిన వారందరు తప్పించుకొని పారిపోయిరని భావించి, చెరసాల నాయకుడు తన ప్రాణము తీసివేసికొన బోవుచుండెను. దానిని చూచి పౌలు 'మేమందరము ఇక్కడేయున్నాము, నిన్ను నీవు చంపుకొన వద్దు" అని చెప్పెను. (వచనములు 26,27). "నీతి నిమిత్తము హింసింపబడుట ఘనమైనట్టియు, భాగ్యకరమైనట్టియు, సంతోషకరమైనట్టియునైన విషయము చూడగా ఒకరవ్వంత ఉప్పు అయిన చెరసాలనంతయు మార్చివేసెను. ఆ చెరసాలలో పడి యుండిన వారు ఎట్టివారు? నరహంతకులు, దౌర్జన్యము చేసినవారు, దొంగలు. ఇప్పుడు అంతా గొర్రెపిల్లలే! మారిపోయిన ఈ ఖైదీలు ప్రభువైన యేసుక్రీస్తుకు సాక్షులైరి. ఈ విధముగానే ఐరోపాలో సువార్త ప్రచురింపబడినది. స్తెఫను ఆనందముతో హింసను భరించినందున అతడు మరణించినను లోకమందంతట సంఘమునకు క్రొత్త ఆశీర్వాదము కలిగెను. ఈ ఆశీర్వాదము వ్యాపించుచునే వెళ్ళుచు ఇప్పటి వరకు కూడా అట్లే సాగుచున్నది. 2తిమోతి 3:12లో దేవుని వాక్యము చెప్పుచున్నది ఏమనగా నీవు దైవభక్తి, పరిశుద్ధ జీవితము కలిగియుండవలెనంటే, మరియు ప్రభువైన యేసుక్రీస్తును వెంబడించవలెనంటే నీవు ఎవరవైనను, నీ యోగ్యతా పరిస్థితులెట్టివైనను నీవు హింసను ఓర్చుకొనక తప్పదు.

### శ్రమలో సంతోషించి ఆనందించుడి

మత్తయి 5:12లో, "సంతోషించి ఆనందించుడి" అని వ్రాయబడి యున్నది. నీవు హింసింప బడినప్పుడు ఇతులు నీ మీద అన్యాయముగా

నిందలు మోపినప్పుడు, వారు పాఠశాల యొక్క లేక కళాశాల యొక్క అధికారులై యుండినను ఓర్చుకొనుము. నీకు రావలసియున్న ప్రమోషన్ వారు నీ కివ్వకుండినను చింతించవద్దు. నీవు నష్టపడిన దానికంటె హెచ్చుగా దేవుడు నీకిచ్చును. కొంత మంది పాఠశాల ఉపాధ్యాయులు బడికిరాని విధ్యార్థులు హాజరైనట్లుగా రిజిష్టరులో అబద్ధగుర్తులు పెట్టుదురు. వారట్లు చేయని ఎడల శ్రమలపాలగుదురు తోటి ఉపాధ్యాయులు వారికి విరోధముగా కుత్రలు పన్నుదురు. నిర్దోషివై నీవు అలాగే బాధలు పెట్టబడితివా దేవునికి వందనములు చెల్లించి స్తుతించుము. ఎందుకనగా సంతోషముతో బాధలు సహించువారికి దేవుడు తప్పక మంచి బహూమానము నిచ్చును నీ పని పోయినను, అత్యంత బాధపొందు చుండినను ఆనందించుము. నీ ద్వారా ఇతరులకు కలుగు ఆశీర్వాదమును తలచుము. పొరుగువారి వలననో స్నేహితుల వలననో నానావిధములైన శ్రమలు పొందుటకు సిద్ధముగాను, నమ్మతము గాను ఉండవలెను. మనము పాపము, అవమానములతో నిండిన లౌకిక జీవితములు జీవించుచుండిన కాలమందు మన లౌకిక స్నేహితులకు ఎంతో ఇష్టులముగా నుంటిమి. ఇప్పుడైతే యేసు క్రీస్తు ప్రభువును వెంబడించి పరిశుద్ధ జీవితము జీవించవలెనని మనము కోరగా మనలను హింసించు చున్నారు. ఈ సంగతి ఎంత వింతగా నున్నది. అయినప్పటికిని ఈ బాధలనోర్చి నందులకు మనకు బహూమాన మిచ్చునట్టి దేవునికి వందనములు చెల్లించవలెను. అపొ.కా.13:50-52 చూడము. నమ్మకస్తులైన కొందరి భక్తులద్వారా పిసిదియలోనున్న అంతియొకయకు దేవుని వాక్యము వచ్చెను. అనేకల జీవితములు మారిపోయెను. ఆశ్చర్యకరమైన ఈ పరిచర్యను బట్టి ఆ భక్తులకు కృతజ్ఞులై యుండుటకు బదులుగా ఆ ప్రాంతపు ప్రజలు వారిని ద్వేషించి, శ్రమలు పెట్టసాగిరి. "మీరు మాకిక్కడ అవసరములేదు. వెళ్లిపొండి వెళ్ళిపొండి" అనిరి. ఆ శిష్యులు అంతియొకయను విడిచి పెట్టి ఈ కొనియకు వచ్చి వారికి

సంభవించిన సంగతులను అక్కడి స్నేహితులతో చెప్పిరి. అప్పుడు వారందరు పరిశుద్ధాత్మతోను నింపబడిరి. వారు సణుగలేదు, విసుగలేదు; శ్రమలు పొందు భాగ్యము దొరికినందున దేవునికి వందనములు చెల్లించిరి.

లోక చరిత్ర చదువగా అనేకమంది విశ్వాసులు చెప్పరాని శ్రమలు పొందిన వారని తెలిసికొనుచున్నాము. ప్రభువైన యేసు క్రీస్తు నిమిత్తము అనేకులు హతులైరి. ఈ దినములలో ఒక పెద్ద స్టేడియం నందు జరుగుతున్న ఫుట్‌బాల్ ఆటను చూచుట మనకెంత ప్రియముగా నున్నదో అట్లే అట్టి రంగమందు పస్తుపడిన సింహములకు మేతగా వేయబడిన క్రైస్తవ విశ్వాసులను అవి చీల్చి భక్షించుట చూచుటకు రోమా పురజనులు సంతసిల్లుచుండిరి. ఎక్కడెక్కడ నుండియో క్రైస్తవ భక్తులను పురుషులనేమి, స్త్రీలనేమి, పిల్లలనేమి పట్టుకొనితెచ్చి మీరు యేసుక్రీస్తు విడిచి పెట్టని యెడల ఆ ఆవరణలో సింహములకు పడవేయుదుము" అని వారిని రోమాజనులు బెదిరించెడివారు. సింహములు ఆ పిల్లలను భక్షించుట వారి తల్లులు చూడవలెనని మొదట తల్లుల కంటి యెదుట బిడ్డలను పడవేసెడివారు. వారి అట్టి కఠిన హృదయులు. "మీరు క్రీస్తును బొంకుటకు మరికొంత సమయమిత్తుము; అట్లు చేయనియెడల సింహములకు మేత అగుదురు' అని క్రైస్తవులను మరల మరల బెదిరించెడివారు. ఈ బెదిరింపులకు ధీరులైన ఆ స్త్రీ పురుషులు లొంగలేదు. స్తుతి కీర్తనలు పాడుచు సింహములనోటిలో పడుటకై ఆ ఆవరణములో ప్రవేశింతురు. అట్టి సమయములందు సింహములచే చీల్చబడుటకై ఎంత కాంతిగల ముఖములతో విశ్వాసులు వరుసగా నడుచుచుండిరో చూచిన అనేకమంది రోమీయులు మారు మనస్సు పొందిరి. మరొక విధమైన హింస. కొందరు విశ్వాసులను జుట్టు పట్టుకొని వీధులందంతట ఈడ్చుకొని పోవుచుండిరి. మరికొందరు కంటిలో మిరపకాయ పొడి వేసిరి. అయినప్పటికిని తమ ప్రభువైన యేసుక్రీస్తును బొంకకుండిరి. క్రీస్తు తరువాత 300ల ఎండ్ల

వరకు ఇట్లు జరుగుచుండెను. శ్రమల యందు ఆనందించుచు, ఈ విధముగా నిజమైన సంఘము యొక్క పునాదిని వీరు వేసిరి.

కొందరు క్రైస్తవులు బొట్టు పెట్టుకొను చున్నారు క్రైస్తవులు అనిపించు కొనుటకు సిగ్గు. హిందువులలో కలిసిపోవుటకు ఇష్టము. కరాచి (పాకిస్తాను)లో జరిగిన మతసంబంధమైన కలహములలో బొట్టు పెట్టుకొనిన ఒక క్రైస్తవురాలిని ఒక మహ్మదీయుడు చూచి హిందువురాలని భావించి తన కత్తిని దూసి ఆమెను బొబ్బలు పెట్టెను. "నీవు క్రైస్తవురాలువా అయితే నీ నొసటిమీద ఉన్న బొట్టేమి?" అని అతడు అడిగెను. వెంటనే కొంత ఉమ్మి నోటినుండి తీసి ఆ బొట్టును ఆమె చెరిపివేసెను. అనేక మంది క్రైస్తవులు యేసుక్రీస్తు ప్రభువు యొక్క నామము కొరకు సిగ్గు పడుచున్నారు వారు శ్రమలను భరించుటకు భయపడుదురు. కావుననే వారి జీవితములు నిష్ఫలముగాను, సిగ్గుకరముగాను, చెడుగాను ఉన్నవి. మన శ్రమలను మనము సంతోషముతో సహించినపుడు మనము సమృద్ధిగా బహూకరించబడుదుము మన ద్వారా అనేకులు దైవిక ప్రేమను రుచించుట మరియు దైవ వెలుగును చూచుటయే మన గొప్ప బహుమానమై యున్నది. "నీతి నిమిత్తము హింసింపబడువారు ధన్యులు; పరలోక రాజ్యము వారిది". అన్యాయముగా నీమీద ఇతరులు నేరము మోపనిమ్ము. ఆత్మీయముగా నీవు ఎదుగవలెనంటె ఇట్టి అన్యాయ నేరములను లక్ష్య పెట్టకుము దాసుడు యజమానుని కంటె అధికుడు కాడు. ఎంత అధికముగా మనము యేసు క్రీస్తు ప్రభువుకు లోబడుదుమో అంత కంతకు హెచ్చుగా భక్తిహీనులు మనలను అన్యాయముగా నిందింతురు. అయితే మనము ఆయన వారమై యుండు భాగ్యము యిచ్చినందుకు దేవునికి వందనములు. "మీరు లోకమునకు ఉప్పయి యున్నారు."

## నీ జీవితము మంచి ఉప్పుగా నున్నదా?

రుచి ఇచ్చుట మాత్రమేగాక, చుట్టు ప్రక్కల నుండువారి కెల్లను విస్తార కృప కరుణ చూపునట్టి మేలైన ఉప్పుగా మనలను దేవుడు సిద్ధము చేయును గాక. లోకమునకు ఉప్పయి యుండుటను బట్టి మనము అనేకుల కన్నీటిని తుడిచి వేయగలము అనేక గృహములకు సంతోషము తేగలము. మరియు దుఃఖబాధలనుండి వారు తొలగించ బడునట్లు చేయుదుము. ఇట్టి పరిచర్యకు దేవుడు నిన్ను పిలుచు చున్నాడు. నాతోసత్యము చెప్పుము. నీ జీవితము మేలైన ఉప్పుగా మారినదా? యే వ్యక్తియైన నీ ద్వారా దైవ జీవము రుచించెనా? నీ తండ్రి నిగాని, తల్లి గాని, సహోదరుడుగాని, సహోదరిగాని రుచించెనా? నేను క్రైస్తవుడనైనప్పుడు "మన గొప్పమతమును ఎందుకు విడిచితివి" అని మా తల్లి అడిగెను. నేనిట్లు ప్రత్యుత్తర మిచ్చితిని: "అమ్మా, ఈ మాట చెప్పండి, నన్ను మీకంటె ఎక్కువగా ప్రేమించే వాళ్ళున్నారా? అయినప్పటికిని, నా ఆత్మరక్షణ విషయము మీరు చేయగలిగినది ఏమి చెప్పడి? ఆ విషయములో నీకు నేనేమి చేయగలను?" అని ఆమె చెప్పెను. అప్పుడు నేను "ఆ కారణము చేతనే యేసు క్రీస్తు ప్రభువును నా రక్షకునిగా గైకొంటిని. ఆయన నా ఆత్మను రక్షించియున్నాడు మీ రక్షణకోసరము కూడా నేను ప్రార్థన చేయుచున్నాను" అంటిని. ఒకానొక దినమున మాతల్లి నాతో, "నేను సిద్ధముగా ఉన్నాను" అని చెప్పగా వినుట నాకు ఎంత సంతోషము!

నిన్ను నీవుతగ్గించుకొని నీ పాపములను ఒప్పుకొనిన యెడల యేసు ప్రభువు నిన్ను తన రక్తమందు కడిగి, నీకు క్రొత్త జీవము నిచ్చును. ఆ జీవము నీలో ప్రవేశింపగా నీవు ఉప్పువలె నగుదువు. అప్పుడు నీవు ఎక్కడకు వెళ్ళినను ఎల్లప్పుడు క్రొత్తరుచి క్రొత్త జీవము, క్రొత్త ఆశీర్వాదమును ఇవ్వగలవు.

✤ ✤ ✤ ✤ ✤